# రోగాలు - అనురోగాలు

నవల

డా.కె.వివేకానంద మూర్తి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 234

కౌముది మాసపత్రికలో

జనవరి 2021 సంచిక నుంచి సెప్టెంబర్ 2022 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల




**సూర్యుడు జ్వరం** తగిలినట్టు బాగా వేడిగా వున్నాడు. ఆకాశం అడపాదడపా దగ్గుతున్నట్టు వుండి వుండి వురుముతోంది. రొంపట్టిన మేఘాలు చీదుకుంటున్నట్టు చినుకులు చిమ్ముతున్నాయి.

దాదాపు అరవై యేళ్ల క్రితం. పందొమ్మిది వందల అరవై వొకటి అప్పుడే అడుగుపెట్టిన వేళ.

నిద్రలేచిన విశాఖపట్నం బద్ధకం తీర్చుకుంటోంది.

బాలరాజు బస్సెక్కాడు.

విండో సీట్లోంచి చూస్తున్నాడు. విక్టోరియారాణి బొమ్మ బాగా మాసిపోయి ఆఫ్రికారాణి బొమ్మలావుంది. ఆవిడ కాళ్ల దగ్గర యిద్దరు ముష్టి దంపతులున్నారు. వాళ్లున్న పోజు - స్వాతంత్ర్యం తెచ్చుకున్నందుకు పశ్చాత్తాపపడుతూ ఆమె కాళ్లమీద పడి అడుగుతున్నట్టుగా వుంది. ప్రస్తుతం ఆ ముష్టావిడా, ముష్టాయనా అడుక్కోకుండా తీరిగ్గా వున్నారు. వాళ్లకది రెస్టు టైమోమో లేక వాళ్ల ముష్టిటైము మొదలవలేదో, లేక వాళ్లకి వొంట్లో బాగులేదో. బాలరాజు కాస్సేపట్లో వొంట్లో బాగలేని వాళ్లుండే యింట్లోకే అడుగుపెట్టబోతున్నాడు. అతని కుడిచేతిలో కాగితాలున్న కవరు చెమటకి కాస్త తడిసినట్టయితే యెడం చేతికి మార్చుకున్నాడు. ఉదయం యింకా పది కాలేదు. బస్సు నెంబరు పది కదిలింది. పక్కన కూర్చున్నాయన్ని అడిగాడు. మీరు యూనివర్సిటీదాకా వెళ్తారనుకుంటాను. కలెక్ట్రాఫీసు జంక్షన్ స్టాపు యెక్కడో కొంచెం చెబుతారా?'

'లేదు. నేను యెల్లమ్మ తోట దగ్గర దిగిపోతాను. అయినా తెల్సుకోడం సుళువే. అక్కడ నాలుగో అయిదో రోడ్లు కలుస్తాయి. మధ్యలో ట్రాఫిక్ పోలీసు బదులు వొక ఆవు నిలబడి వుంటుంది. అదే కలెక్ట్రాఫీసు జంక్షన్ '

బాలరాజు కండక్టర్ని అడగొచ్చులే అనుకున్నాడు. 'లక్ష్మీ టాకీస్!' లక్షమంది అరిచినట్టు వినబడింది. బస్సులో ఓ అరడజను మంది వోనరు మనుషులే వున్నారు. స్టాప్ స్టాప్‌కీ కోరస్‌లో అరుస్తున్నారు. కోయదొరల్లా రకరకాల యీలలు వేస్తూ కండక్టరుకీ డ్రైవరుకీ సంకేతాలిస్తున్నారు. ఆ ప్రైవేట్ సర్వీసు బస్సుని సొట్టలు పడేలా చేతుల్తో కొడుతున్నారు. బాలరాజుకి సరదాగా వుంది.

'రావలి - రాలి- రాలి- ఆంధ్రా సిటీ - ఆంధ్రా సిటీ'

'ఎదరకి జరగాలండీ ఎదరకి'

'ఇంజనీరింగ్ సీట్లు వెయిటింగ్ లిస్టు పెట్టేరా?'

'రామారావు వోవరు తగ్గిస్తే బాగుణ్ను.'

'ఈ దేశం మరి బాగుపడదు.'

'ఒరే బాబిగా, టికెట్ నేనుచ్చేసుకున్నా, యిగ నువ్ పుచ్చుకోమాకు.'

'ఫర్లేదు. తవరు సద్దుక్కూసేసుకోండి'

'రాత్రి పిప్పు సరుకు కూసింత వోవరైంది'

'బ్యాగ్ వాళ్లో తోపుకోండి'

'నా సీరికొంగు

స్ాట్రీ - స్ాట్రీ - టన్నుల స్ేట్రీ'

బాలరాజుకి బస్సు కిటికీలోంచి, కొండ కప్పుకున్న హాస్పిటలంతా తను యెక్కాల్సిన వున్నత శిఖరంలా కనిపిస్తోంది. విశాఖపట్నం వొకటీ రెండునూ వొకటి చేస్తూ యెత్తుగా పెరిగి నగరాన్ని చిన్న చూపు చూస్తోంది. ఆ బిల్డింగ్సేవిటో బాలరాజుకి యింకా వివరంగా తెలీడంలేదు. కొద్దిసేపట్లో యెలాగూ తను ఫస్టియర్ యం.బి.బి.యస్ అవుతాడు అన్నీ యెలాగూ తెలుస్తాయి. ఇంటర్వ్యూ ఫార్మల్‌గానే వుంటుందిట. అప్పుడే తన ఆరేళ్లముందు జీవితం టైమ్ టేబిల్ ఫిక్సయిపోయింది. మెడిసిన్ చదవబోయే తతంగమంతా, మనసులో తరంగంలా కదుల్తోంది.

'కలెక్ట్రాపీస్' అనే అరుపుతో బాలరాజు వులిక్కపడ్డాడు. బస్సు దిగాడు. వెనక్కి చూశాడు. దిగువగా జారిన రోడ్డు చివర బీచ్ నానుకుని నురగలు కక్కుతున్న సముద్రం దూరంగా దృష్టికందనంత దూరం పరుచుకుని వుంది. ముందుకి చూస్తే వొక పక్కన కలెక్ట్రాఫీసు మరో పక్క అతిపురాతనమైన కింగ్ జార్జిహాస్పిటల్.

బాలరాజు వుత్సాహంతో గబగబా హాస్పిటల్ గేటు సమీపించాడు. పెద్ద పెద్ద బిల్డింగ్స్, చుట్టూ ప్రహరీ. తనకు తనువు పులకరిస్తోంది. తలెత్తి చూశాడు. ఎత్తైన క్లాక్ టవర్. ముళ్లుమాత్రం తిరగడంలేదు. అంతలో వొక చిన్న డేగ వచ్చి పెద్దముల్లుమీద వాలింది. తొమ్మిదీ ఐదు కాస్త ముందుకి గడిచింది. డేగ యెగిరిపోయింది.

బాలరాజు గేటుదగ్గరకు అడుగుపెట్టాడు. 'పాస్' అన్నాడు గేట్‌మన్. బాలరాజు కాస్త జంకి తమాయించుకుని, 'నాకెందుకు పాస్. నేను స్టూడెంట్‌ని' అన్నాడు. గేట్‌మన్ యేవీ బదులు చెప్పకుండా దృష్టి తన వెనక్కి మరల్చి మరెవరినో

'పాస్' అంటున్నాడు. తను హాస్పిటల్ ఆవరణలో ప్రవేశించాడు. కాలేజ్ ఆఫీసు వున్న పానగల్ బిల్డింగ్‌కి యెటుపోవాలో యెదురుగా మరో శాల్తీని కనుక్కుని అటువేపు నడక సాగించాడు.

అంతా హాస్పిటల్ వాసన. తనకు సుగంధ పరిమళంలా వుంది. అటూ యిటూ తెల్లకోట్లు వేసుకుని మెళ్లో స్టెతస్కోపుని ధరించి పిల్ల డాక్టర్లు, ఆడపిల్ల డాక్టర్లు, పెద్ద డాక్టర్లు నేల చప్పుడవుతుందేమో నన్నట్టుగా నడుస్తున్నారు. నర్సులు అక్కడా అక్కడా ఆకాశంలో కొంగల గుంపుల్లా అగుపిస్తున్నారు. పెద్ద హాస్పిటల్స్‌లో పేషెంట్ల కంటే డాక్టర్లు, నర్సులే యెక్కువగా వుంటారేమోననుకున్నాడు. బెడ్స్ లేక వార్డు వరండాల్లో పడి దొర్లుతున్న రోగుల సంఖ్య తెలియని బాలరాజు.

రాజా ఆఫ్ పానగల్ బిల్డింగ్ మేడమీద కాలేజీ ఆఫీసు దగ్గరకు చేరేసరికి బాలరాజుకి, తనలాగే కొత్తగా సీటొచ్చిన అమ్మాయిలు, అబ్బాయిలు తారసిల్లారు. సెక్రటరీ వొక్కొక్కరినే ప్రిన్సిపాలుగారున్న గదిలోకి పంపుతున్నాడు.

కాస్సేపటికి తనవంతు వచ్చింది. భయం భయంగా మొదటి రాత్రి కార్యం గదిలోకి వెళ్లే కొత్త పెళ్లికూతురిలా ప్రిన్సిపాల్‌గారి గదిలోకి వెళ్లాడు. కూర్చోమంటే కూర్చున్నాడు.

తనచేతిలోని సర్టిఫికెట్స్ వగైరాలను సెక్రటరీ ప్రిన్సిపాల్ గారికి అందజేశాడు. ఆయన వాటిని పరిశీలించి, బాలరాజు ముఖంలోకి బాకు దింపినట్టు చూసి "ఉఁగో." అన్నాడు. బాలరాజు ప్రశ్నార్థకంగా సెక్రటరీ వేపు చూశాడు. సెక్రటరీ 'లే' అన్నాడు. తను లేచి బైటికి వచ్చాడు. వెనకే వచ్చిన సెక్రటరీ కేసి అనుమానంగా చూశాడు బాలరాజు. 'వెళ్లి త్వరగా ఫీజులు కట్టు' అని నవ్వుతూ భుజం తట్టి సాగనంపాడు సెక్రటీ. బాలరాజుకి ఆనందం అవధులు దాటింది. చెంగు చెంగున మెట్లు దిగాడు. మెట్లక్రింద యెవరో సీనియర్ స్టూడెంట్స్ తనముందు వెళ్లిన అమ్మాయిని ఏడిపిస్తున్నారు.

'చూడమ్మా!' రేపణ్నించి యీ పరికిణీ, జాకెట్టు మానేసి లక్షణంగా చీరె కట్టుకురా' -

ఆ అమ్మాయి భయంభయంగ తలూపి వెళ్లిపోయింది.

తర్వాత వాళ్లు తనని పట్టుకున్నారు.

'ఏమిటి బాబూ! అప్పుడే డాక్టరైపోయావా? ముందు సీనియర్స్‌కి దణ్ణం పెట్టు.'

తను పెట్టాడు.

'అలాకాదు. చెప్పరా!' పక్కవాడిచేత చెప్పించారు.

'గుడ్ మార్నింగ్ - మైడియర్ మైటీ మైటీ సీనియర్స్'

తను - 'గుడ్ మార్నింగ్ మైడియర్ మైటీ మైటీ సీనియర్స్'

'అద్గదీ - టైనీ టైనీ జూనియర్ - చూడు. రేపణ్నించి చక్కగా షూస్ వేసుకురా. శాండల్స్ మానెయ్యి. ఇది బ్రాత్రూమ్ కాదు. హాస్పిటల్. వోపెన్ షర్ట్ వోపెన్‌గా వుంచకు. టక్ చేసుకురా. వెళ్లు.'

గండం గడిచిందనుకుంటూ బాలరాజు బైటపడ్డాడు.

నోటీసు బోర్డులో ఫీజు యెలా కట్టాలో యేమిటో చూసి నోట్ చేసుకుని కలెక్ట్రాఫీసుకి పరిగెత్తాడు.

అక్కడ రామకోటిరాసినట్టు, వొక్కొక్క చలాను వందేసి సార్లు యింపోజిషన్ రాయించారు. తర్వాత చలాన్లమీదా, వాటి వెనుక తన ముఖంమీద, వీపు మీద రకరకాల ముద్దర్లు కొట్టారు. ఆ తర్వాత డబ్బు కట్టుకున్నారు. రసీదులకి సాయంకాలం రమ్మన్నారు. కాలేజీకి డబ్బు తీసుకోవడం కూడా దీర్ఘరోగంతో తీసుకున్నట్టుగా వుంది. అవును మరి. యం.బి.బి.యెస్ కదా అనుకున్నాడు.

మధ్యాహ్నం దగ్గర హోటల్లో భోంచేసి, మళ్లీ కలెక్ట్రాఫీసుకి వెళ్లి చలాను రసీదులు తీసుకుని, కాలేజీ ఆఫీసులో యిచ్చేసి, తను దిగిన లాడ్జింగ్ రూముకి వెళ్లి కాసేపు నడుం వాల్చాడు. చదవబోయే చదువు గురించి యెన్నెన్నో ఆలోచనలు.

మర్నాడు బాలరాజు హాస్టల్లో చేరాడు. హాస్టల్లో వసతులన్నీ బాగనే వున్నాయి కానీ సీనియర్స్ చేసే రాగింగ్ కార్యక్రమాలు మాత్రం భరించడం కష్టంగా అనిపించింది. రోజూ లేచింది మొదలు, కాలేజీకి వెళ్లి తిరిగొచ్చి, రాత్రి భోంచేసి చదువుకుని పడుకునేదాకా సీనియర్స్ పెట్టే రకరకాల చిత్రహింసల్నుంచి తప్పించుకోవడం గగనంగా వుంది.

ఉదయమే లేచి తను కాలేజ్‌కి తయారయ్యాడు. తన రూమ్‌మేట్ యింకా స్నానాల గదిలోనుండి రాలేదు. కారణం యేవిటా అని ఆలోచిస్తూంటే బ్రాత్రూమ్‌నుండి ఆక్రందన వినబడింది. తను అటువేపు వెళ్తే వొక బ్రాత్రూమ్ తలుపు - 'తియ్యండి మొర్రో' అంటూ చప్పుడవుతోంది. తెరిచి చూస్తే వొంటినిండా సబ్బు రాసుకుని తన రూమ్ మేట్ - 'ఇదేవిటీ?' అని అడిగితే 'నన్ను లోపల పెట్టి బైట గడియపెట్టారు. పైగా పైన వాటర్ టాప్ కట్టేశారు' అన్నాడు దీనంగా.

'సర్లే' అని తను వెళ్లి టాప్ తిప్పి నీళ్లొచ్చేలా చేసి వచ్చాడు. కాస్సేపట్లో రూమ్ మేట్ రంగనాథం తయారై వచ్చాడు.

కాలేజ్‌కి వెళ్లే హాస్టల్ బస్ కదిలింది. బస్‌లో కూర్చున్న బాలరాజుకి తన క్లాస్ మేట్స్ అంతా తలోవిధంగా కనిపించారు. వొకరు ముఖంనిండా బూట్ పాలిష్ పూసుకుంటే, మరొకడు చొక్కా తిరగేసి తొడుక్కున్నాడు. యింకో విద్యార్థి తలమీది జుట్టు మునీశ్వరుడి శిఖలా చేసి, చివర ముడేసి వొక పువ్వు పెట్టారు. ఇలా అందరూ అస్తవ్యస్తంగానే వున్నారు.

క్రితం యేడాదివరకు యిప్పుడు తను చేరిన ఫస్టియర్ పి.పి.పిసి (ప్రీ ప్రొఫెషన్ కోర్స్) పేరుతో పక్కనున్న ఎ.వి.ఎన్ కాలేజీలో వుండేదిట. ఈ యేడాదినుండి దాన్నక్కడ పిఖేసి, సిలబస్ కాస్త కిందామీదా చేసి ఫస్టియర్ యం.బి.బి.యస్‌గా తయారు చేసి మఠ దీర్ఘరోగిలా దాన్ని హాస్పిటల్లోనే అడ్మిట్ చేసేసారు. కొత్తగా అడ్మిట్ అయిన రోగికి బెడ్స్ వెంటనే దొరకనట్లే, యీ కొత్త ఫస్టియర్‌కి క్లాసు రూములు దొరకలేదు. అంచేత అందాకా క్లాసులు క్లినికల్ సైడ్‌నే ఎడ్జస్ట్ చేశారు. ప్రాక్టికల్ క్లాసులను ఫార్మకాలజీ బయోకెమిస్ట్రీ లాబ్స్‌లో ఏర్పాటు చేశారు.

బస్ దిగి క్లాస్ మేట్సందరూ లెక్చర్ గాలరీలోకి నడిచారు. వార్మింగ్‌లే లెక్చర్స్‌తో వుదయం గడిచింది. ఈవినింగ్ ప్రాక్టికల్స్ లేవన్నారు. అంతా బైటికి వచ్చారు. బాలరాజుకి కాఫీ తాగుదామనిపించింది. ప్రీ క్లినికల్ కౌంటిన్ వేపు నడిచాడు. కాఫీ తెచ్చుకుని వొక టేబుల్ దగ్గర కూర్చున్నాడు. సరిగ్గా తనకి రెండుమూడు టేబుల్స్ అవతల ముగ్గురమ్మాయిలు కూర్చుని కాఫీలు తాగుతూ తెగ మాట్లాడేసుకుంటున్నారు. వాళ్లు బాలరాజు క్లాస్‌మేట్సే. బాలరాజు తన క్లాస్ అమ్మాయిలను గుర్తుపట్టడం పాఠాల కంటే ముందే నేర్చుకోవడం తెలుస్తోంది. తను కాఫీ పూర్తిచేసేసరికి తన పక్కనే వొక పొడుగాటి సీనియర్ వచ్చికూర్చున్నాడు. అతని అసలు పేరేమిటో తెలియక పోయినా అతన్ని అంతా 'తానీషా' అని పిలుస్తారని రెండురోజుల ముందే తెలిసింది.

***

'**ఏవయ్యా!** ఆ యెదురుగా కూర్చున్న వాళ్లు మీ క్లాస్‌మేట్సే కదూ!' అనడిగాడు తానీషా.

అవునన్నాడు తను.

'ఆ ముగ్గురిలో యెవరు నచ్చారు నీకు?'

బాలరాజు మొహమాట పడ్డాడు. తానీషా తనని ఏడిపించడానికే అడుగుతున్నాడని తెలుసు.

'ఊc చెప్పు!' అన్నాడు తానీషా.

'ఆ మధ్యమ్మాయి.!' అని కావాలనే లావుగా బొద్దుగా గుండ్రంగా వున్న అమ్మాయిని చూపించాడు బాలరాజు.

'మంచి టేస్టే. అయితే యింక ఆలస్యం దేనికి. కాయితం, పెన్ను తీసుకో' అన్నాడు.

'ఎందుకు?'

'ఎందుకేవిటి? ప్రేమలేఖ. నచ్చాక నస పనికిరాదు. కమాన్.'

తను కాగితం, పెన్ను రెడీ చేసుకున్నాడు.

'రాయి, ప్రియమైన - ఆ అమాయి పేరేవిటన్నావ్?'

'ఏమీ అన్లేదు. నాకింకా తెలియదు.'

'ఫర్వాలేదు. డియర్ డియర్. అని రాసెయ్యి.' అంటూ వొక అరఠావు ప్రేమలేఖను డిక్టేట్ చేసి, చివర నీ సంతకం పెట్టు.! 'ఊఁ పెట్టావా. ఇప్పుడు దీన్ని జాగర్తగా తీసుకెళ్లి ఆ అమ్మాయికిచ్చిరా!' అని ఆజ్ఞాపించాడు' తానీషా.

'అయ్యబాబోయ్! కొడుతుందేమోనండి.'

'ఇస్తావా, లేకపోతే వాళ్లముందు నిన్ను చొక్కా, బనీను యిప్పించెయ్యమంటావా?'

'వద్దులెండి. యిస్తాను.' అని మెలమెల్లగా, భయంగా అడుగులో అడుగువేసుకొంటూ వెళ్లి ఆ లవ్ లెటర్ సదరు అమ్మాయి చేతికి యిచ్చాడు. ఆమె లెటర్ అందుకుని గబగబా చదువుకుంది. వెంటనే ఆమె ముఖం కందగడ్డలా అయింది.

'చూడండి. నిన్నకాక మొన్న చేరాం. ఆరేళ్లు కలిసి చదువుకోవాల్సిన వాళ్లం. అయినా మీరు నాకు తమ్ముడులా వుంటారు. వెధవ్వేషాలెయ్యక బుద్ధిగా చదూకోండి' అని వుత్తరాన్ని చింపేసి ఖాళీ అయిన కప్పులో వేసింది. మిగతా యిద్దరు అమ్మాయిలు ఫక్కున నవ్వారు. బాలరాజుకి వొళ్లు మండిపోయింది. అసలు దీన్నెవడు ప్రేమించాడని అలా మాట్లాడింది - అనుకున్నాడు. అవమానంతో వెనక్కి తిరిగి చూస్తే తానీషా అక్కడలేడు.

ఆ మర్నాడు నోటీసు బోర్డులో రాగింగ్ చేసిన వాళ్లని డొక్క వాలికలు చేస్తానని ప్రిన్సిపాలుగారు నోటీసు పెట్టారు. ఆవాళ్టినుంచీ రేగింగ్ వుధృతం కాస్త తగ్గినా, ప్రిన్సిపాల్‌కి రిపోర్ట్ చేసిన జూనియర్‌ని మాత్రం వదలకూడదని సీనియర్స్ తీర్మానించుకున్నారు.

లంచ్ అవర్ తర్వాత క్లాసుకి వస్తుంటే నిన్న తన లవ్ లెటర్ చింపేసిన లావుపాటి అమ్మాయిని తానీషా పట్టుకున్నాడు - 'ఏవమ్మా, బాగున్నావా?' అనడిగాడు.

'బాగానే వున్నానండి.' - నవ్వుతూ బదులిచ్చింది.

'ఏడిసినట్టున్నావ్ - వెళ్లి అద్దంలో మొహం చూసుకో' అన్నాడు.

ఆమె చిన్నబుచ్చుకుంది.

మళ్లీ అన్నాడు - 'ఇదుగో -నిన్నకాక మొన్న చేరావ్. నువ్వు మా మీద ప్రిన్సిపాల్‌కి రిపోర్టిస్తావా? ఎత్తుకుపోతాను జాగర్త!'

అమ్మాయి కోపంగా చూసింది.

'ఏవిటాచూపు. పమిట తిన్నగా వేసుకో.'

'అడ్డుతప్పుకోండి. అనవసరంగా మాట్లాడితే మళ్లీ రిపోర్టిస్తా.'

'ఏం - డ్యాన్సు చేయించమంటావా?'

'ఏ మిస్టర్! ప్రిన్సిపాల్ గారు మా నాన్నగారు. మీ చేత డ్యాన్సు యెలా చేయించాలో ఆయనకి బాగా తెలుసు. తప్పుకొండి' అని విసురుగా చెప్పి విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయింది.

తానీషా బుర్ర గోక్కుంటూ వుండిపోయాడు. వారం రోజులలోపే జూనియర్స్‌కి వెల్‌కమ్ ఫంక్షన్ 'ఫ్రెషర్స్‌డే' ఏర్పాటయింది. ఆ రోజుతో ర్యాగింగ్‌కి స్వస్తి చెప్పి సీనియర్స్ జూనియర్స్‌ని వెల్‌కమ్ చేస్తారని తెలియగానే జూనియర్సంతా హాయిగా వూపిరి పీల్చుకున్నారు.

ఫ్రెషర్స్‌డే నాడు 'పానగల్ బిల్డింగ్స్‌ని రంగురంగుల దీపాలతో, తోరణాలతో అలంకరించారు. సీనియర్స్, జూనియర్స్‌ని పుష్పాలతో ఆహ్వానించారు. నలుగురు అందమైన సీనియర్ అమ్మాయిలు గుమ్మం దగ్గర చిరునవ్వులు రువ్వుతూ ఎర్రగులాబీ పువ్వుల్ని వొక్కక్కటే లోపలికి వచ్చే జూనియర్స్‌కి యిస్తున్నారు. ఆ నలుగురిలో మెరిసిపోతున్న ఇందువదనకూడా గులాబీ పువ్వులూ, గుండెకు తాకే నవ్వులూ యిచ్చింది. తర్వాత తేనీటి విందు. ఆ తర్వాత మేడమీద అసెంబ్లీ హాల్లో వేదిక ముందు నిక్‌నేమ్స్‌తో, అసలు పేర్లతో జూనియర్స్ అందర్నీ వరుసగా ప్రిన్సిపాలుకి పరిచయం చేశారు. ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమం జరిగింది. ఆ రాత్రి హాస్టల్లో టెర్రస్‌మీద నిలబడి బాలక్రిష్ణ అనే బాలరాజు క్లాస్‌మేట్ 'ఇందువదన నన్ను లవ్ చేసింది. ఇందువదన నన్ను లవ్ చేసింది' అని గట్టిగా అరవడం మొదలెట్టాడు. అంతా హడావుడిగా టెర్రస్ మీదకి చేరారు.

'ఏవిట్రా గొడవ?' అనడిగారు.

'ఇందువదన ప్రేమతో నాకు స్మైలిచ్చి ఈ గులాబీ పువ్వు యిచ్చింది' అని బాలకృష్ణ అపురూపంగా దాచుకున్న ఎర్రగులాబీపువ్వుని అందరికీ చూపించాడు.

అంతా విరగబడి నవ్వారు. 'ఓరి, య్రెర్రిమొకమా! ఈ వెల్‌కమ్ గులాబీలు మన జూనియర్సందరికీ యిచ్చారు. ఇందువదన నాకూ యిచ్చింది. వీడికీ యిచ్చింది. వాడికీ యిచ్చింది. ఆ బ్యూటీ ప్రేమ అదుగో అల్లదుగో అగపడతున్నాదే - ఆ సముద్రం' అని విశదీకరించారు.

'అదా సంగతి' అంటూ బాలకృష్ణ గాలితీసిన బంతిలా అయిపోయి తన చేతిలో గులాబీ పువ్వు రేకలు తెంపుకుని తినేసాడు.

మర్నాటినుంచీ అంతా మామూలైపోయింది. ఎంతో యెక్కువగా యేడిపించిన సీనియర్స్ అంత మక్కువగా దగ్గరైపోయారు.

బాలరాజు వొక సాయంత్రం కొండమీదున్న కాలేజీ అంతా చూడాలని బైల్దేరాడు. విశాఖపట్నం -2లో హాస్పిటల్, క్లినికల్ లెక్చర్ గ్యాలరీలు, కాలేజ్ ఆఫీసు, మార్చ్యురీ చుట్టి ముందుకి నడిస్తే వొక పక్క యెత్తుగా సముద్రముఖంగా లేడీస్ హౌస్‌సర్జన్ క్వార్టర్స్, వాటి దిగువ రోడ్డు దగ్గరగా మగ హౌస్ సర్జన్, పి.జి క్వార్టర్స్ వున్నాయి. కొండ నడుమకి నడుస్తూంటే నర్సెస్ క్వార్టర్స్, మరికాస్త ముందుగా కొండ మధ్యగా లేడీస్ హాస్టల్, దానికెదురుగా దిగువ విశాలమైన నగరం వ్యూ మనోహరంగా వున్నాయి. లేడీస్ హాస్టల్ దాటితే శ్రీసత్యన్నారాయణస్వామి గుడి, గుడిదాటి విశాఖపట్నానికి దారితీసిన రోడ్డు దిగితే ప్రీ క్లినికల్ క్యాంటీన్, ఫిజియాలజీ డిపార్ట్‌మెంట్, శవాల స్టోరేజ్ గది, ఎనాటమీ థియేటర్, క్రింద మ్యూజియమ్ వున్నాయి. బాలరాజు తన్మయంగా కాలేజీని కలయచూసుకుని తిరుగు ముఖం పట్టాడు. కాస్త చీకటి పడుతోంది. దీపాల వెలుగులో విశాఖపట్నం దేదీప్యంగా వుంది. లేడీస్ హాస్టల్ రోడ్డుమీద, పక్కనున్న గట్లమీద అక్కడా అక్కడా చెదురుమదురుగా అమ్మాయి అబ్బాయిల జంటలు ముచ్చట్లాడుకుంటున్నారు. కొండకు వొక చివర శవాల గది, మరో చివర శవ పరీక్ష చేసే మార్చ్యురీ. శవాల మధ్య జీవాల ఆటవిడుపు.

రెండు నెలల్లో కొన్ని క్లాసులను, ఫిజియాలజీ డిపార్ట్‌మెంట్ కొంత ఖాళీ చేసి అక్కడికి మార్చారు. దాంతో యిబ్బంది యెక్కువైంది. పొద్దున్న చెంగల్రావు పేటలో జలగలు కోసి, మధ్యాహ్నం మహారాణిపేటకొచ్చి కెమిస్ట్రీ లాబ్‌లో ప్రిసిపిటేట్ కావలిసొచ్చేది. సిటీబస్ సర్వీసులా యిదేం చదువురా అనుకుంటూ కొండ యెక్కీ దిగుతూ ఆయాసపడుతుండగా ఫస్టియర్ గడిచింది. అప్పటికి పూర్తిగా క్లాసులన్నీ వొకచోటికి చేరాయి.

బాలరాజు ఫస్టియర్ పాసై సెకండియర్‌లోకి వచ్చాడు. తానీషా థర్డియర్ ఫెయిలయి బాలరాజుకి సహాధ్యాయి అయ్యాడు. మొదటిరోజు ఎనాటమీ థియేటర్‌కి వెళ్తుంటే థియేటర్ ముందు వొంటికాలిమీద నిలబడిన గ్రీకు విగ్రహం కనబడింది. అదేవిటని తానీషానడిగితే "అదా - వాడు పదమూడో నెంబరు బస్సుకోసం పరిగెడుతుంటే, కాలికి సిమ్మెంటు అతుక్కుపోయి అలా వుండిపోయాడు. వాడెవడైతే మనకెందుకు చెప్పు. మనకేవన్నా పరీక్షలో రికమెండ్ చేస్తాడా? నడు' అన్నాడు.

'రికమెండేషనా?' అనడిగితే 'నీకు తెలియదా? ముందు ముందు తెలియును. ముందు నడు.' అన్నాడు తానీషా.

థియేటర్ వదలగానే, ఫిజియాలజీ క్లాసుకి వెళ్లేముందు మిత్రబృందంతో బాలరాజు క్యాంటీన్‌కి కదిలాడు. అక్కడ మెల్లకన్ను నాయర్ అందరికీ తలో అరకప్పు కాఫీ యిచ్చాడు.

మళ్లీ మరో కొత్త బ్యాచ్ ఫస్టియర్‌లో చేరింది. డైనింగ్ హాల్లో ర్యాగింగ్ హడావుడి గోలగావుంది. ఒక జూనియర్ అమ్మాయిని డైనింగ్ టేబుల్ యెక్కించి డ్యాన్సు చేయిస్తున్నారు. మిగతా అమ్మాయిలను ఏ పనిరాదో ఆ పని చెయ్యమంటున్నారు.

'ఇక్కడ మరీ గోలగావుంది. క్లాసుకి పోదాం. అక్కడ నెమ్మదిగా గోల చేసుకోవచ్చు' అని లేచాడు.

మరో క్లాస్ మేట్ మహీ, బాలరాజు, తదితర మిత్రబృందం క్లాసుకి కదిలారు.

ఆ ఏడాది పెద్ద పరీక్షలేం లేవు. ఆటలో అరటిపండులా ఆర్గానిక్ కెమిస్ట్రీ తప్ప. లీలామహల్లో సినిమాలు చూస్తుండగానే నెమ్మదిగా మరో యేడాది గడిచింది. తానీషా, బాలరాజు బ్యాచ్‌తో కలిసిపోయాడు.

ఓ సాయంత్రం హాస్టల్ టెర్రెస్ మీద బాలరాజు మిత్రబృందం అంతా కూర్చున్నారు.

'ఒరేయ్! మన హాస్టల్లో మరికొన్ని రోజులు భోంచేస్తే క్లినికల్ సైడ్‌కి పేషెంట్స్‌గా వెళ్లాల్సొతుంది' అన్నాడు మహీ.

'బైట రూమ్ తీసుకుంటే' సూచించాడు బాలరాజు.

'అవును మెస్ సెక్రటరీ అదేపనిగా కొత్త చొక్కాలు, లాగూలు కుట్టించుకుంటున్నాడు. ఇక భోజనం బాగుపడదు' అన్నాడు తానీషా.

'యా. హీ యీజ్ రైటో' అన్నాడు విజయ్.

'అయితే అందరం వొక మంచి యిల్లు తీసుకుని తలోగదీ సర్దుకుందాం. మనమే మెస్సు రన్ చేసుకుందాం' బాలరాజు తీర్మానించాడు. అంతా ఓకె. చేసారు.

మరో నాల్గురోజుల్లో బాలరాజు, తానీషా, మురళి, విజయ్, శశి, మహీ అంతా యూనివర్సిటీ లేడీస్ హాస్టల్ డౌన్‌లో బీచ్ వొడ్డునే భూతగృహంలాంటి ఇంట్లో మేడమీద పోర్షనంతా అద్దెకు తీసుకున్నారు. దానికి 'బాచిలర్స్ డెన్' అని పేరు పెట్టి హాస్టల్ ఖాళీచేసి మిత్రబృందం అంతా అందులోకి ప్రవేశించారు.

'ఇటు చూస్తే లేడీస్ హాస్టల్, అటు చూస్తే సముద్ర తరంగాల్' అని దిగిన వెంటనే తానీషా కవిత్వం చెప్పాడు. ఇరవై నాలుగ్గంటలూ వొక పక్కనుంచి సీ వెదరు, మరోవైపు నుంచి షీ వెదరూ వీచే ఏర్పాటు కుదిరినందుకు కుర్రవాళ్లంతా ఖుషీగా ఫీలయ్యారు.

ఆ రాత్రి బాచిలర్స్ డెన్ బాల్కనీలో బోజనాల తర్వాత మిత్రబృందం అంతా చేరారు. బాలరాజు బాల్కనీ పిట్టగోడ మీద కూర్చుని సముద్రంకేసి, మెరిసే కెరటాలకేసి, దూరంగా డాల్ఫిన్స్ నోస్ మీద వైట్‌హౌస్ కేసి దిక్కులు చూస్తున్నాడు. మురళి పిట్టగోడకానుకుని యూనివర్సిటీ లేడీస్ హాస్టల్ వైపు చూస్తూ గిటారు సాధన చేస్తున్నాడు. శశి కింద చాపమీద

పడుకుని చిన్నదీపం వెలుగులో ఎనాటమీ కార్డ్ ఎగ్జామ్‌కి ప్రిపేరవుతున్నాడు. మహీ, విజయ్ లీలామహల్లో కౌబోయ్ పిక్చర్ చూడ్డానికి వెళ్లారు.

తానీషా అప్పుడే వచ్చి, 'ఏవిట్రా అంతా సైలెంట్‌గా వున్నారు?' అనడిగాడు.

మురళి గిటారు శబ్దం ఆపి ' ఆ లేడీస్ హాస్టల్లో ఎన్ని గదులుంటాయో మీరెవరేనా చెప్పగలరా?' అనడిగాడు.

'మనకి కావల్సింది హాస్టల్ గదికాదు నాయనా - ఆ హాస్టల్లో ఏదేని వొక అమ్మాయి మది -'అన్నాడు తానీషా.

'వాడింకా అమ్మాయిల పిచ్చిలో పడలేదు. వాణ్ని డైవర్ట్ చెయ్యకండి' అన్నాడు బాలరాజు.

'యూనివర్సిటీ గుంటల గురించి తర్వాత ఆలోచిద్దాంగానీ, ముందు మన క్లాసులో ఏఏ అమ్మాయిలు బాగుంటారో లిస్ట్ తయారు చేశార్రా?' అనడిగాడూ తానీషా.

బాలరాజు 'విజయ్ గాణ్నడిగితే చెబుతాడు. సినిమాకెళ్లాడనుకుంటా' అన్నాడు.

'సీనియర్‌వైనా మాతో కలిశావుగా. నీకు తెలీదూ?' మురళి తానీషానడిగాడు.

'**ఒరేయ్. నేను రిఫర్ట్‌ని**. కాలేజీ మొత్తం మీద చెప్పగలను. చిన్న లిస్ట్‌లు నాకంటే మీకే బాగా తెలుస్తాయి' అన్నాడు తానీషా.

శశి పుస్తకం మూసేసాడు. అయితే విను - రేఖ, తారామతి, లాలస, మంగతాయారు, సాధన, హసీనా బేగం'

'యింకా! -' తానీషా.

'వాడు చెప్పినదానికి తిరుగులేదు.' బాలరాజు ఓ.కె.చేశాడు.

'అయితే మీలో యెవరెవరికి యెవరు నచ్చారు?' మళ్లీ తానీషా అడిగాడు.

'నాకందరూ నచ్చారు' అన్నాడు మురళి.

'నేనెవరికి నచ్చానో తెలిస్తేగాని చెప్పలేను' అన్నాడు శశి.

'నేనింకా అంత అడ్వాన్స్‌గా ఆలోచించడంలేదు' అన్నాడు బాలరాజు.

తానీషా పక్క పరుచుకుంటూ పకపకా నవ్వాడు.

బాలరాజు అలా అన్నాడేగాని, అతని మస్తిష్కంలో యిటీవలే రేఖ అడపాదడపా అటూ యిటూ పచార్లు చేస్తూ అతడి మనస్సులో అల్లరి వూహలు రేపుతోంది. కాస్సేపటికి రేఖ గురించి కలలు కంటూ బాలరాజు కూడా పక్కేసుకున్నాడు.

సరిగ్గా పదినిమిషాలే టైముంది కాలేజీకి. రేఖ నిన్నరాత్రి బాలరాజు నిద్రంతా పాడుచేసింది. తన ఫ్రెండ్సంతా వెళ్లిపోయారు. బాలరాజు అంతా తయారయిపోయాడు. తనుకూడా తొందర తొందరగా తయార్రై, అద్దంలో యింకోసారి

ముఖం చూసుకుని, ఓవరాల్ (తెల్లకోటు) చేతిమీద వేసుకుని, బాక్స్ తీసుకుని గబగబా గదికి తాళం వేసి, రోడ్డెక్కి వాకింగ్ రేస్‌లో నడిచినట్టు నడక సాగించాడు. కలక్టాఫీసు దగ్గర అప్పుడే కదలబోతూ వొగరొస్తూన్న పదమూడో నెంబరు బస్‌కి తగులుకుని, సగం చిరిగిన పోస్టర్లా వేలాడుతూ కాలేజీ చేరాడు.

కాలేజీ గేటులోకి అడుగుపెట్టేసరికి ఎనిమిదయిపోయింది. కంగారుగా ఎనాటమీ థియేటర్ దగ్గరికి నడిచాడు. అప్పటికే ఎనాటమీ ప్రొఫెసరుగారు కటకటాల తలుపు మూసేసి, తాళం వేసేసి తాళం చెవి మొలతాడుక్కట్టేసుకుని యముళ్లా అక్కడ నించున్నాడు. బాలరాజు భయం భయంగా దగ్గరికి వెళ్లాడు.

'గెటౌట్!' ప్రొఫెసరుగారు కటకటాల్లోంచి అరిచారు. జైల్లో బందిపోటు దొంగలా భయంకరంగా కనిపించాడు ఆయన బాలరాజుకి.

'ఎక్స్యూజ్‌మి సర్' అన్నాడు బాలరాజు.

ప్రొఫెసరుగారు 'నో, లాభంలేదు' అని బుర్రాడించారు. బాలరాజు వెనక్కి తిరగబోతుంటే, మరో లేట్ కమ్మర్ యెవరో కాదు రేఖ, భీత హరిణిలా వస్తోంది. ముందుకి పడేసుకున్న జడలు రెండూ ఆమె వూగే వక్షోజాల వునికిని గుర్తుచేస్తున్నాయి. ఆమె దగ్గరకు రాగానే 'మీరూ లేటే, నేనూ లేటే, బలే' అన్నాడు బాలరాజు.

రేఖ వొక్కసారి కోపంగా వాడిచూపొకటి బాలరాజు మీదికి విసిరి కటకటాల దగ్గరకు కదిలింది. బాలరాజు ఆమెను అనుసరించాడు. ప్రొఫెసరుగారు యింకా అక్కడే ఉన్నారు.

'ఎందుకు లేటయింది?' అడిగారు.

'బస్సు' - రేఖ.

'బస్సుకాదు - నువ్వు - చెప్పు - ఎందుకు లేటయింది?'

'బస్సు లేటయింది. బస్సెక్కి నేనూ లేటయ్యానండి'

'ఊఁ నడు.' ఆయన తాళం తీసారు. అమ్మాయి లోపలికి నడిచింది. అనుసరించే బాలరాజుకూడా దూరాడు.

'నీకెందుకు లేటయింది?' ప్రొఫెసరు వురిమారు.

'వాచీ ఆగిపోయిందండి. టైము తెలియలా.'

'ఊఁ నడు. రేపణ్నించి లేటయితే డొక్క వాలికలు చేస్తాను' ఆయన చేతికి బెత్తం వొక్కటే తక్కువైంది.

బాలరాజు మేడమీద శవాలున్న హాల్లోకి అడుగు పెట్టాడు. సినిమాహాల్లా లక్షణంగా వున్న థియేటర్ని శవాల హాలు చేసేశారే - శివ, శివా అనుకున్నాడు. అంతా వొక్కసారి కలియజూశాడు.

శవాల హాల్లో శవాలన్నీ టేబుల్స్ మీద శవాల్లా పడివున్నాయి. కొన్ని ఆడ శవాలూ, కొన్ని మగ శవాలూ, తిరుపతి మొక్కు తీర్చుకొచ్చి విశ్రాంతి తీసుకుంటున్నట్టున్న పూర్వ గుండు శవాలు, యం.ఎస్.కి కట్టికట్టి, పోయి పోయి, ట్యూటర్స్‌గా చేరిన నాలుగు జీవచ్ఛవాలూ, కొన్ని టేబుల్స్ మీద తెగేసిన కాళ్లూ, చేతులూ - హాలంతా ప్రేతకళతో కళకళ్లాడుతోంది.

బాలరాజు తనకి కోతకిచ్చిన శరీరం దగ్గరకు వెళ్లాడు. తన బోడీమేట్స్ వెంకట్రావు, వీరభద్రరావు, విశాలక్షి, వినారా రాణి, మహేశ్వర్, సూర్యారావు డిసెక్షన్ చేస్తున్నారు.

'రారా! మావా! రా' అంటూ బాలరాజుని ఆహ్వానించాడు మహీ.

'ఏరా! అటెండెన్సు అయిపోయిందా?'

'ఆఁ'

'నాకు ప్రాక్సీ పలి కావా?'

'పలికానుగానీ, కంగారులో నీ యువతల నెంబరు ఇందు బాలకి పడిపోయింది. పర్లేదులే, ఆఖర్న అడిగి వేయించుకుందువుగాని.'

బాలరాజు స్టూలు లాగి కూర్చున్నాడు. విశాలాక్షి, వినతారాణి టైమ్ వేస్ట్ చెయ్యకుండా శవం లింబ్స్‌ని అందినంత వరకూ కోసి పారేస్తూ తెగ మాట్లాడేసుకుంటున్నారు. వీరభద్రరావు ఎండిపోయిన కిడ్నీలతో గచ్చకాయలాడుకుంటున్నాడు. వెంకట్రావు భోజనానికి కూర్చున్నట్టు కూర్చుని శవం ఎండిపోనందుకూ, అన్ని భాగాలూ స్పష్టంగా తెలుస్తున్నందుకు సంబర పడిపోతూ గుటకలు వేస్తూ శవం కడుపంతా దేవేస్తున్నాడు. మరోమూల టేబిల్ దగ్గర విజయకుమార్ తనదగ్గరున్న ఎండిపోయిన ఎడం చేతిని యెంచక్కా కోసి, నరాల్ని, రక్తనాళాల్నీ బైటికి విప్పదీసి వాటిని రవిశంకర్‌లా మీటుతూ రాగం,తీస్తున్నాడు. సూర్యారావు మాత్రం అక్కణ్నించి సరిగ్గా అవతలి వరసలో అయిదో టేబుల్ దగ్గర వొంగొని డిసెక్ట్ చేసే వనజాదేవి వక్షోజాల్ని తదేక ధ్యాసతో చూస్తున్నాడు. కొందరు థియేటర్‌కి అవతలివేపున్న తలుపు తోటే వాడిచేత తీయించి, క్యాంటీన్‌లోకి గుప్ చుప్‌గా వెళ్లిపోతున్నారు. బాలరాజు మాత్రం రెండు కళ్లూ ఓవరాలంత చేసుకుని రెండు జెళ్ల రేఖని యీ మూలనుంచి ఆ మూలకి చూస్తున్నాడు.

కాసేపటికి రేఖ స్కార్‌పెల్ పదును పెట్టుకోడానికి హాలు గోడవారగా వున్నా సాన దగ్గరకు వచ్చింది. తను రోజూవున్న రెండుగంటల్లో గంటన్నర సాన దగ్గర పదును పెడుతూ వుంటుంది. పదును మాటెలావున్నా. సాన మాత్రం వాడేసిన సబ్బిళ్ల ముక్కలా అయిపోయింది.

బాలరాజుకి రేఖమీద యిష్టం అదేపనిగా పెరిగిపోతోంది. కారణం ఆమె మిగతా అమ్మాయిల్లా చనువుగా వుండను. అయినా బాలరాజు నిరుత్సాహపడదల్చుకోలేదు. అంచేత తనుకూడా స్కాల్పెల్ తీసుకుని సాన దగ్గరికి నడిచాడు. వీరభద్రరావు, సూర్యారావు ప్రోత్సహించి బెస్ట్ ఆఫ్‌లక్ చెప్పారు. బాలరాజు, రేఖ పక్కకి చేరి తనుకూడా పదును పెట్టడం ప్రారంభించాడు. రేఖ సన సన్నగా, వాడివాడిగా కంటికొసల్లోంచి బాలరాజుని చూస్తోంది.

బాలరాజు అడిగాడు 'ఏం డిసెక్ట్ చేస్తున్నారు?'

'థొరేక్స్' చిరుకోపం.

'ఎవరిదీ?'

'మీది' - పెనుకోపం.

'అవును.'

'అవునేవిటి? - యింకా కోపం.

'నిజం. మీరు నా హృదయాన్ని మీ అందం అనే స్కాల్పెల్‌తో కోస్తున్నారు. చూడండి. బాగా కోసి చూడండి. చివరికి అద్దంలో ముఖం చూసుకున్నట్టు, మిమ్మల్ని మీరే చూసుకుంటారు.'

'ఏం వేళాకోళంగా వుందా? ప్రొఫెసర్‌కి రిపోర్టివ్వాలా?'

'మీ అందంలాగే మీ మాటలు కూడా చాలా పదునైనవి'

'అవును. ఇది చూశారా? చేతిలో స్కాల్పెల్ చూపించి ఇది కూడా చాలా పదునైంది' - అంది.

ఇంతలో యిదంతా, అడవిలో మాటువేసిన పులిలా గుమ్మం చాటు నిలబడి పొంచి వింటున్న ప్రొఫెసర్ గభాల్న వురికి, అవుట్, గెటౌట్ 'వాకౌట్' అంటూ బాలరాజు మీదికి విరుచుకుపడ్డాడు. బాలరాజు కంగారు పడ్డాడు. వెనక్కి తూలి, స్టూలు తగిలి క్రింద పడ్డాడు. పదును పని ఆపుచేసిన రేఖ పకాల్న నవ్వింది. అంతా నవ్వారు. బాలరాజుకి వెర్రెక్కిపోయింది. ప్రొఫెసరు గుడ్లురిమి, మేఘంలా వురిమారు.

అంతా నిశ్శబ్దం. అందరూ సర్దుకున్నారు. బాలరాజు లేచి మౌనంగా వెళ్లి పోదామని వెనక్కి తిరిగాడు.

'ఆగు' ప్రొఫెసరుగారు గాండ్రుమన్నారు.

అతను ఆగాడు.

'ఇలా రా!'

అతను వచ్చాడు.

'ఏది నీ టేబుల్? ఎక్కడ నీ శవం?'

బాలరాజు కదిలాడు. ప్రొఫెసరుగారు అతన్ని అనుసరిస్తూ మధ్య మధ్యలో గాండ్రుతున్నారు. బాలరాజు తన టేబుల్ దగ్గరకు వచ్చి ఆగాడు. ఆయనా ఆగారు.

'ఏవిటి కోస్తున్నావ్!' అనడిగారు.

'కోతలు కాదండి. నిజమే. యిదే నా టేబుల్.'

'ఆ సంగతి నాకు తెలుసు. ఓవరాల్ బొత్తం పెట్టుకోముందు. ఉఁ చూపించు. ఏం డిసెక్ట్ చేస్తున్నావ్?'

'ఎబ్డామిన్'

'కడుపు చీరేస్తాను సరిగ్గా చెప్పు. ఏం చేస్తున్నావ్'

'నేను చీరేసానండి. ఇదిగో చూడండి' అంటూ మామిడి తాండ్రలాంటి మజిల్స్ మడతల్ని తిరగేశాడు. ప్రొఫెసర్గారు కంపిస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు. బాలరాజు బాగా తడిసిపోయాడు. ప్రశ్నల్తోబాటు ఆయన నోట్లోంచి తుంపర్ల వాన పడింది. వెనకాల్నించి వినతారాణి, వీరభద్రరావు కలిసి జవాబులు సాయంచేశారు. ప్రొఫెసరుగారు సమాధానాలకి సంతుష్టుడై 'జాగర్త!' అని వార్నింగిచ్చి, వాచీ చూసుకున్నారు. పదయింది. వెంటనే జేబులోంచి గంటతీసి, పీచు మిఠాయి అమ్మే వాడిలాగా గణగణా వాయించుకుంటూ వెళ్లిపోయారాయన. విద్యార్థులంతా వాష్ బేసిన్స్ దగ్గరకు నడిచారు. అమ్మాయిలు వొళ్లంతా సబ్బు రాసుకుని శుభ్రంగా అభ్యంగనంలా అరగంటసేపు జలక్రీడలాడాక బాలరాజు చేతులు శుభ్రం చేసుకుని, ఓవరాల్ విప్పేసి, థియేటర్ విడిచి మిత్ర బృందంతో క్యాంటిన్కి కదిలాడు.

లోపలికి వెళ్లగానే మెల్లకన్ను నాయర్, కాఫీలు రెడీచేసి పెట్టాడు. క్యాంటీన్లో టేబుల్స్ దగ్గర ఎప్పటిలాగే గోలగోలగా వుంది. కొందరు పాటలు పాడుతున్నారు. కొందరు బల్లల మీద దరువేస్తున్నారు. ఇంకొందరు డైనింగ్ హాల్లో అద్దం దగ్గరకు వెళ్లి దిద్దుకుంటున్నారు. బాలరాజు సూర్యారావు, మహేశ్వర్, మురళి కాఫీ కప్పులందుకున్నారు. కెటిల్ పక్కనున్న కిటికీ దగ్గరకు వచ్చారు. అక్కడ నిలబడి కాఫీ తాగుతూ చూస్తూంటే ఎనాటమీ థియేటర్ దగ్గర్నుంచి కొండమీద లేడీస్ హాస్టల్ వైపు ఎగబాకే అందమైన సిమెంట్ రోడ్డు, అవతల నగరం వ్యూ అందంగా అగుపిస్తున్నాయి.

తరువాతక్లాస్ బయో కెమిస్ట్రీ పానగల్ బిల్డింగ్స్లో. రేఖ, రేవతి, రేణుక, విజయలక్ష్మి, వెంకుమాంబ, అలివేలు, అపర్ణ, మంగతాయారు, మధురవాణి మొదలగు అమ్మాయిలంతా ఆయాసపడుతూ కొండమీదికి ఎగబాకిన రోడ్డుమీద నడిచి వెళ్తున్నారు. రేఖ కాస్త వెనకబడింది. బాలరాజు వెనకాలే పడ్డాడు. రేఖ ఆయాసంగా నడుస్తున్నప్పుడు ఆమె అంగవిన్యాసం మనోహరంగా వుంది బాలరాజుకి. ఇందాక తాగిన కాఫీ యింద్రుడిచ్చిన అమృతంలా అనిపిస్తోంది. రోడ్డు

మలుపు తిరిగేదాకా రేఖ కనిపించి మాయమయ్యాక, వొయ్యారంగా రేఖ వొంటి వొంపుల్ని తిరిగి పరుచుకున్న రోడ్డు రేఖ వొంటి వొంపుల్ని గుర్తుచేసే రేఖ పారేసుకున్న రిబ్బన్‌లా వుంది.

బయోకెమిస్ట్రీ క్లాసయ్యాక లంచ్ టైము. మళ్లా వెనక్కి నడిచి క్యాంటిన్ కొచ్చి, తెప్పించుకున్న క్యారేజీలు తెరిచి బాలరాజు వగైరాలు లంచ్ పూర్తి చేశారు. మధ్యాహ్నం ఫిజియాలజీ ప్రాక్టికల్స్.

ప్రాక్టికల్స్ జరుగుతున్నంతసేపూ బాలరాజు, ఎనాటమీ థియేటర్‌లో తను కిందపడటం, రేఖ నవ్వడం గురించి మధనపడుతూనే వున్నాడు.

రూమ్ కొచ్చాక వంటవాడు పెట్టిన భోజనం చేసి, కాసేపు పుస్తకాలు అటూయిటూ తిరగేసి, మంచం మీద నడుం వాల్చాడు. పక్కనున్న సముద్రంకేసి విండోలోంచి వీక్షిస్తూ ఆలోచనా సముద్రంలోకి మునిగాడు. అంతలో నిద్ర తిమింగలంలా వచ్చి అతన్ని మింగింది. అతను నెమ్మదిగా ఆలోచనల్లోంచి కలల్లోకి జారాడు.

**ఉదయాన్నే** బాలరాజు నీటుగా తయారై కలక్టాఫీసు జంక్షన్‌కి వచ్చి, అజంతా హోటల్ బస్ స్టాపు వేపు నడిచి పదమూడో నెంబరు బస్సుకోసం నిరీక్షిస్తూ నిలబడ్డాడు. బస్ స్టాపు వెనక అప్పలరాజు కిళ్లీ కొట్టుముందు బెంచీ మీద కూర్చుని ఎవిఎన్ కాలేజీ హిస్టరీ మేష్టారు శర్మగారు అప్పలరాజుతో అవీ యివీ మాట్లాడుతున్నారు.. మరి కాస్సేపటికి రేఖ కూడా వచ్చి నిలబడింది. మరికాస్సేపటికి డెలివరీకోసం హాస్పిటల్‌కి వచ్చే నిండు చూలాలిలా బస్ నెంబర్ పదమూడు వచ్చి ఆగింది. అది వూరికి దిష్టితీసినట్టు వూరంతా చుట్టి వస్తుంది. దాని యింజను రొద ఆయాసపడుతున్నట్టుంది. రేఖ బాణంలా యెక్కేసింది. వెనకాలే బాలరాజుకూడా యెక్కబోయాడు.

'మగవారు యెదర్నించి యెక్కద్దండీ!' అంటూ వారించాడు యీలవేసి రైటు చెప్పే కుర్రాడు. 'యిటేపురండి' అంటూ పిలిచాడు వెనక డోర్ దగ్గర కదలమనడానికీ, కదలొద్దనడానికీ బస్సుని దుమ్ముదులిపినట్టు సొట్టలు పడేలా కొట్టే కుర్రాడు. బాలరాజు లోపలికి యెక్కించబడ్డాడు. కండక్టర్‌తో సహా లోపల జనాన్ని బెడ్డింగు నిండా బట్టలు కూరి సర్దేసినట్టు ఆ యిద్దరు కుర్రాళ్లూ సర్దేశారు. అయినా క్రింద యింకా నలుగురు ప్యాసింజర్లు మిగిలిపోయారు. అంచేత డ్రైవరు గేరు మార్చి బస్సుని వొకసారి కుదిపి, 'ఉ!c ఆ టికట్లూ తోసీయ్' అన్నాడు. ఎక్స్ట్రా లగేజ్‌ని చూసినట్టు చూస్తూ వాళ్లని అలాగే చేశారు కుర్రాళ్లు.

బస్సు జాలారి పేట, రెల్లివీధి దాటి ఎవిఎన్ కాలేజ్ స్టాపుకి చేరింది. స్టూడెంట్స్ దిగారు. ఎవిఎన్ కాలేజీ పక్కనే ప్రీ క్లినికల్ మెడికల్ కాలేజ్.

మధ్యాహ్నం ఫిజియాలజీ ధియరీ క్లాసు కిటకిటలాడుతోంది. రేఖ కూర్చున్న వెనకాల సీట్లో బాలరాజు కూర్చున్నాడు. ఆమె తలలో పెద్ద య్రెరమందారం పూసి విచ్చుకున్నట్టు వుంది. బాలరాజు రేఖ మందారం కేసి ఆ మందానంద కందళార హృదయార విందుడై చూస్తున్నాడు. అతనిచూపుల బరువు తట్టుకోలేక ఆ మందారం రేఖ తలనుండి మెడమీదుగా క్రిందకి జారింది. పువ్వు యెవరో లాగారని కోపంగా రేఖ వెనక్కి తిరిగితే బాలరాజు. అతని కళ్లకి ఆమె తల తిప్పినట్టేలేదు, రేఖ ముఖం కోపంతో మందారంలా కందిపోవడంవల్ల. ఇంతలో ప్రొఫెసరుగారు క్లాసులోకి ప్రవేశించారు. అంతా నిశ్శబ్దమైంది. ప్రొఫెసరుగారు పాఠం ప్రారంభించారు. ముందు ప్రశ్న వేసి, దానికాయనే సమాధానం చెబుతున్నారు ఏదో రాజకీయనాయకుడి వుపన్యాసంలా.

'గుండె యెలా కొట్టుకుంటుందీ' - లబ్‌డబ్, లబ్‌డబ్, లబ్‌డబ్' అంటూ ఆయనకూడా గుండెలాగే ముడుచుకుంటూ తెరుచుకుంటూ శబ్దాలు ప్రారంభించారు. తర్వాత స్వాములవారు భక్తుల్ని తనతోబాటు భజనలో పాల్గొనమన్నట్టుగా 'అంతా అనండి - లబ్‌డబ్, లబ్‌డబ్' అంటున్నారు. క్లాసంతా లబ్‌డబ్, లబ్‌డబ్' అని కోరస్‌లోకి దిగారు. ఆడగుండెలూ, మగ గుండెలు అలా గట్టిగా కొట్టుకుంటూంటే ఫిజియాలజీ లెక్చర్ హాల్ 'లబ్‌డబ్'లతో మార్మోగింది. అంతలో జాలరివాడొకడు నెత్తిమీద బుట్టతో క్లాసులోకి ప్రవేశించాడు. అంతా వొక్కసారి నిశ్శబ్దమైంది.

జాలరివాడు తన తలమీద బుట్ట సగం దింపి, ప్రొఫెసర్‌గారితో 'బాబూ! కప్పలు యెక్కడెట్టమంటారు?' అని అడిగాడు. ప్రొఫెసర్‌గారు తను చెప్పబోయే పాఠం ఆపుచేసి, వాణ్ని దగ్గరకు పిలిచి 'ఎవీ, బావున్నాయా' అంటూ పూర్ణా మార్కెట్లో వంకాయల్ని యెంచినట్టు చూసి, తను ప్రారంభించిన గుండె- రక్తప్రసరణమూ వాయిదావేసి, కప్పలు వాటి ప్రాశస్త్యమూ గురించి మొదలెట్టారు. కప్పలు ఫిజియాలజీ స్టడీస్‌కి యెంత ముఖ్యమో వివరించారు. తన తలకు సింగారించుకున్న పువ్వులాగాడనుకుని కోపంగా రేఖ, బాలరాజుమీద కంప్లైంట్ చేసేందుకు వేచి నిలబడింది. ప్రొఫెసర్‌గారు. 'కూర్చో! యిప్పుడు కాదు. క్లాసయ్యాక ప్రాక్టికల్స్‌లో అందరికీ తలో కప్పా యిస్తారు' అని స్వాతంత్ర్య దినోత్సవంనాడు జెండావందనం తరువాత స్వీట్స్ పంచిపెడతారని చెప్పినట్టు చెప్పి రేఖను మారు మాట్లాడనియ్యకుండా కూర్చోబెట్టేసారు. కప్పలు బెకబెకమంటూ ప్రొఫెసర్‌గారి తలమీదికీ, భుజాలమీదికీ యెగురుతూ కప్పగంతులు వేస్తూంటే ఆయన లండన్ ట్రఫాల్గర్ స్క్వేర్‌లో లార్డ్ నెల్సన్‌లా గోచరించారు. యీ మధ్యే యుకె హాలీడే నుండి తిరిగొచ్చిన యిండియన్ డెప్యూటీ హై కమీషనర్‌గారమ్మాయి యిందుబాలకి.

ప్రొఫెసర్‌గారు వొక కప్పను పట్టుకుని అందర్నీ అడిగారు. 'చెప్పండి. యీ కప్పలు మనకిచ్చే సందేశం ఏవిటి?'

క్లాసంతా 'బెక బెక, బెక బెక' అన్నారు.

'నొ-నొ - అని ప్రొఫెసర్‌గారు బెకబెకా నవ్వారు. నవ్వి యింకా యిలా అన్నారు. 'మీరంతా క్రితం యేడాది 'మీ ప్రీ క్లినికల్ యియర్‌లో బొద్దింకల్నీ, జలగల్నీ కోశారు. ఈ యేడాది యీ గొప్ప కప్ప సాయంతో యాక్షన్ పొటెన్షియల్ గురించి నేర్చుకుంటారు. మనిషి పువ్వుల్ని చింపేస్తాడు. పురుగుల్ని చంపేస్తాడు. ఎందుకు? తన శ్రేయస్సు కోసం. మానవ శ్రేయస్సు కోసం. ఈ విజ్ఞాన యాత్రలో కదిలే సింహం, పులి, కుక్క, నక్క, కుందేలు, కప్ప, కదలని చెట్టు, కొండ అన్నీ మన అవసరాలకు తగినట్టుగా బలికావలిసిందే 'అని చేతిలోకి ఒక కప్పను తీసుకుని, మరో చేత్తో జేబులోంచి వొక పొడుగైన సూదిని తీసి ఆ కప్ప తలలో గుచ్చి అటూ యిటూ తిప్పారు. కప్ప కిక్కురుమనకుండా తలవాల్చింది. దీనినే 'పిథింగ్ ఆఫ్ ఫ్రాగ్' అంటారు. మీరు మధ్యాహ్నం చెయ్యబోయే సింపుల్ మజిల్ ట్విచ్ స్టడీకి ముందు యిలా కప్పను 'పిథింగ్' చేస్తారు.'' అని వివరించారు. క్లాసంతా ఆ కప్ప కష్టానికి కదిలిపోయారు. ''కంగారుపడకండి. ధైర్యంగా నేర్చుకోండి. మీరు ఫిజియాలజీ బాగా చదువుకుంటే యీ కప్ప ఆత్మ శాంతిస్తుంది. కప్పమ్మకి జై! కప్పబాబుకి జై'' అని అరుస్తూ ప్రొఫెసరుగారు తన లెక్చర్ అవాళ్టికి పూర్తిచేసి క్లాసు ముగించారు.

లెక్చర్ హాల్లోంచి అంతా బైటకి వచ్చారు. కారిడార్‌లో వొక శాల్తీ 'మ్యావ్! మ్యావ్' అంటూ తిరుగుతున్నాడు. బైటికి వచ్చిన బాలరాజుకి అతను యెదురుపడ్డాడు. మళ్లీ ''మ్యావ్, మ్యావ్'' అన్నాడు. చూస్తే చైనా మనిషిలా వున్నాడు. తెలుగు మాట్లాడితే అర్థం అవుతుందో లేదో అనుకుని, అయినా ప్రయత్నించి చూద్దాం అని, 'మీ పిల్లి యేవన్నా తప్పిపోయిందా సార్!' అని అడిగాడు.

'పిల్లికాదు నా చెల్లెలు పిల్ల' అని తెలుగులో తడుముకోకుండా మాట్లాడాడు.

బాలరాజుకి ఆశ్చర్యం వేసింది. అతను వెంటనే, 'అలా ఆశ్చర్యపడకండి. నా పేరు పాహియాన్. ఇక్కడే పుట్టి పెరిగాను. పందిమెట్టలో వుంటాను. అంతా నన్ను పందిమెట్ట పాహియాన్ అంటారు. నా సిస్టర్ చాంగ్ చాంగ్ మావ్ మీతో చదువుకుంటోంది. పికప్ చేసుకోడానికి వచ్చాను' అని పరిచయం చేసుకుని వచ్చిన కారణం చెప్పాడు. బాలరాజుకి ఆశ్చర్యం వేస్తూనే వుంది. ఐసూ, నోసూ అంతంతమాత్రంగా వున్న యీ చైనా ముఖంలోంచి తెలుగు ప్రవహిస్తుంటే యెంత ముచ్చటగా వుంది అనుకున్నాడు. హిమాలయాలు దాటగానే ముఖాలు పిడక చరిచినట్టు యెందుకిలా మారిపోతాయబ్బా అని కూడా అనుకున్నాడు.

'పాహియాన్ గారూ! మీరు పంది మెట్టలో ఏం చేస్తూవుంటారు?' అని అడిగాడు.

'నన్ను గారు అనక్కర్లేదు. పాహియాన్ అని పిలవకండి చాలు. పందిమెట్టలో నాకు వొక చైనీస్ టేకవే వుంది. చాలా చిన్న ప్లేసు. చాలామందికి యింకా తెలీదు. మా దగ్గర చౌమీన్ బావుంటుంది. మీరు తప్పకుండా రావాలి. కావాలంటే హోమ్ డెలివరీ కూడా చేస్తాను.' అన్నాడు పాహియాన్.

ఇంతలో పాహియాన్ చెల్లెలు చాంగ్ చాంగ్ మావ్ వచ్చింది. ఇంతకు ముందు చూసినా అంత పట్టించుకోని బాలరాజు యిప్పుడు ఆమెను దగ్గరగా చూశాడు. మెరుగుపెట్టిన పింగాణీ బొమ్మలా ఆమె ధగధగలాడుతోంది.

'హలో' అన్నాడు బాలరాజు.

'హలో - మా బ్రదర్ మీకు తెలుసా?' అడిగింది చాంగ్ మావ్.

'ఇప్పుడే పరిచయం. మరి వెళ్దామా' అన్నాడు పాహియాన్.

'మీరు రోజూ పికప్ చేసుకోడానికి దింపడానికి కాలేజీకి వస్తారా?' అడిగాడు బాలరాజు.

'లేదు. యీ మధ్య బోర్డర్ వార్‌లో చైనా గెలిచింది. చాలామందికి వార్ సంగతీ, గెలుపు సంగతీ తెలియకపోయినా కొంతమందికి తెలుసు. చైనా మీది కోపంతో మమ్మల్ని శత్రువులుగా చూస్తున్నారు. ఎందుకేనా మంచిదని కొద్దిరోజులుగా మావ్‌ని పికప్ చేసుకుంటున్నాను. రోజూ కాలేజీ పూర్తయ్యాక వస్తాను. కానీ యివాళ తను లంచ్ మర్చిపోయింది. లంచ్‌కి తీసుకెళ్లి మళ్లీ డ్రాప్ చేద్దామని వచ్చాను.' అన్నాడు పాహియాన్.

ఈలోగా ఫిజియాలజీ ప్రొఫెసర్‌గారు కారిడార్‌లో నడిచివెళ్తూ పాహియాన్ కేసి వొక కోర చూపు చూసి విసురుగా ముందుకి నడిచారు. పాహియాన్ ప్రొఫెసర్‌గార్ని అనుసరిస్తూ - 'నాన్నా!' అని పిలిచాడు. ఆయన పలకలేదు. మళ్లీ 'నాన్నా' అని పిలిచాడు. ప్రొఫెసర్‌గారు ఆగి, కోపంగా వెనక్కి తిరిగి, 'ఎవర్రా నీకు నాన్న. నాన్నట నాన్న. నువ్వు ఏనాడైతే యీ ఫిజియాలజీ డిపార్ట్‌మెంటుకి ద్రోహం తలపెట్టావో ఆనాడే మన బంధం తీరిపోయింది. నేను నీకు నాన్ననూ కాదు. నువ్వు నాకు కొడుకువీ కాదు' అని విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయారు ప్రొఫెసర్‌గారు. బాలరాజుకి ఏవీ అర్థంకాలేదు. పాహియాన్ ఏవిటీ, కొడుకేవిటీ, ప్రొఫెసర్‌గారేవిటీ తండ్రి ఏవిటి? అనే ప్రశ్నలు యిందాక లెక్చర్ హాల్లో కప్పల్లా అతని బుర్రలో కప్పగంతులు వేశాయి. పాహియాన్ తన చెల్లెలు చాంగ్ చాంగ్ మావ్‌ని తీసుకుని వెళ్లిపోయాడు.

మధ్యాహ్నం ప్రాక్టికల్స్‌కి ముందు తానీషాకి జరిగిన విషయం చెప్పాడు బాలరాజు. తానీషా అంతా విని బాలరాజుతో 'అంతా నీ మంచికే జరిగింది. ప్రొఫెసర్ గార్ని యివాళే కలుసుకో. ఆయన కసురుకున్నా పట్టించుకోకు. ఆయనే నీకు అంతా చెబుతారు. ఆయనకు నువ్వు దగ్గరయిపోతావ్. ఫిజియాలజీ యీజీగా ప్యాస్ అయిపోతావ్' - అని.

'సరే' అన్నాడు బాలరాజు.

తానీషా మరో సలహా యిచ్చాడు. 'నీ చేతిలో చటర్జీ ఫిజియాలజీతో కనిపించకు. పుస్తకాన్నీ నిన్నూకూడా చింపేస్తాడు. బెస్ట్ అండ్ టైలర్ లక్. ఫిజియాలజీ టెక్స్ట్ బుక్ మోసుకు వెళ్లు. అది ట్రంకు పెట్టెలా బరువుగా వున్నా భరించు. అది చదువుతున్నావని తెలిస్తే నిన్నాయన నెత్తిమీద పెట్టుకుంటాడు.

మళ్లీ 'సరే' అన్నాడు బాలరాజు యీసారి బరువుగా ఫీలవుతూ.

ప్రాక్టికల్స్ అయ్యాక బాలరాజు, బెస్ట్ అండ్ టైలర్‌తో ముగ్గురూ ఫిజియాలజీ ప్రొఫెసర్‌గారి రూముకి చేరారు.

బాలరాజు చేతిలో బెస్ట్ అండ్ టైలర్ చూడగానే ప్రొఫెసర్‌గారు 'గుడ్ - యిదే బుక్ చదువు. ఇది ఫిజియాలజీకి భగవద్గీతలాంటిది. అందరు వెధవలూ ఆ డొక్కు చటర్జీ చదువుతారు. చటర్జీ చదివినవాళ్ళని చంపేద్దామనిపిస్తుంది నాకు' అన్నాడు.

'చటర్జీనా! నాకలాంటి బుక్కే వుందని తెలియదు సార్' అన్నాడు బాలరాజు తను చదివేది అదే అయినా.

'సరే - ఎందుకొచ్చావ్! నీకా పాహియాన్ గాడు ఎలా తెలుసు?'

'అదేసార్. మీకు చెపుదామని వచ్చాను. ఇవాళ మధ్యాహ్నం అతడిని క్లాస్ బైట అనుకోకుండా చూసాను సర్. అంతే. నేను చూసిన టు మినిట్స్‌లో మీరలా వచ్చారు. 'ఏమైనా అతను మిమ్మల్ని నాన్నా!' అనడం నాకు నచ్చలేదు సార్!'

'అవును నాకూ నచ్చలేదు. నీకెందుకు నచ్చలేదు?'

'మీరు మా అందరికీ తండ్రిలాంటివారు. అలాంటిది అతనొక్కడు ఎవరో బైటనుంచి వచ్చి మిమ్మల్ని నాన్నా అనడం తట్టుకోలేకపోయాను సార్. తట్టుకోలేకపోయాను' అని కళ్ళమ్మట నీళ్లు పెట్టుకున్నాడు బాలరాజు.

ప్రొఫెసర్‌గారు కదిలిపోయారు. 'ఇట్సోకె. ఇట్సోకె. నువ్వేం బాధపడకు. బుద్ధిమంతుడిలా వున్నావు. బెస్ట్ అండ్ టైలర్ టెక్స్ట్ బుక్‌తో కనిపించావ్. నిన్ను చూస్తే నాకేదో అనిపిస్తోంది. ఆ పాహియాన్ గాడి గురించి నీకంతా చెప్పాలనిపిస్తోంది.'

'చెప్పండి సార్. నన్ను మీ అబ్బాయి అనుకోండి.'

'చెబుతాను బాబూ! చెబుతాను విను ఆవాళ బాగా వాన పడుతోంది.'

'ఎక్కడ సార్?'

'ఎక్కడేమిటి? వూరంతా పడుతోంది అంచేత వూరంతా తడిసిపోతోంది.'

'మీరు?'

'నేను కూడా తడిసిపోతున్నాను.'

'గొడుగులేదా సార్?'

'నేను బైల్దేరేముందు వానలేదు. గొడుగు అవసరం వస్తుందనుకోలేదు.'

'ఎక్కడికి బైల్దేరారు?'

'కురుపాం మార్కెట్‌కి'

'కురుపాం మార్కెట్టా?'

'అవును. కురుపాం మార్కెట్. అక్కడ కురుపాం టూంబ్ వుంది. అందుకే ఆ పేరు. కురుపాం రాజావారు వారి రాణీ లక్ష్మీ నరసాయమ్మగారి కోసం 1905లో కట్టించిన స్మృతి చిహ్నం. గొప్ప శిల్పకళ వుట్టిపడేలా బాగా యెత్తుగా కట్టించారు. కురుపాం విజయనగరం దగ్గర వుంది. ఆయన పాలన విశాఖంతా వుండేది. ఇప్పుడా కురుపాం టూంబ్ కాంపౌండంతా కూరగాయలమ్మే కురుపాం మార్కెట్ అయింది.' ప్రొఫెసర్‌గారు ఆగారు.

'యింకా చెప్పండి సార్' అన్నాడు బాలరాజు.

'సరే నేను కురుపాం మార్కెట్లో గుత్తొంకాయలు బావుంటాయని కొందామని బైల్దేరాను. ఈలోగా వానముంచుకొచ్చింది' అవును ఇదంతా నీకెందుకు చెబుతున్నాను.

'పాహియాన్ సర్.'

'యెస్. పాహియాన్ గాడు. వాడు నలుగురి ముందూ నన్ను నాన్నా! అని పిలిచాడు. నలుగురూ నానా విధాలుగా అనుకుంటారు. నీ చేతిలో బి.టి ఫిజియాలజీ టెక్స్ట్ బుక్ చూశాక నీమీద నాకేదో అపరితమైన ఆత్మీయభావం కలిగింది. జరిగిందంతా నీకు చెప్పాలనిపించింది.'

'థాంక్యూ సర్! చెప్పండి'

'ఆఁ ఎక్కడిదాకా వచ్చాను.'

'అనుకోకుండా వానొచ్చింది సర్. ఆ వానలో మీరు తడిసిపోతున్నారు.'

'అవును. తడిసిపోతున్నాను. చెంగల్రావు పేటలో వుంటే గుత్తొంకాయలు మర్నాడు కొనుక్కునే వాణ్ని కదా అనుకున్నాను. కానీ చెంగల్రావు పేటలో వుంటే రాత్రిళ్లు బాగా యిబ్బంది అయ్యేది. అందుకే ఎప్పుడూ అక్కడ వుండదల్చుకోలేదు.'

బాలరాజు ప్రశార్థకంగా చూశాడు.

'చెంగల్రావు పేటలో రాత్రిపూట నడిచే మనుషుల్ని పోలీసులు స్నేకులై కరుస్తారు. బాకులై పొడుస్తారు. ఎందుకంటే అక్కడ సంసార గృహాల మధ్య సానికొంపలున్నాయి. షిప్పులోంచి దిగే గ్రీకులకీ, రష్యా వాళ్లకీ, యింకా రకరకాల విదేశీ సరంగులకీ, సైలర్సుకీ సుఖ సరఫరా చేస్తూవుంటాయి. ఓసారి మన డిమాన్‌స్ట్రేటర్ భాస్కర్రావుని సెకండ్ షో సినిమా నుంచి తన యింటికి వస్తూంటే పోలీసులు పట్టుకుని సానికొంపనుంచి వస్తున్నావని ఆటకాయించి బెదిరించి జేబులు ఖాళీ చేసార్ట. దేశానికి స్వాంతంత్ర్యం వచ్చాక పోలీసు పీనుగుల్లో మొదలైన లంచాలు క్రమంగా అంతటా వ్యాపిస్తున్నాయి. మరో నలభై యేళ్లకు మన దేశమంతా లంచగొండి తనంతో మండిపోతూ ప్రపంచంలో ప్రథమస్థానం ఆక్రమిస్తుంది' ప్రొఫెసర్ ఆగారు.

మళ్లీ అన్నారు 'చూడు బాలరాజూ! మనకి లేట్ అవుతున్నట్టుంది. కదుల్దాం. అలా హాస్పిటల్ ఓ.పి గేటు దగ్గరున్న పావన్ బేకరీకి వెళ్లి ఒక బోంబే టోస్టు తింటూ మాట్లాడుకుందాం' అని లేచారు.

ప్రొఫెసర్‌గారు అటెండర్‌కి డిపార్ట్‌మెంట్ క్లోజ్ చైమని చెప్పి, బాలరాజుని వెంటబెట్టుకుని సావన్ బేకరీకి కదిలారు.

'చూడు బాలరాజూ! అనుకోకుండా నిన్నివాళ చాలాసేపు నాతో వుంచేశాను. పాహియాన్ సంగతి నీకు పూర్తిగా చెబితేగాని నాకు నిద్రపట్టదు. నీ ముందు వాడు నన్ను 'నాన్నా!' అని పిలిచాడు. నీకెందుకో చెప్పకపోతే రూమర్స్‌తో నా శీలం దెబ్బతింటుంది.'

'నేనెక్కడా అననండి' అన్నాడు బాలరాజు.

'నువ్వనవనుకో. అయినా నా మైండ్ క్లియరవదు. అంచేత అంతా విను. పావన్ బేకరీలో బోంబే టోస్ట్‌లా వుంటుంది' అన్నారు ప్రొఫెసర్‌గారు. ఆయన మళ్లీ కంటిన్యూ చేశారు.

'సరే మరి కురుపాం మార్కెట్ దగ్గర వానలో నేను అలా తడిసిపోతుంటే, నా పక్కనే గూడు కవర్ చేసిన వొక రిక్షా వచ్చి ఆగింది.

"తడిసి ముద్దయిపోతున్నారు ఎక్కండి బాబూ అన్నాడు రిక్షావాడు తను అప్పటికే బాగా ముద్దయిపోయి. నేను యెక్కడికి, యేవిటీ అని అడక్కుండా రిక్షా యెక్కాను. యెక్కీ యెక్కగానే కంగారు పడ్డాను. ఎందుకంటే ఆల్‌రెడీ వొక శాల్తీ లోపల కూర్చునుంది. పెద్దాయన తడిసిపోతున్నారు. 'కుసింత సోటెట్టమ్మా' అన్నాడు రిక్షావాడు. 'కంగారొద్దు సారూ. లపాకీ కాదు. ప్రేమిలీ' అని కూడా నన్ను వుద్దేశిస్తూ అన్నాడు. లోపల కూర్చున్నది చైనా వనిత. జరిగి నాకు చోటిస్తూ 'వో అయ్ నీ' అంది. అది చైనా గ్రీటింగనుకుని నేను కూడా 'వో అయ్ నీ' అన్నాను కూర్చుంటూ. సెలెక్ట్ టాకీసుకి

మాట్టాడుకుందండి. తవర్ని కూడా అక్కడ దింపైమంటారా, యెక్కడికేనా యెల్తారా' అడిగాడు రిక్షుడు. నాకేవీ తోచక 'అక్కడ దింపెయ్ ముందు. వర్షం తగ్గేదాకా హాల్లో కూచుంటాను' అన్నాను.

'అదే రైటండి. సెలెట్టాకీసులో ఏ సినేమా అయినా యిద్దరు కలిసి చూడాలండి. హాల్లో స్తంభాలడ్డు కదండీ. యిద్దరు కలిసి సూత్తేగానీ బొమ్మేటో తెల్దండి' అన్నాడు. రిక్షాలో మనిషి మళ్లీ 'వో అయ్ నీ' అంది నేను కూడా మళ్లీ 'వో అయ్ నీ' అని, పేరేంటన్నాను. ఆమెకి తెలుగొచ్చు. ' లూలీలింగ్' అంది. రిక్షా సెలెక్ట్ టాకిసు దగ్గర ఆగింది. రిక్షా అతనికి చిల్లరిచ్చి నేనూ లూవీవింగ్. సెలెక్ట్ టాకీసు దగ్గర దిగాం. ఆ హాల్లో పాత సినిమా ఝునక్, ఝునక్ పాయల్ బాజే ఆడుతోంది. డాన్సులు చూట్టం యిష్టమా అని అడిగాను. లూలీలింగ్ అవునంటూ టింగ్ మని గంట మోగినట్టు నవ్వింది.

బాలరాజు, ప్రొఫెసర్ గారు సావన్ బేకరి చేరారు. బేకరీ మేడమీద గదిలో కూర్చుని బోంబే టోస్ట్ ఆర్డరిచ్చారు. ప్రొఫెసర్‌గారు కొనసాగించారు.

'సినిమా అయ్యాక ఆఖరి బస్సేదో యెక్కి యిద్దరం యెల్లమ్మ తోట దగ్గర దిగాం. 'మా యిల్లు దగ్గరే. కాఫీ తాగి వెళ్లండి' అంది లూలీలింగ్. రోడ్డు మీద జనం బాగా తగ్గిపోయారు. సరే తనకి యింటిదాకా సాయం యిచ్చినట్టు వుంటుందని అలాగే అని ఆమెతో వాళ్లింటికి నడిచాను. ఆమె వొక్కతే ఉంటోంది. కాఫీకి ముందు చౌమీన్ పెట్టింది. 'వో అయ్‌నీ' వో అయ్ నీ'అంటూ నాకేసి యిష్టంగా చూసింది. నేను కూడా 'వో అయ్ నీ' అని అలాగే చూశాను. ప్రొఫెసర్‌ని కదా సభ్యతగా వుండాలనుకున్నాను. కానీ యిష్టానికి సభ్యతలుండవు. ఇద్దరం ఝునక్ ఝునక్ పాయల్ బా జే చిత్రంలో భంగిమల్ని కావలిసినట్టు లొంగదీసుకున్నాం. ఎంతసేపయిందో ముందు తెలియలేదు. కానీ చాలాసేపయిందని తర్వాత తెలిసింది.

బోంబే టోస్టు వచ్చింది. ఇద్దరూ తిన్నారు. తర్వాత కాఫీ చెప్పారు.

' లూలీలింగ్‌కి 'వస్తా' అని చెప్పి కదిలాను. వచ్చేస్తూ అడిగాను ' వో అయ్ నీ' అంటే ఏవిటని చైనా భాషలో ' వో అయ్ నీ ' అంటే ఐ లవ్ యూ అని అర్థంట. అర్థం కాకుండానే ఆమెకు చాలాసార్లు ఐ లవ్ యూ చెప్పానని అర్థమైంది. అందుకే మేం తొందరగా దగ్గిరయి మా పరిచయం ఝునక్ ఝునక్‌మంటూ వూగిపోయింది. ఆ తర్వాత లూవీవింగ్‌ని చాలాసార్లు కలిశాను. ఆమె వొంటరిగా వుండేది. మొగుడు బుద్ధుడిని చూడడానికి భూటాన్ యాత్రకు వెళ్లేడుట. ఆ తర్వాత యేడాదికి గానీ తిరిగిరాడుట.

- నేనూ వొంటరినే. రాత్రీ పగలూ ఫిజియాలజీ డిపార్ట్‌మెంట్‌లో కప్పలతో కాపురం చేస్తున్నానని మా ఆవిడ అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది.'

బాలరాజు అచేతనంగా వింటున్నాడు. ఇద్దరూ కాఫీ పూర్తిచేశారు.

'అప్పుడే లూలీలింగ్‌కి పాహియాన్ పుట్టాడు. నెమ్మదిగా పెరిగాడు. వాడి చదువుకి యెంతో సాయం చేశాను. వాడు బ్రిలియంటేం కాదు. చదువు అయిందనిపించాక, వాడికెక్కడా పని దొరకలేదు. నా ఫిజియాలజీ డిపార్ట్‌మెంట్‌లో అటెండర్ వుద్యోగం వేయించాను.'

'మరి పాహియాన్ సిస్టర్ చాంగ్ చాంగ్ మావ్?' అడిగాడు బాలరాజు.

' లూలీలింగ్‌తో నా పరిచయం అయిన తర్వాత ఏడాది తిరక్కుండానే బాగా ముందే ఆమె భర్త హ్యూన్ త్సాంగ్ బుద్ధుడిని చూసి భూటాన్ నుంచి తిరిగి వచ్చేసాడు. ఆ తర్వాత పాహియాన్‌కి సిస్టర్ పుట్టింది. పాహియాన్ కూడా తన కొడుకే అనుకుంటాడు. హ్యూన్‌త్సాంగ్. అదేవిటంటే వాడు చైనా క్యాలండర్ ఫాలో అవుతాడని చెప్పింది లూలీ. సరే మరి ఈ పాహియాన్ గాడికి డిపార్ట్‌మెంట్‌లో అటెండర్ జాబ్ వేయించాను కదా.'

'వేయించారు' బాలరాజు.

'మరి వాడు తిన్నగా వుండి ఛస్తేనా - వాడు చేరిన దగ్గర్నుంచీ డిపార్ట్‌మెంట్‌లో కప్పలు మాయమైపోవడం మొదలైంది. కప్పలు జాలరి పేట వాళ్లు సప్లై చేసేవారు. ఈ పాహియాన్ గాడి మూలంగా తెప్పించుకునే కప్పలు చాలేవి కాదు. అంచేత యెక్కువ తెప్పించుకోవాల్సి వచ్చేది. ఓసారి ప్రిన్సిపాల్ నన్ను నిలదీసి అడిగాడు 'నీ బోడి ప్రాక్టికల్స్‌కి యెందుకయ్యా నీకిన్ని కప్పలు?' అని.

'ఆ కప్పలు పాహియాన్ మాయం చేస్తున్నాడని మీకెలా తెలిసింది?' బాలరాజు అడిగాడు.

'బలేవాడివి బాలరాజూ! పొలిటీషియన్‌కి అవినీతి యిష్టమనీ, పోలీసాడికి లంచాలు యిష్టమనీ, చైనావాడికి కప్పలు యిష్టమనీ వేరే తెలియాలా? అదీగాక అంతవరకూ ఏ సమస్యా లేనిది, సరిగ్గా వీడు జాయిన్ అవగానే కప్పలు అదృశ్యం అవడం ఏవిటి అందుకే పాహియాన్ గాడే దోషి అని తేలిపోయింది. వెంటనే వాడిని పిలిచి చెప్పేశాను. కొడుకువని ప్రేమతో చేరదీశాను. తండ్రినైన నాకే ద్రోహం తలపెట్టావు. నువ్విక నా కొడుకువీ కాదు. నేను నీకు తండ్రినీ కాను. లూలీలింగ్ యెంతో బతిమాలింది. కానీ ఫిజియాలజీ డిపార్టుమెంట్ పతనమైపోతుంటే యెలా సహించగలను. అంచేత మనస్సు రాయిచేసుకుని, పాహియాన్‌ని బైటికి పంపించేశాను. అందుకే యివాళ మధ్యాహ్నం వాడు 'నాన్నా' అని పిలిస్తే సహించలేకపోయాను. ఇదీ సంగతి బాలరాజూ. ఇప్పుడు నీకు నిజం తెలిసింది. నా మనసు తేటపడింది. నిన్ను నాతో చాలాసేపు వుంచేశాను. నడు వెళ్దాం.' అని ప్రొఫెసర్ గారు లేచారు.

బాలరాజు కూడా లేచాడు.

పావన్ బేకరీ మెట్లు దిగి మళ్లీ కలుద్దామని యిద్దరూ తమ నివాసాలకు నిష్క్రమించారు.

బాలరాజుకి ఫిజియాలజీ ప్రొఫెసర్‌గారి తీరు ఆయన తనతో తన సొంత విషయాలు పంచుకోవడం ఆలోచించిన కొద్దీ అంతు చిక్కలేదు. బాచిలర్స్ డెన్ చేరాక జరిగిందంతా తానీషాతో చెప్పాడు. తానీషా 'నువ్వు అదృష్టవంతుడివి గురూ. ఎవరితోనూ షేర్ చెయ్యని షేర్‌ఖాన్‌లాంటి ప్రొఫెసర్‌గారు నీతో ఎన్నో పెర్సనల్ మేటర్స్ షేర్ చేసుకున్నారు. నీకు ఫిజియాలజీ ఎగ్జామ్ ప్రాబ్లమే లేదు. '

'కానీ పాపం పాహియాన్ గురించే ఆలోచిస్తున్నాను' అన్నాడు బాలరాజు.

'చైనా వాడిగురించి ఏంచైనా అని నువ్వు ఆలోచించడం అనవసరం. చెడ్డైనా, మంచైనా అది ప్రొఫెసర్‌గారి హెడేక్కు. పాహియాన్‌కి హెల్పు చైనా అనుకుంటే అది తర్వాత ఆలోచించు. డిన్నర్ రెడీ అయినట్టుంది. కమాన్ - లెటజ్ యీట్ ఫుడ్' అన్నాడు తానీషా.

'ప్రొఫెసర్‌గారి చైనా ప్రేమ యేదో దైవ సంకల్పంలా వుంది' అన్నాడు బాలరాజు.

'కాదు. అంతా ఝునక్ ఝునక్ పాయల్ బాజే మహాత్మ్యం' అన్నాడు తానీషా.

'అన్నట్టు అడుగుదామనుకుంటూనే మర్చేపోతున్నాను. తానీషా నీకు దేవుడంటే నమ్మకం లేనట్టుంది. ఎప్పుడూ నమాజు చైడం చూడలేదు.'

'బలేవాడివే బాలరాజూ! నేను ముస్లిమ్‌ని కాదు. మా నాన్న రామభక్తుడు. నాకసలు రామదాసు పేరు పెడదామనుకున్నాట్ట ముందు. కానీ శ్రీరాముడు రామదాసుకి కాకుండా, తానీషాకు కనిపించాడు. అంచేత నేను తానీషా అయిపోయాను' అని విపులీకరించాడు తానీషా.

**కలెక్ట్రాఫీసు** జంక్షన్‌లో అజంతా హోటల్ బస్‌స్టాండ్ దగ్గర నిలబడ్డాడు బాలరాజు. పంది మెట్ట పాహియాన్ పరిగెత్తుకుంటూ వచ్చాడు.

'ఆయన నిజంగా నాకు నాన్నే సార్' అన్నాడు బాలరాజుతో.

'అవును. నాకు తెలుసు' అన్నాడు బాలరాజు.

'కానీ నేను డిపార్ట్‌మెంటుకి ఏ ద్రోహం తల పెట్టలేదు సార్. అంతా ఆయన మిస్ అండర్‌స్టాండింగ్'

బాలరాజు ఏవిటన్నట్టు చూశాడు.

'కప్పలకు వైటమన్ డి కావలంటూ ఆయనే కప్పల్ని ఫిజియాలజీ బ్లాకు టెర్రెస్ మీద వదిలాడు. అవి కప్పలు గదా - కప్పగంతులు వేసుకుంటూ జాలరిపేట వెళ్లిపోయాయి. వాటిని నేనే మాయం చేశాననే అపోహతో నన్ను వుద్యోగంలోంచి తీసేశారు.'

'అలాగా. సర్లే. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు బాగానే వున్నావుగా.' అన్నాడు బాలరాజు.

'ఏదోలెండి. టేకవే బాగానే నడుస్తోంది. మీరోసారి మా రెస్టారెంటుకి రావాలి. నా చేతి చౌమీన్ తినాలి.'

'తప్పకుండా.'

'మీరెక్కడ వుంటున్నారో చెబితే నేను డెలివరీ కూడా చేస్తాను.'

'బీచ్ వొడ్డున. బాచిలర్స్ డెన్. హవామహల్ దగ్గరకొచ్చి అడిగితే చెబుతారు.'

'తప్పకుండా సార్' అని పాహియాన్ సంతోషం వెలిబుచ్చాడు.

అప్పలరాజు కిళ్లీ కొట్టుదగ్గర ఎవిఎన్ కాలేజీ హిస్టరీ శర్మగారు కబుర్లు చెబుతున్నారు. బస్‌కోసం వెయిట్ చేస్తున్న బాలరాజుని ఆయన పిలిచారు. 'ఇప్పుడే ఓ బస్సు వెళ్లిపోయింది. ఇంకో బస్సు రావడానికి టైము పడుతుంది. ఏవిటీ - మెడిసిన్ చదువుతున్నావా?'

'అవునండి.'

'నేను తెలుసుగా -'

బాలరాజు ప్రశ్నార్థకంగా చూశాడు.

'నేనే. ఎవియన్ కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా పనిచేసి రిటైరయ్యాను.'

'నమస్కారం సార్.'

'రా. యిలా కూచో' అని తను కూర్చున్న బెంచీ పక్కన చోటు చూపించారు.

బాలరాజు కూర్చున్నాడు.

'మీ మెడికల్ వాళ్లకి హిస్టరీ చెప్పరు కదూ.'

'మరేనండి.'

'పోన్లే, వాళ్లు చెప్పకపోయినా నువ్విలా వచ్చినప్పుడల్లా నీకు హిస్టరీ నేను అప్‌డేట్ చేస్తూ వుంటాను.'

'సరేనండి.'

'ఏవిటిలా సైలెంట్‌గా వున్నావ్?'

'సైలెంటేవీ లేదండి. పరీక్షలు దగ్గరకొస్తున్నాయండి.'

'ఏం ఫర్వాలేదు. చెంగ్రలావు పేటలో శ్రీ కనకమహాలక్ష్మికీ, డాల్ఫిన్స్ నోస్ దగ్గరున్న కొండమీద వెంకన్నకీ నమస్కారాలు పెట్టేసుకో. పరీక్షలు చులాగ్గా దాటేస్తావ్.'

'ఏమిటలా చూస్తావ్ - నే చెప్పింది అక్షరాలా నిజం.'

'ఆయ్. చర్మగారి మాట సత్తెవండి' అప్పలాజు గొంతు కలిపాడు.

పాహియాన్ దగ్గరకు చేరాడు - శర్మగారికి నమస్కారం చేశాడు.

శర్మగారు - 'నువ్వు - నువ్వు పందిమెట్ట పాహియాన్‌వి కదూ. నువ్వు తెలీక పోడమేవిటీ - రా - రా' అన్నారు.

'మరయితే కనకమాలక్ష్మికీ, వెంకటేశ్వర స్వామికే దణ్ణం పెట్టుకుంటే పరీక్షలు పాసై పోవచ్చండీ?' అడిగాడు బాలరాజు.

'పోవచ్చేవిటయ్యా - పోయారు. చాలా కుర్రాళ్లు పాసైపోయారు. హిస్టరీ. హిస్టరీకి తేడాలుండవు.'

'అయితే తప్పకుండా దర్శనం చేసుకుంటానండి.'

'నువ్వు చేసుకోడం కాదు. నేను దగ్గరుండి చేయిస్తాను. ఇవాళ సాయంత్రం యిక్కడికే వచ్చెయ్. నువ్వు ఏ టైముకి వచ్చినా ఫర్వాలేదు. నేనిక్కడే వుంటాను. మరీ చీకటి పడేదాకా లేటు చెయ్యకు.'

'సరేనండి.'

'మరి నేను కూడా రానా సర్' అడిగాడు పాహియాన్.

'మీ దేవుడు బుద్ధుడు కదోయ్' అన్నారు శర్మగారు.

'అవునండి.'

'ఏవిటోయ్ - ఎప్పుడూ మఠం వేసుకుని అలా కూర్చునే వుంటాడు?'

'అవునండి. భార్యను వదిలేశాడండి మా బుద్ధుడు. అందుకని'

'భార్యను వదిలేయడానికీ, అలా కూర్చుని వుండి పోవడానికీ లింకేవిటి?'

'వెంకన్న స్వామి భక్తులకోసం రోజంతా నిలబడి శ్రమ పడతాడండి. టైరయిపోయాక ఆదిశేషువు మీద విశ్రమించి, భార్య లక్ష్మీ దేవి చేత కాళ్లు పట్టించుకుంటాడండి. పెళ్లాన్ని వదిలేసిన బుద్ధుడికి ఆ సౌకర్యం కుదరదు కదండీ. అంచేత అలాగే కూర్చుని వుంటాడు' అని వివరించాడు పాహియాన్.

'బాగా అన్నావ్ పాహియాన్! మాలో వొకడివై మంచి జ్ఞానివైపోయావ్. చాలా సంతోషంగా వుంది. నువ్వు కూడారా! అంతా కలిసే వెళ్దాం' అని లేచారు హిస్టరీ శర్మగారు.

ఆ సాయంత్రం అనుకున్నట్టే అందరూ అజంతా హోటల్ దగ్గర కలిశారు.

బాలరాజు, హిస్టరీ శర్మగారు, పందిమెట్ట పాహియాన్ కలిసిన కాస్సేపటికి తానీషా కూడా కలిశాడు.

'ఏవయ్యా! నువ్వు కూడా వస్తున్నావా?' అని అడిగారు శర్మగారు.

'అవునండి. ఎనాటమీ పరీక్ష దగ్గర పడుతుంటే, యెందుకో దైవభక్తి పెరుగుతోందండి' అన్నాడు తానీషా.

అంతా కలిసి పదమూడో నెంబరు బస్సెక్కి రీడింగ్ రూమ్ దగ్గర దిగారు.

'ఈ హిందూ రీడింగ్ రూమ్ వాధ్వాన్ రాణీ సాహిబా 1917లో కట్టించారు - ఆమె తండ్రి మహారాజా గోడే నారాయణ గజపతిరావ్ గారి జ్ఞాపకంగా బారన్ పెంట్‌లాండ్ దీనికి ప్రారంభోత్సవం చేశారు' అని రీడింగ్ రూమ్ చరిత్ర చెప్పారు హిస్టరీ శర్మగారు.

ముందుకి నడిచారు.

అంతా శ్రీ కనకమహాలక్ష్మి గుడికి వచ్చారు. అందరికీ అతి సులువుగా దర్శనమిస్తూ అమ్మవారు ఆ వీధి మధ్యలో అభయమిస్తోంది. అంతా కొబ్బరి కాయలు కొని కొట్టి నైవేద్యం సమర్పించుకున్నారు.

హిస్టరీ శర్మగారు మళ్లీ, 'ఈ దేవత 1912లో వొక బావిలో కనిపిస్తే తీసుకొచ్చి యిక్కడ ప్రతిష్ఠించారు. అప్పటి రాజాస్ ఆఫ్ విశాఖపట్నానికి యీవిడ ఆరాధ్యదైవం' అని అమ్మవారి ఆలయం గురించి చెప్పారు. దేవి దర్శనం అయ్యాక కదిలారు.

'అదుగో. ఆ యెదురుగా కనిపించేది ఘోషా హాస్పిటల్. 1894లో రాజా జీయెన్‌జీ రావుగారు నెలకొల్పి ప్రారంభించారు. 1949లో విక్టోరియా హాస్పిటల్‌గా పేరు మార్చారు. ఇది స్త్రీలకు ప్రత్యేకం' అని మళ్లీ వివరించారు శర్మగారు.

అంతా తలలు పంకిస్తూ విన్నారు.

నెమ్మదిగా టౌన్‌హాల్ రోడ్డులో నడుస్తూ బీచ్‌కి చేరారు.

హిస్టరీ శర్మగారు మళ్లీ చెప్పారు. 'ఈ టౌన్ హాల్‌కి బొబ్బిలి రాజావారైన వెంకట శ్వేతా చలపతి రంగారావు శంఖుస్థాపన 1901లో చేస్తే 1904లో డిస్ట్రిక్ట్ కలెక్టర్ కాంప్‌బెల్ బిల్డింగ్ పూర్తవగానే ప్రారంభోత్సవం చేశారు.

'వైజాగ్‌లో వీధులన్నీ తెలిసినా యివన్నీ చూసినా వీటి కథ యిప్పుడే తెలుస్తోంది' అన్నాడు పాహియాన్.

'మీతో రావడం రియల్లీ మాకు యెడ్యుకేషన్ మాస్టారూ' అన్నాడు బాలరాజు.

అంతా బీచ్‌రోడ్‌లో డాల్ఫిన్స్ నోస్ వేపు నడకసాగించారు.

'కాస్త తలలు పైకెత్తి చూడండి. ఎదురుగా కనిపించే మూడుకొండల్లో ఓ కొండమీద శ్రీ వేంకటేశ్వర స్వామిగుడి, మరో కొండమీద కన్నె మరియమ్మ, ఆ పక్క కొండమీద మసీదు - అన్ని మతాలను కొండంత గౌరవిస్తుంది వైజాగ్ అని చెబుతున్నట్టు లేదూ - అంటూ విశాఖ ఔన్నత్యాన్ని శ్లాఘించారు.

అంతా గుడి దగ్గరకు చేరారు. గుడిమెట్లు యెక్కేముందు రెండు కాళ్లూ పోగొట్టుకున్న వొక బిచ్చగాడు 'బాబూ! ధర్మం' అన్నాడు. ఎవరూ పట్టించుకోలేదు. బాలరాజు చిల్లర కోసం జేబు తడుముకుంటూ కాస్త తటపటాయించి దర్శనం తర్వాత తిరిగి వచ్చేటప్పుడు చూడొచ్చులే అనుకుని ముందుకి కదిలాడు.

'జనం బాగానే వున్నారు' అన్నాడు పాహియాన్.

'దర్శనం ఈజీగానే అవుతుంది కదు సార్' అడిగాడు తానీషా.

శర్మగారు మెట్లెక్కుతూ, 'మహరాజులా అవుతుంది. ఇదేవన్నా తిరుమల దర్శనం అనుకున్నావా? ఇక్కడ రికమెండేషన్ లెటర్స్, వి.ఐ.పి దర్శనాలు వుండవు. తిరుపతి కొండమీదలాగా భక్తుల్ని 'పోఫో' అని కుక్కల్ని తరిమినట్టు తరమరు. అక్కడ దేవుడెంత దయామయుడో సిబ్బంది అంత దయాహీనులు. మన వైజాగులో అలాంటి అరాచకం లేదు.' అని బదులు చెప్పారు.

దర్శనం దగ్గర బాలరాజుకి రేఖ కనిపించింది. అతని కంటి కాంతి హారతిలా వెలిగింది. ఆనందాతిశయంతో గోవిందా! గోవిందా! అన్నాడు. అంతా శ్రుతి కలిపి గోవిందా అన్నారు.

రేఖ, బాలరాజుని కొనకంటితో చూసింది.

ఆ చూపు బాలరాజుకి 'నీక్కాస్త భక్తికూడా వుందే' అన్నట్టుగా అగుపించింది.

శర్మగారి బృందమంతా దేవుడికి దణ్ణాలు పెట్టుకున్నారు. ఆశీర్వచనాలు అందుకున్నారు. దర్శనం పూర్తి చేసుకుని గుడిమెట్లు దిగారు. బాలరాజు ఆఖరిమెట్టుమీద ఆగాడు. అటూ యిటూ ఏదో వెదుకుతున్నట్టు చూశాడు.

'ఏవన్నా మర్చిపోయావా?' అని అడిగాడు తానీషా.

'లేదు. ఇందాక యిక్కడొక ముష్టివాడిని చూశాను. ఏవైపోయాడో' అన్నాడు బాలరాజు యింకా అటూయిటూ చూస్తూ.

'వాడేమైపోతే నీకెందుకు. నడు.' అన్నాడు తానీషా.

'కాదు ఇందాక వాడికి చిల్లర వేద్దామనుకున్నాను.. వెళ్లేటప్పుడు వెయ్యొచ్చులే అనుకున్నాను. ఇప్పుడు వాడు కనిపించడంలేదు. కాళ్లు లేకపోయినా యింతలో ఏవయ్యాడా అని?' - అన్నాడు బాలరాజు.

'సర్లే - వాడికి ప్రాప్తంలేదు. నడు' అన్నాడు తానీషా.

'వాడే దేవుడేమో!' అన్నాడు పాహియాన్.

'అవును. అతనే దేవుడు. ప్రాప్తం నాకే లేదు' అన్నాడు బాలరాజు.

'ఆ ఆలోచన చాలు దేవుడికి' అన్నారు శర్మగారు.

ప్రాణంతో కనిపించిన దేవుడిని వదిలేసి, పలకని రాతిదేవుడిని చూడాలనుకున్నాను కదా అనుకున్నాడు బాలరాజు.

'మనుషుల్లో దేవుడిని చూడడం మనిషి యెప్పుడో మానుకున్నాడు. ఆ స్పృహకోసమే యీ గుళ్లూ, గోపురాలూ, చర్చి, మసీదులూ' అన్నారు హిస్టరీ శర్మగారు.

నలుగురూ తిరుగు ముఖం పట్టారు.

'విక్టోరియా విగ్రహం దగ్గర బస్సెక్కుదాం' అన్నాడు తానీషా. అంతా క్వీన్ విక్టోరియా పెవిలియన్ దగ్గర కొచ్చారు.

'ఈ విగ్రహాన్ని 1904లో రైటానరబుల్ కాంప్‌బెల్‌గారు ఆవిష్కరించారు. అకితం వెంకట జగ్గారావు జమీందారుగారు 1900 సంవత్సరంలో ఇంగ్లండుకి వెళ్లినప్పుడు ఆయనకు యీ రాణీగారి విగ్రహాన్ని బహూకరించారు' అని మళ్లీ చెప్పారు హిస్టరీ శర్మగారు.

'మీరు నిజంగా వాకింగ్ ఎన్సైక్లోపీడియా మాస్టారూ. మీ మాటలు వినడమే మాకు గొప్ప యెడ్యుకేషన్' అన్నాడు తానీషా.

వెలుగు బాగా తగ్గుతోంది. రోడ్డు పక్కన దీపస్థంభాలు యిక వెలిగించండి బాబూ అని మునిసిపాలిటీవారిని లైన్లో నిలబడి అడుగుతున్నట్టుగా వున్నాయి.

నలుగురూ బండి వాడి దగ్గర వేరుసెనగపప్పు కొనుక్కుని పదో నెంబరు బస్సెక్కారు.

హిస్టరీ శర్మగారు కృతజ్ఞతతో వికసించిన ముగ్గురి ముఖాలవేపు ఆప్యాయంగా చూశారు.

బస్సు కదిలింది.

**బాచిలర్స్ డెన్‌లో** వంటవీరుడు నల్లతంబి అవాళ అందరికీ బాలరాజు తెచ్చిన కొబ్బరి చిప్పల ప్రసాదంతో కొబ్బరి పచ్చడి చేసి పెట్టాడు. బాలరాజు, తానీషా అండ్ ఫ్రెండ్స్ అక్కడికి చేరకముందునుండీ నల్లతంబి అక్కడ పనిచేస్తున్నాడు.

దాదాపు యాభై యేళ్లుంటాయి. కండలు తిరిగిన శరీరం. వంటచేసేటప్పుడు భీముడిలా చెయ్యనప్పుడు కష్టానికి యముడిలా అనిపిస్తాడు. కొద్ది రోజుల్లోనే అతను బాలరాజు బృందానికి తల్లో నాలికైపోయాడు. అతనికి భార్య యిప్పుడు లేదు. పిల్లలు పెరిగి యెవరిదారిన వారు స్థిరపడిపోయారు. ఒక్కడూ పదిమందిలా అక్కడే వుంటాడు.

భోంచేసేటప్పుడు అడిగాడు. 'బాబూ! అందరికీ అన్నీ సరిపోతన్నయా?'

'బ్రహ్మాండంగా' అన్నాడు మురళి.

'ఆయ్. హాపీస్ అండయ్యా - పరీచ్చలొత్తున్నట్టున్నాయ్. ఇక సదూలో బిజీ అయిపోతారనుకుంటా'

'అవునోయ్. ఇక అంతా సీరియస్‌గా చదువులో పడాలి.' అన్నాడు విజయ్.

'యెస్. ఒక నెలరోజులు అమ్మాయిల ధోరణి మానేసి చదవక తప్పదు' అన్నాడు మహీ.

'కరస్టు. మనం వెనకబడితే కొత్తమ్మాయిల వెనక పడటం మరో కొత్త స్ట్రెస్సు' - అన్నాడు తానీషా.

'సరే, కష్టపడి చదువుదాం. వెనకబడే ప్రశ్నేలేదు' అన్నాడు బాలరాజు.

అందరూ పుస్తకాలు తెరిచారు. మురళి గ్రేస్ ఎనాటమీ పుస్తకాన్ని పొత్తిళ్ళలో పట్టుకుని, తల వంకరగా తిప్పి, తల్లి చంటి పిల్లాడికి పాలిస్తున్న భంగిమలో చదువుతున్నాడు. విజయ్ కన్నింగమ్ వాల్యూంని యెడం చేతిలో పరిచి కుడిచేతి వేళ్లతో హార్మోనియం వాయిస్తున్నట్టు అక్షరాన్ని తడిమిపట్టుకుంటూ అటూ యిటూ తిరుగుతూ అర్జంటు పనున్న ఫాదర్ గారు బైబిల్ చదివినట్టు చదువుతున్నాడు. మహీ మంచం మీద సగం పడుకుని మిగతా సగం అంచు మీంచి వేలాడేసి కింద పరిచిన పుస్తకం పక్కన రెండు చేతులూ మోపి మరమరాలు నములుతున్నట్టు మాటలు నిశ్శబ్దంగా అనుకుంటూ చదువుతున్నాడు. శశి మరో మంచం మీద నందివాహనంలా పడుకుని పైకీ క్రిందకీ వూగుతూ బస్కీలు తీస్తున్నట్టు చదువుతున్నాడు. తానీషా వెల్లకిలా పడుకుని పుస్తకాన్ని గుండెలమీద పడేసుకుని, యిక నావల్ల కాదనుకుంటూ వచ్చే నిద్రను ఆపలేక ఆపసోపాలు పడుతున్నాడు. బాలరాజు అది చూసి 'ఒరేయ్! దాని బరువు ఎనిమిది పౌన్లు. నిద్ర వస్తే తలక్రింద పెట్టుకో. అలా గుండెల మీద కూర్చోబెట్టుకున్నావంటే శ్వాసాగిపోతుంది. ఆ తర్వాత చచ్చినా హార్టు కొట్టుకోదు' అన్నాడు.

'ఛస్తే హార్ట్ కొట్టుకోవడమేవిట్రా నీ మొహం?' అన్నాడు తానీషా.

'అన్నట్టు, హార్ట్ రైటారికిల్ రేపు ష్యూరూ' అన్నాడు మురళి.

'నీ మొహం, నువ్వెప్పుడూ హార్టంటే రైటారిక్‌లూ, చెంబు చూస్తే రెక్టమూ, చేట చూస్తే డయాఫ్రమూ తగుల్తాయంటావు. ఇన్నాళ్ల బట్టి చూస్తున్నాను. ఒక్క టెస్ట్‌లో వొక్కటి కూడా తగిలి చావలేదు.' అన్నాడు శశి.

'ఏడిశావ్‌లే. నీ బతుకంతా అమ్మాయిల ఎనాటమీని చదవడంతోటే సరిపోతోంది. ఎప్పుడేనా చదివేడుస్తేనా -' అన్నాడు మళ్లీ మురళి.

'నువ్వు మహా పొడిచావులే - క్రితం సారి క్లాస్ ఎగ్జామ్ వోరల్స్‌లో యూరినరీ బ్లాడర్ చూసి లంగ్ అన్నావు-' అంటూ పొడిచాడు శశి.

'సైలెన్స్ - అనవసరమైన వాగుడుతో అందరి చదువు పాడు చేస్తున్నారు. చదివితే చదువుకోండి. లేకపోతే నోర్లు మూసుకుని నిద్రపోండి' తానీషా సీరియస్‌గా వార్నింగిచ్చాడు.

'ఇప్పుడు కాస్త టీ తాగితేగాని ఏకాగ్రత కుదిరేలా లేదు' బాలరాజు సూచించాడు.

'ఓ.కె.' అన్నాడు తానీషా.

'అలా వూళ్లోకి నడుద్దాం - ఫ్రెష్‌గా వుంటుంది' బాలరాజు

'బాగాలేటయింది. ఇప్పుడు టీ యెక్కడ దొరుకుతుంది?'

'పూర్ణా టాకీస్ యెదురుగా వున్న అలంకార్ హోటల్ అర్ధరాత్రి దాటినా తెరిచే వుంటుంది.'

'అయితే ఎవరొస్తారోయ్ టీకి? '

బాలరాజు, తానీషా, మహీ, శశి కదిలారు. మురళి, విజయ్ ముసుగుతన్నేసారు.

'మనకి సబ్జెక్టంతా కవర్ చేసే టైమ్ లేదు. ఒక ఐదు క్వశ్చన్లు సెలెక్ట్ చేసుకుని చదివేద్దాం.' మహీ సజెస్ట్ చేశాడు.

'అవి తగలకపోతే'-శశి

'అందరం కలిసి బాగా డిసెక్ట్ చేసి సెలెక్ట్ చేద్దాం' - మహీ.

'ఓ.కె. తగిల్తే తలో కొబ్బరి కాయా కనకమహలక్ష్మికీ, శ్రీ వేకంటేశ్వర స్వామికీ కొట్టేద్దాం.' - బాలరాజు.

'దేవుడికీ దేవతకీ ఓరల్ ఎక్జామినర్స్‌లా వాళ్లలో వాళ్లకి పడకపోతే?' తానీషా.

'ఎనాటమీకి దేవుడు కొబ్బరికాయ, ఫిజియాలజీకి దేవత కొబ్బరికాయ కొడదాం.'

'అనుకున్న క్వశ్చన్లు దిగకపోతే, మన బుర్రలు తీసుకెళ్లి కొట్టుకోవాలి.'

'మరేం చేస్తావోయ్?'

'ఏం చేస్తావోయ్ - ఏదో వొకటి ఏడుద్దాం.'

టీ తాగడానికి రెండు గంటలు గడిపి నివాసానికి చేరారు నలుగురూ. నిస్సహాయత నిండుకున్న వాళ్ల హృదయాలు ఎనాటమీ పుస్తకాల్లాగే ఎనిమిదేసి పౌన్ల బరువెక్కాయి. పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని బాలరాజు - యింత బరువైన సబ్జక్టైనా సినిమాకి పనికిరాదు కదా. అనుకున్నాడు. కలిసి కూర్చుని క్వశ్చన్లు ఎక్స్ట్రాక్ట్ చైడం మొదలెట్టారు.

'బ్రేఖియల్ ప్లెక్సస్'

'అదిచ్చేశాడు.'

'కార్పస్ కొల్లో సమ్'

'అదీ యిచ్చేశాడు.'

'థర్డ్ వెంట్రికిల్'

'అదీ యిచ్చేశాడు.'

'హైపోగ్లాసల్ నెర్వ్'

'అదీ యిచ్చేశాడు.'

'ఫోర్నిక్స్'

'ఆం - ఎప్పుడూ విన్నట్టులేదు. అది చదువుదాం.'

-ఇలా పేజీలతో కుస్తీలు పట్టి రీసెంట్ పాత పరీక్షల్లో యిచ్చిన ప్రశ్నలు వదిలేసి, లాటరీ వేసి అయిదు క్వశ్చన్లు రెడీ చేసుకుని, తెల్లవార్లూ బాగా మరాడించి చదివారు. తెల్లార కట్ట నిద్రలోంచి లేచి మురళి, విజయ్‌లు కూడా చదివారు.

పరీక్ష రోజు పొద్దుటే నిద్రాపుకుంటూ అంతా పరీక్షకి బైల్దేరారు. పరీక్ష హాల్లోకి అడుగు పెట్టగానే ఏదో వింతధైర్యం, ఆత్మ విశ్వాసం వాళ్లని ఆవహించింది. ఆవులిస్తూ తమ తమ సీట్లలో కూర్చున్నారు.

ఆన్సర్ పేపర్స్ మీద నెంబర్లు రాయగానే గంట కొట్టాను. క్వశ్చన్ పేపర్లు అందరికీ అందాయి. ప్రశ్నలు చూడగానే బాచిలర్స్ డెన్ బృందమంతా వొకరి మొహాలు మరొకరు చూసుకున్నారు. అలా చూసుకున్నప్పుడు వాళ్లకి తమ మొహాల్లో జవాబులు కనిపించకపోగా, వొకరి మొఖం మరొకరికి వూహించని రణప్రశ్నలా కనబడింది. అన్నీ రాత్రి వదిలేసిన ప్రశ్నలే. మీరెప్పుడు జవాబిచ్చినా మేం సిద్ధమే. ఏదో వొకటి మీ శక్తి కొద్దీ ప్రయత్నించండి. అని వ్యంగ్యంగా వేడుకుంటున్నట్టు కనిపించాయి. పెన్నుల్లో యింకయిపోయినట్టు ఆగిపోయారు. మిగతా జనం పరపరా రాసేస్తున్నారు. వాళ్లని చూసి, 'వీళ్ల మొహాలు డిసెక్ట్ చెయ్యా!' అనుకుంటూ ఎలాగో అలా బుర్రలో చెప్పింది బరికి పరీక్ష రాయడం పూర్తయింది అనిపించారు.

బైటికొచ్చాక అంతా మహీని పట్టుకుని తిట్టారు - 'నీ వల్లే పరీక్ష తగలేశాం. బోడి అయిడియా నువ్వూను. అంత సబ్జక్టులో అయిదు ప్రశ్నలు సెలెక్ట్ చైడం. నువ్వు చెప్పడం. మేం గంగిరెద్దుల్లా తలలు వూపుకుంటూ వినడం. బలేడిజాస్టర్ -' అంటూ.

'సర్లెండిరా - నాదే తప్పు. ఏమీ చెయ్యలేనప్పుడు ఏదో వొకటి చెయ్యమనడం నాదే తప్పు.' మహీ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆ నీటిలో తన కారణంగా తన స్నేహితులు పరీక్ష పాడుచేశారే అనే బాధవుంది.

'అయినా మనిషి శరీరంలో యింపార్టెంటూ, అనింపార్టెంటూ వుంటాయనుకోవడం బుద్ధి తక్కువ' విశదీకరించాడు శశి.

'ఛీ మనమెప్పుడూ యింతే - పరీక్ష రేపనేదాకా మెలుకువ రాదు.' విజయ్.

'దీన్నే ప్రసూతి వైరాగ్యం అంటారు.' తానీషా.

'ఎనాటమీలో గైనిక్ కూడా వుంటుందని యిప్పుడు తెలిసింది -' అన్నాడు బాలరాజు.

కొద్దిరోజుల్లోనే స్పెసిమన్స్ స్పాటింగ్‌తో సహా ఓరల్ ఎగ్జామ్స్ పూర్తయ్యాయి. ఎగ్జామినర్స్ అరిచేయడం, కరిచేయడం, జుట్లు పీక్కోవడం, పులి డ్యాన్సులు చైడం అన్నీ ముగిశాయి.

రిజల్ట్సు నోటీస్ బోర్డులో పెట్టేముందే థియేటర్ దగ్గర పడిగాపులు పడిన అమ్మాయిలనీ, అబ్బాయిలకీ ట్యూటర్స్ రిజల్ట్సు చేరవేశారు.

బాచిలర్స్ డెన్ బృందానికి రిజల్ట్స్ మీద ఆశ పరీక్షలయిన రోజునే పోయింది. కానీ మహీ వొక్కడే రిజల్ట్స్ తెలుసుకుందావని వెళ్లాడు. అతను తిరిగొచ్చేసరికి మురళి పేకముక్కలు కలుపుతున్నాడు. అన్నం కలుపుతూ ముద్దలు చేస్తున్న తల్లి దగ్గర పిల్లల్లా బాలరాజు, తానీషా, విజయ్, శశి కూచుని వున్నారు.

'కంగ్రాట్స్ గురూ - కంగ్రాట్స్' బాలరాజూ, తానీషా, మురళి, విజయ్, శశీ అంతా పాస్ - 'ఆనందంగా అరిచాడు మహీ. నమ్మశక్యం కాని వార్త విని వారంతా అరక్షణం బిగిసి పోయారు. మహీ నెమ్మదిగా కిటికీ దగ్గరకు వెళ్లి సముద్రాన్ని చిరునవ్వుతో చూస్తూ వుండిపోయాడు. ఆనంద సముద్రంలో కాసేపు ఈత కొట్టి తేలి తేరుకున్న అయిదుగురూ శుభవార్త తెచ్చిన మహీ చుట్టూ చేరారు. బాలరాజు అడిగాడు - 'మహీ నువ్వు కూడా పాసయ్యావుగా. మహీ 'నో' అన్నట్టు తల వూపాడు. తానీషా రెండు చేతుల్తో మహీ ముఖాన్ని తన వైపు తప్పుకుని 'నిజం' అని అడిగాడు 'యెస్ - నేను ఫెయిల్' అన్నాడు మహీ. థియరీ పరీక్ష తర్వాత తప్పు తనదేనని వినయంగా వొప్పుకుంటూ తన మిత్రుల మేలుకోరిన

చెమర్చిన మహీ కళ్లు వాళ్లకి జాలిగా అనిపించాయి. వాళ్లకారోజు చచ్చిపోయిన మనిషిని చదివి పొసైనట్టు లేదు. వాళ్ల మధ్య తిరిగే మనిషెవరో చచ్చిపోయినట్టుంది.

**మర్నాడంతా** పగలు బాచిలర్స్ డెన్‌లో మౌనంగా గడిచింది. సాయంత్రం బాలరాజు వొక్కడూ బీచ్‌కి బైల్దేరాడు. స్కాండల్ పాయింట్ దగ్గర యిసుక మీద కూర్చుని సముద్రం కేసి చూస్తున్నాడు. చీకటి పడేలావుంది. డాల్ఫిన్స్ నోస్ మీది లైట్ హౌస్ కన్నుకొడుతున్నట్టు మెరుస్తోంది.

బాలరాజుకి తన చిన్నప్పటి రోజులూ, తను పుట్టిన వూరిలో స్కూల్‌డేస్, యిల్లు, అమ్మ, నాన్న గుర్తుకొచ్చారు. తన వూరు పల్లెటూరు కంటే పెద్దది. పెద్ద టౌను కంటే చిన్నది. తనకి జ్ఞానం తెలిసేసరికి నాన్న రిటైరయిపోయి ఆరోగ్యం హెచ్చు తగ్గులతో అవస్తపడుతున్నాడు. అమ్మే అన్నీ చూసుకునేది. స్కూల్లో పాఠాలన్నీ తెలుగులోనే చెప్పేవారు. అందుకే కాలేజీలో చేరిన ఫస్టియర్ బాగా కష్టపడాల్సి వచ్చింది. క్లాస్‌లో మాస్టారు చెప్పిన హిందూ దేశ చరిత్ర యింకా గుర్తుంది. ముందుగా మన దేశానికి తురకరాజులు వచ్చి మన రాజుల్నందర్నీ చెడామడా వాయించేసి మనల్ని యేలేశారు. అందర్నీ గుళ్లు గీయించుకుని. గడ్డాలు పెంచేసుకోమని 'అల్లాహో హో అక్బర్, అల్లాహో షాజహాన్' అని ప్రార్ధనలు చెయ్యమన్నారుట. మన బానిస వెధవలకి బానిస బుద్దులు కాబటి - 'చిత్తం ప్రభో!' అంటూ సలాములు చేస్తూ గులాములై బ్రతికారట. ఆ తర్వాత తెల్లదొరలు వచ్చారట. వచ్చి, తురక రాజుల్ని తరిమి కొట్టి దేశమంతా ఆక్రమించారుట. మన వాళ్లందర్నీ పిలిచి, 'ఒరే హిందువులు మీరంతా క్రాపింగులు పెంచేసుకుని, గడ్డాలు గీసేసుకుని ఫ్రెంచ్ కట్ మీసాలు పెంచేసుకోండిరా' అన్నారుట.

మన వెధవలు బానిస వెధవలు కదా, బానిస బుధ్ధులు యెక్కడికి పోతాయి. 'చిత్తం, మహా ప్రభో!' అంటూ అంతా పెంచుకున్న గడ్డాల్ని గొరిగేసుకుని, తలమీద జుట్టు పెంచేసి దువ్వేసుకుని, మీసాలు కూడా పెంచేసుకుని 'యెస్ సర్ - అలాగే సర్' అంటూ తెల్లవాడి కాళ్లు పిసుకుతూ బతికారుట. ఆ తర్వాత గాంధీగారు వచ్చి అందర్నీ కేకేసి బెంచెక్కించేశారుట. తర్వాత వీళ్లందర్నీ ఓడల్లోకి యెక్కించేసి 'ఒరేయ్ మీరంతా ఇంగ్లండు వెళ్లండ్రా అన్నార్ట. 'ఇంగ్లండ్ వెళ్లి అక్కడ మేం ఏం చెయ్యాలి? మహాత్మా' అని గాంధీగారిని అడిగారుట. 'ఒరేయ్ - యీ తెల్లవాళ్లు మనల్ని దోచుకోవడానికి వచ్చారు. వీళ్ల ఆడంగుల్ని మాత్రం అక్కడే వదిలేశారు - అంచేత మీరంతా అక్కడికి వెళ్లి వాళ్లతో కొన్నాళ్లు సంసారాలు చెయ్యండ్రా-' అని చెప్పారుట గాంధీగారు. 'అలా మేం చెయ్యొచ్చా?' అని అడిగితే -

'చెయ్యాలిరా, తప్పదు. అదే స్వాతంత్ర్య సమరం' అని చేతిలో క్రవపూపి సిగ్నలిచ్చి, ఓడల్ని యింగ్లండ్ తోలేశార్ట. మన భారతీయులంతా అక్కడకి వెళ్ళి మొగుళ్ళు వొదిలేస్తే వొంటరితనంతో సతమతమవుతున్న తెల్లపిల్లలతో సంసారం చైడం మొదలెట్టార్ట. ఈ విషయం తెలిసి విక్టోరియా రాణికి విరోచనాలు పట్టుకున్నాయట. ఈ విషయం మన దేశాన్ని యేలుతున్న తెల్ల పీనుగులికి తెలిసి, యింగ్లండంతా యిండియా అయిపోతుందని కంగారుపడి, అర్జంటుగా మనకి స్వాతంత్ర్యం యిచ్చేసి వాళ్ల దేశానికి వుడాయించేశారు.

ఆ మేష్టారి పేరు యింకా గుర్తుంది. చలపతిరావు. చలపతిరావు చెప్పిన పాఠం నోట్సు రాసుకుని యింటికి వచ్చి చదువుకుంటుంటే నాన్న చూసి కంగారుపడ్డారు. 'ఎవడ్రా ఆ పాఠం చెప్పింది?' అనడిగారు. చలపతిరావని చెప్పాను. 'ఆ చలపతిగాడా. మా నాన్న రమ్మన్నాడని. వొకసారి వాడిని యింటికి పిలు' అని ఆదేశించారు. నాన్నకూడా అదే స్కూల్లో టీచర్‌గా పనిచేసి రిటైరయ్యారు. తను మాస్టార్ని కలిసి 'మా నాన్నగారు. మీతో మాట్లాడాలంటున్నారు. వొకసారి యింటికి రమ్మన్నారు' అని చెప్పాడు. చలపతి రావు మాస్టారికి నాన్నగారంటే యెంతో భక్తి గౌరవాలున్నాయి. మర్నాడు ఆయన వచ్చి నాన్నని కలిశారు.

'ఏవయ్యా! చలపతీ! ఏవిటయ్యా నీ ధోరణి. గాంధీగారి గురించి అవాకులూ చవాకులూ చెబుతున్నావ్ పిల్లలకి. మన దేశ స్వాతంత్ర్యం కథ అంటూ రంకు పురాణం బోధిస్తావా! వున్నవీ లేనివీ కల్పించి చెప్పి కుర్రాళ్లకి వక్రజ్ఞానం నేర్పుతావా? అసలేవిటి నీ వుద్దేశం. నువ్వు చెప్పేది కరెక్ట్ అనుకుంటున్నావా? లేక కారా కిళ్లీ వేసుకుని క్లాసు తీసు కుంటున్నావా? అని చెడామడా దులిపేశారు నాన్న.

'ఏం చెయ్యమంటారు చెప్పండి. వీళ్ల సిలబసే అవక తవగ్గా వుంది' అన్నారు చలపతిరావుగారు.

'అహా అలాగా! ఎలా వుండాలేంటి సిలబస్' అన్ని అడిగారు నాన్న.

'అయ్యా! తమకు తెలియందికాదు. మనదేశాన్ని చోళరాజులు రెండువేల సంవత్సరాలు పైగా పరిపాలించారు. తర్వాత చాళుక్యులు ఏడొందల సంవత్సరాలు, పల్లవులు ఆరొందల సంవత్సరాలు తర్వాత రాష్ట్ర కూటులు అయిదొందల వత్సరాలు, యిక విజయనగర రాజులు నాలుగొంద యేళ్లు యేలారు. దేశాన్ని సుభిక్షంగా పరిపాలించారు. దేశం తెలివినీ, కళా సంపదనీ చాటే అనేక కట్టడాలను, దుర్గాలను, దేవాలయాలను నిర్మించారు. ఇవేవీ మన పిల్లలకు చెప్పనివ్వరు. ఎంతసేపూ మొగలు చక్రవర్తుల పాలన, బ్రిటిష్ వాడి ఆధిపత్యం తప్ప మరోగోల వుండదు. ఈ తెల్ల పీనుగుల వంకర రాతల్ని యెలా చెబితే యేవిటి? అనిపించింది. వొళ్లుమండి వీళ్లకి వ్యంగ్యచరిత్ర చెప్పాను. పెద్దవారు. నన్ను మన్నించండి. ఇకనుండి పిల్లల భవిష్యత్తు దృష్టిలో వుంచుకుని పాఠాలు చెబుతాను. అని చలపతిరావు మేష్టారు సుదీర్ఘమైన సంజాయిషీ

చెప్పారు. 'నీ ఆవేదన నాకర్థమైంది చలపతీ పాఠాలు జాగర్త' అని ఆప్యాయంగా చలపతిరావుగారి వెన్ను తట్టి నాన్నగారు శాంతించారు.

'వెళ్లొస్తాను' అన్నా వినకుండా పట్టుబట్టి చలపతి మేష్టారుకి భోజనం తినిపించి పంపించారు నాన్న.

తనది మధ్య తరగతి కుటుంబం. దుర్భరమైన పేదరికంలేదు. అలాగని నిర్భయమైన సంపదలూ లేవు. తల్లిదండ్రులు నిరాడంబరంగా బ్రతకడం అలవాటు చేశారు. ఇంటిగురించి ఆలోచించిన కొద్దీ యెన్నో విడివిడి జ్ఞాపకాలు. అమ్మ రోజూ పెరట్లో తులసికోట దగ్గర కూర్చుని పూజ చేసేది. చుట్టూవున్న కనకాంబరం, నందివర్ధనం, మందారాలతోబాటు తనుకూడా చూసేవాడు. చదువయ్యాక రాత్రి డాబామీద పడుకునేవాడు. ఇంటి కాంపౌండులో యెత్తుగా పెరిగిన పెద్ద నేరేడు చెట్టు వూగుతూ చల్లని గాలితో జోకొట్టేది. వూర్లో సింగిల్ ప్రొజెక్టర్ సినిమా హాలుంది. చాలాసార్లు సినిమా ఆపవలసి వచ్చేది. ఒకసారి ఆ హాల్లో దయ్యాల కథ వున్న వొక యింగ్లీషు చిత్రం చూశాడు తను. ఆ సినిమా చూశాక దెయ్యాలు నిజంగా వుంటాయనిపించింది. దెయ్యాలంటే బాగా భయం పట్టుకుంది. తర్వాత యెవరో చెప్పారు. నేరేడు చెట్టుమీద దయ్యాలుంటాయని. ఇంట్లోవున్న ఆ చెట్టు వూగినప్పుడల్లా దెయ్యం వూపుతోందని జడుసుకునేవాడు. పెద్దగాలికి చెట్టు, అలా వూగుతోందని అమ్మ ధైర్యం చెప్పినా భయం పోలేదు. అంచేత డాబా మీద పడుకోడం మానేసి కిందగదిలోనే పడక మార్చుకున్నాడు.

నాన్న భాగవతం చదువుకునేవారు.

వొకసారి ఆయనకి దగ్గు, ఆయాసం వచ్చింది. వూళ్లో రెండో మూడో ప్రైవేటు హాస్పిటల్స్, వొక ప్రభుత్వ ఆస్పత్రి వున్నాయి. తను యింటిదగ్గర్లో వున్న ప్రైవేట్ హాస్పిటలుకి నాన్నని తీసుకు వెళ్లి పరీక్షలు చేయించి మందులు తీసుకుని వస్తే, అమ్మ జాగర్తగా మందులు వాడింది. నాన్న ఆరోగ్యం బాగా మెరుగైంది. పక్కింట్లో భూషణంగారని వుండేవారు. బ్యాంకులో పనిచేసి రిటైరయ్యారు. ఆయన అప్పుడప్పుడు వచ్చి పలకరించేవారు. ఆయన వొకసారి నాన్నని అడిగారు – ' మీవాడిని యేం చదివిద్దామనుకుంటున్నారు–' అని.

'నాకు పెద్ద చదువులు చదివించే స్తోమత లేదు. ఏదో వో డిగ్రీ చేయిస్తే యిక్కడి స్కూల్లోనే వుద్యోగం చూసుకుంటాడు. మాకూ దగ్గర్లో వుంటాడు' అన్నారు నాన్న.

'బలేవారే – కుర్రాడికి మార్కులొస్తే అలాంటి పని మాత్రం చెయ్యకండి. చక్కగా పై చదువులకి పంపించండి. డబ్బు దేవుంది? ఆ టైముకి అన్నీ బాగుంటే సర్దుబాటుకి సౌకర్యం దొరక్కపోదు.' అని భూషణంగారు ప్రోత్సాహ వాక్యాలు చెప్పారు. భూషణంగారు భేషజంలేని మనిషి. పరోపకారం అంటే ముందుకి వస్తాడని చెప్పుకునేవారు.

కిందగదిలో పడుకోవడం మొదలుపెట్టాక, నాన్న ఆరోగ్య పరిస్థితి బాగా తెలుస్తోంది. ఒకరోజు నాన్నకి బాగా జ్వరం వచ్చింది. అమ్మ మిరియాల కషాయం యిచ్చింది. పత్యం చేయించింది. జ్వరం తగ్గు ముఖం పట్టలేదు. అపస్మారకంలోకి వెళ్లిపోతున్నారు. హాస్పిటల్లో అడ్మిట్ చెయ్యాల్సిన పరిస్థితి యేర్పడింది. వాకబు చేస్తే వూళ్లో వున్న రెండు హాస్పిటల్స్‌లోని నాలుగైదు బెడ్స్ ఖాళీ లేవు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో పనిచేసే కాంపౌండర్ నాన్నకి పాత స్టూడెంట్. అతని పేరు చలం. నాన్నంటే బాగా గౌరవం. చలాన్ని పట్టుకుని నాన్నని ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేయించాం. అక్కడి డాక్టరు నాగదాసు. కొత్తగా వచ్చాడుట. వచ్చిన కొద్దిరోజులకే కర్కోటకుడని పేరు తెచ్చుకున్నాడు. హాస్పిటల్ చూడ్డానికి పాడైపోయిన జైలులా వుంటుంది. గేటు దగ్గర వీధి కుక్కలు తిరుగుతూ వుంటాయి. గోడలు మసిబారివుంటాయి. గదులు హాస్పిటల్ వాసనతో నిండి అక్కడి రోగుల కంటే రోగ భూయిష్టంగా వుంటాయి. డాక్టరు నాగదాసు అదే పనిగా అందరి మీదా అరుస్తూ వుంటాడు. అటూ యిటూ తిరిగే నర్సుల్ని పిర్రలమీద గిల్లుతూ వుంటాడు. కాంపౌండర్ చలం చెప్పాడు. అక్కడ చేరిన వాళ్లు రోగ్స్ - అంటే రోగులు అనీ, డాక్టరొక రోగ్ అనీ. అందరి దగ్గరా అదే పనిగా డబ్బు గుంజుతూ వుంటాడుట. విలవిల్లాడుతున్న రోగగ్రస్థుల్ని విసుక్కుంటూ చూస్తాడుట. హాస్పిటల్లో అడ్మిట్ అయాక డాక్టరు నాగదాసు, నాన్నని వొక్కసారి కూడా తిన్నగా చూసిన పాపాన పోలేదు. అంతా చలం దగ్గిరుండి చేసేవాడు. దేవుడిలా వుండాల్సిన డాక్టరు దెయ్యం పట్టిన వాడిలా అలా యెందుకున్నాడో అప్పుడు తనకి అర్థం కాలేదు.

అయిదార్రోజుల తర్వాత నాన్నకి జ్వరం బాగా తగ్గుముఖం పట్టింది. ఇంటికి తీసుకు వెళ్లొచ్చని చెప్పాడు చలం. దేవుడిలా అనిపించిన చలాన్ని చూసి అమ్మ దణ్ణం పెట్టింది. 'పెద్దవారమ్మా! నాకు అలా దణ్ణం పెట్టకండి' అని వారించాడు చలం. ఇంటికి వచ్చేరోజు డాక్టర్ నాగదాసు నాన్నని చూడ్డానికి బుసలు కొడుతూ వచ్చాడు. అమ్మ దగ్గర్నుంచి అతడికి ప్రైవేటుగా డబ్బేమీ ముట్టలేదు. నాన్నకి చర్మం అంతా పొడిగా బిరుసుగా అయిపోయింది. 'వొంటికి కాస్త నూనె యేవన్నా రాయొచ్చా డాక్టర్‌గారూ' అని అడిగింది అమ్మ.

'ఆ - రాయొచ్చు. నూనె కొనడానికి నీ దగ్గర డబ్బుందా మరి?' అని వురిమాడు నాగదాసు.

అమ్మ బాగా చిన్నబుచ్చుకుంది. ఏవీ అనలేకపోయింది. తనకి కోపం తన్నుకొచ్చింది. నాగదాసుని కర్రతో పాముని కొట్టి చంపేసినట్టు చంపెయ్యాలనిపించింది. కానీ యేమీ చెయ్యలేకపోయాడు.

ఇంటికొచ్చేసాక ఆలోచించాడు. డాక్టర్లు మాట తీరుతో మనిషి రోగాన్ని సగంపైగా తగ్గించవచ్చు. ఆపైన మంచి వైద్యంతో రోగిని మాములు మనిషిని చెయ్యవచ్చు. అసలు తనెందుకు డాక్టర్ చదవకూడదు. చదివి మంచిడాక్టరై, రోగుల పాలిట దేవుడై యిలాంటి నాగదాసుల విషాన్ని పిండేయొచ్చుగా -

బాగా చీకటి పడుతోంది. బాలరాజు ఆలోచనా సముద్రం నుండి తేరుకుని అసలు సముద్రకేసి చూసాడు. దూరంగా షిప్పులాగుంది. కార్తీక దీపపు ప్రమిదలా వెలుగుతూ కదుల్తోంది. లేచి తనకులాయం వేపు కదిలాడు.

**కాలేజ్ రీ** వోపెనింగ్ ముందు కాసిని రోజులు ఖాళీ వచ్చాయి.

నల్లతంబి బ్రేక్‌ఫాస్ట్ చేసి అందరికీ అందించాడు.

'ఏవిటి మన ప్రోగ్రాం యిప్పుడు?'అడిగాడు విజయ్.

'ఈ మధ్య మనం జిమ్‌కి వెళ్లడం మానేశాం. పరీక్షలయిపోయాయి కాబట్టి మన శరీరాల్ని రీ కండిషన్ చేద్దాం' అన్నాడు శశి.

'అలాగే కాస్త మానసికంగా రిలాక్స్ అవడానికి యేవన్నా సినిమాలుకూడా చూద్దాం' అన్నాడు మురళి.

అంతా మెన్స్ హాస్టల్ దగ్గరున్న కాలేజ్ జిమ్‌కి బైల్దేరారు. ఎక్సర్‌సైజులు యెంతో రిలీఫ్‌గా అనిపించాయి. క్రమం తప్పకుండా రోజూ జిమ్‌కి వెళ్లడం అలవాటయింది. ఇక సాయంత్రాలు వరుసగా వూళ్లో ఆడే సినిమాలన్నీ చూడసాగారు. అందరికీ బాగా సినిమా భాష పట్టేసింది. వారి సంభాషణల తీరులో బాగా మార్పు వచ్చింది. కొద్ది రోజుల్లో మళ్లీ కాలేజ్ మొదలయ్యింది. మహీ తప్ప అందరూ కలెక్ట్రాఫీసు జంక్షన్ దగ్గర అజంతా హోటల్ పక్కనున్న భట్టాచార్య మెడికల్ బుక్ షాపులో స్టెతస్కోపులు కొనుక్కున్నారు.

హాస్పిటల్లో క్లినికల్స్‌కీ, ఫార్మా కాలేజీ క్లాసులకీ వెళ్లడం ప్రారంభించారు. మెడలోకి స్టెతస్కోపు రాగానే అందరిలో డాక్టర్లం కాబోతున్నావనే వుత్సాహం వురకలు వేసింది. మహీ మాత్రం వెనుకబడటం వల్ల తన ప్రీ క్లినికల్ రిపీట్‌కి హాస్టల్లో వుండి చదువుతాను అని హాస్టల్‌కి షిఫ్ట్ అయిపోయాడు.

ఫార్మకాలజీ ప్రొఫెసర్‌గారు కొత్త బ్యాచ్‌కి పాఠాలు మొదలుపెట్టారు. 'మీరు యీ యేడాది అంతా మందు గురించి తెలుసుకుంటారు. మందు అంటే విస్కీ, బ్రాందీ, ఓడ్కా వగైరాలు కాదు. మందు అనగా ఔషధం. రోగాలు తగ్గించడానికీ, రోగాలు పెరక్కుండా ఆపడానికీ సాయపడేదన్నమాట. మందు గురించి బాగా నేర్చుకుంటే ముందుకి వెళ్తారు. అంచేత పదండి ముందుకు' అని స్టూడెంట్స్‌కి సందేశం యిచ్చారు. బాలరాజు, తానీషా బాగా విన్నారు. ఇంకా హాస్పిటల్ వార్డులో క్లినికల్ రౌండ్స్ ఫాలో అవుతూ క్లినికల్ స్కిల్స్ కూడా నేర్చుకోసాగారు.

ఒకరోజు పీడియాట్రిక్స్ క్లినికల్ రౌండ్స్ అసిస్టెంట్స్, పి.జి.ల వెనకే బాలరాజు, తానీషా చేరారు. మురళి, విజయ్, శశి వేరే వార్డుకి వెళ్లారు. బుచ్చిబాబు అనే పి.జి, బాలరాజుని, తానీషాను చేరదీసి 'ఒరేయ్ జూనియర్లూ, ఏవీ

కంగారుపడకండి. ఏవన్నా డౌట్లు వస్తే నన్నడగండి‘ అని భరోసా యిచ్చాడు. బుచ్చిబాబు నాన్నకి చెంగలావు పేట మెయిన్ రోడ్డులో పెద్ద కిరాణా కొట్టుంది. అప్పుడప్పుడు తను కూడా కొట్లో కూర్చుని తండ్రికి సాయపడుతూ వుంటాడు.

పీడియాట్రిక్స్ బాస్ ముఖర్జీగారనే లేడీ డాక్టరు. ఆరడుగుల భారీ పెర్సనాలిటీ. వైజాగ్ చుట్టుపక్కల ఆమె పేరు మోసిన పిల్లల డాక్టరు. ఆమె రాగానే స్టూడెంట్స్, హౌస్ సర్జన్లు, పి.జి.లు. అసిస్టెంట్‌లు అంతా సైలెంటయ్యారు. వార్డులో అక్కడా అక్కడా పిల్లల క్యార్ క్యార్ శబ్దాలు తప్ప మరేం వినిపించడంలేదు. ముఖర్జీ మాత తన సైన్యంతో ప్రతీ బెడ్ దగ్గరికి వెళ్లి పేషెంట్స్‌ని చూస్తోంది. తల్లుల్ని పలకరిస్తోంది. పురమాయించిన క్లినికల్ పనులు చేశారా అని స్టాఫ్‌ని అడుగుతోంది. ఒక బెడ్ దగ్గర ఆగి, ‘బుచ్చిబాబూ! ఈ కుర్రాడి టెంపరేచరెంతయ్యా?‘ అని అడిగింది. వెంటనే బుచ్చిబాబు ‘నూట్రెండు సిల్లరండి‘ అన్నాడు.

అందుకు ముఖర్జీమాత, ‘బుచ్చిబాబూ! టెంపరేచరు నూట రెండు పాయింటు వొకటో, రెండో, మూడో చెప్పకుండా చిల్లరంటావేంటయ్యా? నీ కిరాణాకొట్టు బుద్ధులు పోనిచ్చు కున్నావు కాదు‘ అంది. అంతా నవ్వారు. ఆ నవ్వుల మధ్య ప్రత్యేకంగా రేఖ నవ్వు వినిపించింది. ఇన్నాళ్లూ నిన్ను మిస్ అయిపోయాను తల్లీ అనుకుంటూ బాలరాజు, రేఖవేపు చూశాడు. రేఖ, బాలరాజుని చూసీచూడనట్టు చూసింది. బుచ్చిబాబు ‘సారీ మేడమ్ - నూట్రెండు పాయింటు రెండండి‘ అన్నాడు.

ముఖర్జీ మాత ‘ఉఁ‘ అని హూంకరించి వూరుకుంది.

వార్డు రౌండ్స్ అయ్యాక బాలరాజు, తానీషా క్లినికల్ క్యాంటీన్ వేపు కదిలారు.

‘రేఖ బావుంటుంది కదూ‘ అన్నాడు బాలరాజు.

‘అవును. నాకు హసీనా బేగం కూడా బావుంటుంది‘ అన్నాడు తానీషా.

‘మరా విషయం చెప్పావా?‘ అడిగాడు బాలరాజు.

‘నా సంగతి చెబుతానుగానీ, నువ్వు రేఖని పలకరించావా?‘ అనడిగాడు తానీషా.

‘చూస్తున్నా. చదువుముందా, ప్రేమముందా?‘ అని ఆలోచిస్తున్నా.

‘కనీసం మాటా మాటా కలపకుండానే ప్రేమ అంటే ఎలా?‘

‘అదీ నిజమే. ముందు నీ సంగతి చెప్పు‘

‘నీకు చెప్పలేదుగానీ నా కథ అప్పుడే యింటర్వెల్ దాటిపోయింది.‘

‘వార్నీ! చాలా ఫాస్టు నువ్వు. చెప్పు చెప్పు‘ అడిగాడు బాలరాజు.

తానీషా ప్రారంభించాడు. 'తొలిసారి నేను ఫిజియాలజీ ప్రాక్టికల్స్‌లో పడిపోయాను.'

'ఎందుకు పడిపోయావు ఎలా పడిపోయావు. ఎవరు నిన్ను లేవదీశారు?' బాలరాజు అడిగాడు.

'పడిపోవడం అంటే హసీనా బేగం అందానికి పడిపోయాను. ప్రాక్టికల్స్‌లో ఆమె వెతుక్కుంటుంటే ఆమెకు రింగర్ సొల్యూషన్ అందించాను. నా రియోస్టాట్ త్యాగం చేశాను. అంతే ఆమె తన చూపులతో నన్ను కట్టిపడేసింది.'

'వెరీ యింటరెస్టింగ్. నడు. అలా నడుస్తూ మాట్లాడుకుందాం' అన్నాడు బాలరాజు.

ఇద్దరూ క్లినికల్ క్యాంటీన్ వదిలి, హాస్పిటల్ బైటికి వచ్చి అజంతా హోటల్ కిళ్లీ కొట్టు దగ్గరికి నడిచారు. అక్కడ హిస్టరీ శర్మగారు వుప్పుచెక్కా, యాలకు పండు కిళ్లీ కట్టిమ్మని కిళ్లీ కొట్టు అప్పలరాజుని అడుగుతున్నారు. అక్కడ బల్లమీద కూర్చున్న పాహియాన్ లేచి 'రండిసార్' అంటూ బాలరాజునీ తానీషాను ఆహ్వానించాడు శర్మగారు కిళ్లీ అందుకుని నోట్లో బిగించి 'వచ్చారా, కమాన్ కమాన్' అంటూ బెంచీ మీద కూర్చున్నాడు. 'తర్వాత కంటిన్యూ చేస్తాను' అన్నాడు తానీషా, బాలరాజుతో.

'ఏం ఫర్వాలేదు. వీళ్లు మనకి బాగా క్లోజేకదా. అలా బీచ్‌కి నడిచి మాట్లాడుకుందాం' అన్నాడు బాలరాజు.

'ఏం ఫర్వాలేదు తానీషా. చెప్పు అదేవిటో మేమూ వింటాం' అంటూ శర్మగారు కదిలారు. పాహియాన్ కూడా కలిశాడు. నలుగురు కోస్టల్ బ్యాటరీవైపు నడిచి బీచ్‌కి చేరారు. యింకా సాయంత్రం అవలేదు. బీచ్‌లో జనం పెద్దగా లేరు. ఎండతగ్గి వాతావరణం బాగా చల్లబడింది. సముద్రం కెరటాలతో వూగుతూ, ఆరేసుకున్న నీలం చీరె గాలికి కదుల్తున్నట్టుంది.

'ఉం - కంటిన్యూ' అన్నాడూ బాలరాజు.

'అసలేవిటి కంటిన్యూ' అడిగారు హిస్టరీ శర్మగారు.

'మనవాడి ప్రేమకథ' అన్నాడు బాలరాజు.

'నేనూ వింటాను ప్రేమకథ' అన్నాడు పాహియాన్.

'హిస్టరీలో ప్రేమ కథల్ని మించిన కథల్లేవు' అన్నారు శర్మగారు.

'చెప్పు - ఆ తర్వాత హసీనా బేగం ఏవంది?' అడిగాడు బాలరాజు.

'ప్రాక్టికల్స్ టేబుల్ మీద తట్టలోంచి జంప్ చేసిన రెండు కప్పలు దగ్గరగా చేరి బెక బెకలాడుకుంటున్నాయి. వాటిని చూస్తూ హసీనా 'మీకు అల్లా యిష్టమేనా' అనడిగింది. నాకు 'యెల్లా అయినా యిష్టమే అన్నాను. అదికాదు. దేవుడు

'అల్లా' అంది. నేను మళ్లీ అన్నాను. నాకు అల్లా, యేసు, సాయిబాబా, శ్రీ వెంకటేశ్వరుడు అందరూ యిష్టమే. అయినా మీ యిష్టమే నా యిష్టం - అని.

అలా మా పరిచయం లేడీస్ హాస్టల్ దగ్గరున్న శ్రీ సత్యన్నారాయణ స్వామి గుడిమెట్లమీదికీ హార్బర్ వేపున్న మసీదు చెట్ల చాటుకీ అల్లుకుపోతూ పెరిగింది.

'మరింకేం. అంతా బావుందికదా' అన్నాడు పాహియాన్.

'శుభస్య శీఘ్రం' అన్నారు శర్మగారు.

'కానీ - యింకో సంగతి. ఏం చెప్పను? ఎలా చెప్పనూ?'

'చెప్పవోయ్. సణక్క' అన్నాడు బాలరాజు.

'నా ప్రతిరూపం హసీనా బేగంలో పెరుగుతోందేమో అని అనుమానంగా వుంది.'

'ఈ వయసులో కుర్రవాళ్ల ప్రతిరూపాలు యెందరో ఆడపిల్లల్లో పెరుగుతూనే వుంటాయి బాబూ' అన్నారు శర్మగారు.

'ఏవిటి - నిజమే - నిజంగా నిజవేఁ?

' అడిగాడు బాలరాజు.

'నిజమా - అంటే యింకా తేలలేదు' అన్నాడు తానీషా.

'ఏడిసినట్టేవుంది. అంతా నీ భ్రమ అన్నమాట' అన్నాడు బాలరాజు.

'కానీ వొకటి మాత్రం భ్రమకాదు' తానీషా.

'ఏవిటది?' బాలరాజు.

'ఆమె నన్ను ముస్లిం అనుకుంటోంది' తానీషా

'అవును. తవరు తానీషా కదా' అన్నాడు పాహియాన్.

'మరి నువ్వు చెప్పలేదా?' అడిగాడు బాలరాజు.

'చెబితే దూరం అయిపోతుందేమోనని భయం' అన్నాడు తానీషా.

'ప్రేమకు కులమత భేదాలు, సంపన్నులు, పేదలు యిలాంటి తేడాలేవీ తెలియవు. ఇప్పుడు నిజందాచి తరువాత యిబ్బంది పడేకంటే, ముందుగానే విషయం చెప్పెయ్యి. నీ నిజాయితీకి ఆమె యింకా దగ్గరవుతుంది' అని సలహా యిచ్చారు హిస్టరీ శర్మగారు.

'అవును - గురువుగారు చెప్పింది అక్షరాలా నిజం' అని బాలరాజు, పాహియాన్ సమర్థించారు.

'సరే చెప్పేస్తాను - కానీ వొక ప్రాబ్లమ్' సందేహించాడు తానీషా.

'ఏవిటది?' అడిగాడు బాలరాజు.

'హసీనా బేగం అన్నయ్య. పేరు జలాలుద్దీన్. చెంగల్రావు పేటలో కసాయి వ్యాపారం' తానీషా

'ఆ విషయం అమ్మాయి చూసుకుంటుంది లెండి' పాహియాన్.

'కాస్త ఆలోచించాల్సిన విషయమే' అన్నాడు బాలరాజు.

'**ఆలోచనదేవుంది,** వానకోసం యెదురుచూస్తున్నప్పుడు కాస్త రొచ్చు తొక్కాల్సివస్తే తొక్కాల్సి రావచ్చు.' అన్నారు శర్మగారు.

'రొచ్చు తొక్కితే కాళ్లు కడుక్కోవచ్చు. కానీ జలాలుద్దీన్‌ని కెలికితే తల యెక్కడ పడిపోతుందో వెతుక్కోడానికి తల వుండదు' అన్నాడు బాలరాజు.

'మాస్టారు చెప్పిందే కరెక్టు అనిపిస్తోంది. అంతా హసీనాకి చెప్పేస్తాను. తనకి ముందుగా కాస్త కోపం వచ్చినా, నన్ను కాదనదు. తనే యేదో వొకదారి వెతుకుతుంది.' అన్నాడు తానీషా.

'అవును తానీషా. అదే బెస్టు' అన్నారు హిస్టరీ శర్మగారు.

బీచ్‌లో క్రమంగా జనం పెరుగుతున్నారు. యిసుక తరుగుతోంది. కెరటాలు నురగలు చిమ్ముతున్నాయి.

'రండి. అందరం మా బాచిలర్స్ డెన్‌కి వెళ్దాం. నల్లతంబి వంట చేసుంటాడు. అంతా అక్కడే భోంచేద్దాం' అని బాలరాజు అన్నాడు.

హవామహల్ దగ్గరకొచ్చింది.

'ఈ హవామహల్ వొకప్పుడు జైపూర్ మహారాజా వారు తమ వేసవి విడిదిగా పంతొమ్మిదివందల పదిహేడు, యిరవైమూడు సంవత్సరాల ప్రాంతంలో కట్టించుకున్నారు. 'హిస్టరీ శర్మగారు విశాఖ చరిత్ర పుటలు తిరగేసారు.

'ఇప్పుడు హెల్త్ విజిటర్స్‌కీ, నర్సులకీ హాస్టల్‌గా వాడుతున్నారు' అన్నాడు పాహియాన్.

బాచిలర్స్ డెన్‌లోకి అడుగెడుతూ, 'ఇదా మీ నివాసం. బాగుందయ్యా' అన్నారు శర్మగారు.

బాలరాజు, నల్లతంబిని పిలిచి అందరికీ భోజనాలు రెడీచెయ్యమని, యీలోగా కాఫీలు అందించమనీ చెప్పాడు.

అంతా ముఖాలు కడుక్కుని, బాల్కనీలోకి చేరారు. నల్లతంబి వేడివేడి కాఫీలతోబాటు అందరికీ పకోడీలు కూడా పెట్టాడు.

కాస్సేపటికి మురళి, శశి, విజయ్ కూడా వచ్చి జాయినయ్యారు. తానీషా ముందుగా యిచ్చిన సూచనకు మేరగా అతని ప్రేమకథను అందరిముందూ చర్చించలేదు. విజయ్, మహీకి తోడుగా తనుకూడా హాస్టల్‌కి మారిపోతున్నట్టు చెప్పాడు. వచ్చే ఆదివారం పాహియాన్ అందరికీ తన టేకవే తీసుకొస్తానని చెప్పాడు.

దేశంలో రోగులు, రోగ్స్ పెరుగుతూనే వున్నారు. రోగాలు, భోగాలు కూడా పెరుగుతూనే వున్నాయి. కె.జి.హెచ్ యెండలేనప్పుడు కూడా వేడిగా వుంటోంది. రోగుల టెంపరేచర్ బాగా పెరిగి దగ్గులతో, తుమ్ములతో తన వునికిని వూరంతా చెబుతోంది.

బాలరాజు క్లినికల్ రౌండ్స్‌లో మంచాల చుట్టూ తిరుగుతూ వైద్యశాస్త్రం నేర్చుకుంటున్నాడు. రేఖ అందాలకు మరుగుతలా మన్మథాస్త్రాలకు వోర్చుకోవడం తెలియక మథనపడుతున్నాడు. ప్రొఫెసర్లు రోగాలపేర్లు అడుగుతున్నారు. రోగులు వేరువేరు నర్సుల పేర్లు అడుగుతున్నారు. రోగోభిన్న రుచిః

'బాలా! బాలా!' అని సన్నగా పిలుపు వినిపించింది బాలరాజుకి.

'పిలిచారా?' అని రేఖను అడిగాడు బాలరాజు.

'నేనెందుకు పిలుస్తాను? అదుగో ఆ నాలుగో బెడ్ మీది పేషెంట్ తనకి వొంట్లో ఏమీ బాలా బాలా అని మూలుగుతోంది.

'అలాగా. మీరేమో అనుకున్నాను. బాలాకి బదులు రాజా అనో బాలరాజా అనో పిలవొచ్చు కదా అని కూడా అనుకున్నాను.'

'అనుకుంటారు. అనుకుంటారు. మిమ్మల్ని బాలా అని గోలా అని, బాలరాజనీ గోల రాజనీ అసలు మిమ్మల్ని నేనెందుకు పిలుస్తాను -' రుసరుసా చూసింది రేఖ.

'ఎందుకేనే పిలవండి - యెలాగైనా పిలవండి. నేను కూడా మిమ్మల్ని రేఖా అని పిలుస్తాను.'

'నా పేరు రేఖ. రేఖా అని పిలవకపోతే తోకా అని పిలుస్తారా? అయినా నేనేం మిమ్మల్ని పిలవలేదు. ముందా పేషెంట్‌ని చూడండి. తనకి ఒంట్లో ఏమీ బాలా బాలా అని బాధపడుతోంది.'

'మీరు కూడా రండి. ఇద్దరం కలిసి చూద్దాం.'

'సరే నడవండి' రేఖ బాలరాజు నీరసంగా మూలుగుతున్న పేషెంట్ దగ్గరికి నడిచారు. అప్పుడే యిద్దరు నర్సులు వచ్చి ఆ పేషెంట్ని, గాస్ట్రోస్కోపీకి తీసుకు వెళ్లాలంటూ స్ట్రెచర్ మీదకి మార్చి తోసుకు వెళ్లారు.

'రండి. క్యాంటీన్కి వెళ్లి కాఫీ తాగుదాం' అన్నాడు బాలరాజు.

'మీరు వెళ్లండి. నేను లైబ్రరీకి వెళ్తున్నాను' అని రేఖ వార్డునుంచి బైటికి కదిలింది.

ఈ పొగరు పిల్లని నేను ప్రేమిస్తున్నానా లేక ప్రేమించాలని అనుకుంటున్నానా అనుకుంటూ బాలరాజు క్యాంటీన్ వైపు కదిలాడు.

రేఖ బావుంటుంది. వాడిగా చూస్తూ విసురుగా మాట్లాడుతూవుంటే బలే వేడిగా వుంటోంది బాలరాజుకి. ప్రేమలో పడిపోయినట్టే అనిపిస్తోంది. ఇలా పడిపోతూవుంటే చదువు చెట్టెక్కేస్తుందేమోనని భయంకూడా పుట్టుకొస్తోంది తనకు.

క్యాంటీన్లో కాఫీ తాగుతుంటే ఏవో పగటికలలు. తను రేఖను గుర్రం మీద కూర్చోబెట్టుకున్నాట్ట. గుర్రం బీచ్ రోడ్లో పరుగెడుతోందిట. రేఖ వొళ్లు తన వొంటికి మెత్తగా తగుల్తూ మత్తెక్కిస్తోందిట. ఇంతలో గుర్రబ్బండివాడు పరిగెత్తుకుంటూ వచ్చి 'బాబూ! నాకు బేరం తగిలింది. మీరిద్దరూ దిగి నా గుర్రాన్ని నాకిచ్చెయ్యండి బాబూ! బండిక్కట్టి కిరాయికి తిప్పుకోవాలి' అని యిద్దర్నీ దింపి తన గుర్రాన్ని తను తోలుకుపోయాట్ట. తరువాత రేఖ, తనూ సముద్రం దగ్గరగా వెళ్లి యిసుకలో పరిగెత్తారుట. కాఫీ తాగడం పూర్తయ్యింది. పగటికల కరిగిపోయింది. బాలరాజు హాస్పిటల్ గేటు బైటికొచ్చి, అజంతా హోటల్లో లైట్ లంచ్ చేసి మధ్యాహ్నం క్లాసులకి హాజరయ్యాడు.

సాయంత్రం కాలేజ్ అయాక బాలరాజు మళ్లీ క్లినికల్ క్యాంటీన్కి వచ్చి క్లాస్మేట్స్తో కాఫీ తాగుతూ చాలాసేపు కబుర్ల కాలక్షేపం చేశాడు. బాగా లేటవుతోందంటూ అంతా లేచారు. బాలరాజు బస్ స్టాప్ దగ్గరకొచ్చి నిలబడ్డాడు. అక్కడ మళ్లీ అతనికి రేఖ కనబడింది.

'ఏవిటి? మీరింకా యింటికి వెళ్లేదా?' అడిగాడు తను.

'మీరూ వెళ్లేదుగా' అంది రేఖ.

'అవును. లేటయింది. బస్ కోసం వెయిటింగ్'

రేఖ మాట్లాడలేదు.

'మీరుకూడా బస్కేనా?' అడిగాడు బాలరాజు.

'కాదు. కారు కోసం.'

'ఓ మీకు కారు యిక్కడికి వస్తుందా?'

'యెస్.'

'బాగా లేటయి, చీకటి పడేలా వుంది.'

'అవును.'

'ఇంకా బస్ రావడంలేదు.'

ఇంతలో కారు వొకటివచ్చి బస్‌స్టాప్ దగ్గర ఆగింది. రేఖ కోసం వచ్చిన కారు. ఆమె కారెక్కబోతోంది.

'మీరేవనుకోకపోతే నాక్కొంచెం లిఫ్ట్ యిస్తారా. నా బస్ యెప్పుడొస్తుందో యేమో?'

రేఖ ఆగి క్షణం ఆలోచించింది. 'సరే, ఎక్కండి - ఎక్కడ దిగాలి?' అంది.

'థాంక్సండి. దగ్గర్లోనే. బీచ్‌రోడ్‌లో హవామహల్ దగ్గర' అంటూ బాలరాజు కారెక్కాడు.

కారు కదిలింది. బాలరాజు యిందాక తన పగటి కలలో గుర్రం యెక్కినట్టు ఫీలయ్యాడు. కారు కోస్టల్ బ్యాటరీ డౌన్ దిగి యెడం వేపు బీచ్ రోడ్డులోకి తిరిగింది. డ్రైవరు తల తిప్పకుండా రోడ్డు వేపే చూస్తూ డ్రైవ్ చేస్తున్నాడు. సాయంత్రం వెలుగు తగ్గి చీకటి పడబోతూవుంది. బీచ్ రోడ్డులో వెలిగే దీప స్థంభాలు హారతులు పట్టుకుని నిలబడ్డ చిక్కిపోయిన సాలభంజికల్లా వున్నాయి.

కొంచెం దూరం తర్వాత కారు పరుగులో తేడా వచ్చింది. కాస్త బాలన్సు తప్పినట్టు అటూ యిటూ కుదుపుకుంటోంది. డ్రైవరు స్లో చేశాడు.

'ఏవైంది?' అడిగింది రేఖ.

'ఆగి చూస్తానండి' అని డ్రైవరు కారాపి దిగి చక్రాల్ని చూశాడు.

ముందుకొచ్చి 'ఫ్రంట్‌లో ఓ టైరు ఫ్లాటండి' అన్నాడు.

'టైరు మార్చాలా?' అడిగింది రేఖ.

'ఆయ్. మార్చాలండి. పంక్చరయినట్టుంది. కానీ స్పేరు లేదండి.'

'స్పేరెందుకు లేదు?' చిరాగ్గా అడిగింది రేఖ. స్పేరోసారి వాడే సావండి. యింకోటి రెడీసేసుకోలేదండి.'

'ఏం చేద్దావిప్పుడు' నిస్సహాయంగా అంది రేఖ.

'ఇంటికి ఫోన్ చేసి యింకో డయివర్ని కారు తోలుకురమ్మంటానండి. తవరు కూకోండి. అలా యెనక్కెల్లి యెక్కడేనా ఫోనట్టుకుంటానండి'

'ఫోన్‌కి చాలా దూరం వెళ్లాలి. మొబైల్ ఫోన్లు యీ సిక్స్‌టీస్‌లో వాడటానికి మనం ఏలియన్స్ కాదు. దిగండి రేఖా! అలా నడుద్దాం' అన్నాడు బాలరాజు.

'ఏవిటి మీ వుద్దేశం' కోపంగా అంది రేఖ కారు దిగుతూ.

'రండి. అలా నాలుగడుగులేస్తే బస్‌స్టాప్ వస్తుంది. ఇంకా బస్సులు తిరుగుతున్నాయి. బస్సులు లేకపోయినా అక్కడ రిక్షాలుంటాయి' అన్నాడు బాలరాజు.

'భగవాన్' అంది రేఖ.

'డోంట్ వర్రీ, మీ యిల్లెక్కడ? అడిగాడు బాలరాజు.

రేఖ తటపటాయించింది.

'ఫరవాలేదు చెప్పండి.' అన్నాడు బాలరాజు.

'మధురానగర్'

'సరే. ముందు ఏదో వొక వాహనం పట్టుకుందాం రండి' అని బాలరాజు 'నువ్వెళ్లి ఆ టైరు సంగతి చూడు' అని డ్రైవరుకి చెప్పాడు.

బాలరాజు, రేఖ నడక మొదలెట్టారు. 'యేడి యేడి యేరుసెనక్కాయలు సర్. తీసుకోండి' అంటూ వేరుసెనగలమ్మే కుర్రాడు యెదురొచ్చి అడిగాడు.

'ఏవక్కర్లేదు' అంది రేఖ.

'పర్లేదు. తీసుకుందాం. బావుంటాయ్. నడుస్తూంటే అలసట తెలియదు' అని బాలరాజు రెండు పొట్లాలు తీసుకుని, రేఖకి వొకటి అందించాడు. రేఖ ఏవీ అనలేదు. చురచురా చూస్తూ పొట్లం అందుకుంది.

**బాలరాజుకి బాగా** మాట్లాడాలనిపిస్తోంది. కానీ యేం మాట్లాడితే రేఖ యిష్టంగా వుంటుందో తెలియడంలేదు. సరే, యేదో వొకటి మాట్లాడితే సరిపోలా అనుకున్నాడు.

'యిలా నడవడం బాగుంది కద!' అన్నాడు.

'ఎలా నడవడం?' రేఖ కంటి కొసల్లోంచి చూసింది.

'అదే - యిప్పుడిలా సముద్రం వొడ్డున నడవడం'

'బావుంటుంది. కాళ్లు నొప్పులు పుట్టేదాకా బాగానే వుంటుంది.'

'ఎప్పుడూ యిలా నడుస్తూ వుండిపోంలెండి'

'అవును. ఏ పిచ్చి కుక్కేనా తరుముకొస్తే పరిగెత్తాల్సి వుంటుంది.'

'అదికాదు. నా వుద్దేశం యింకాస్త దూరం నడిస్తే ఏ ఆటో అయినా దొరకొచ్చని.'

'లెటజ్ సీ'

ఇంకా దగ్గరవకపోయినా యిద్దరూ దగ్గర దగ్గరగానే నడుస్తున్నారు. ఇంతలో కొద్దిదూరంలో యిద్దరు అగంతకులు యెదురొస్తూ కనిపించారు. తొందరగా దగ్గిర్లోకి వస్తున్నారు. వాళ్లలో వొకడు పొడుగు, మరొకడు పొట్టి. పొట్టివాడు లావుగా ధృఢంగా వున్నాడు. బట్టతల, గండుమీసాలు, గళ్ల లుంగీతో విలన్ అసిస్టెంట్‌లా వున్నాడు. రెండోవాడు పొడుగ్గా చింపిరి జుట్టుతో, ఎర్రబారిన కళ్లతో ఎవరో పారేసిన బట్టలు వేసుకున్నట్టు, విలన్ రెండో అసిస్టెంట్‌లా వున్నాడు.

వాళ్లు దగ్గరకి వస్తున్నకొద్దీ బాలరాజుకి కంగారు పెరగసాగింది. రకరకాల సన్నివేశాలు వూహల్లో మెదలసాగాయి. ఆ యిద్దరూ తనను రెండు మూడు గుద్దులు గుద్ది, రేఖను లాక్కుపోవడం, లేక కత్తితో తనను పొడవరాని చోట పొడిచి రేఖను యెత్తుకు పోవడం వగైరా - తల్చుకుంటే వొళ్లంతా వణుకుతోంది. తను జిమ్‌కి వెళ్తున్నాడు గానీ వీళ్లిద్దరిలో వొక్కణ్ని అయినా కొట్టి గెలవనన్న నమ్మకం కలగట్లేదు. సినిమాల్లోలాగా యిద్దర్నీ చితక్కొట్టి రేఖను రక్షిస్తే ఆమెకు తనమీద ప్రేమ చిగురించి, పువ్వులూ, కాయలూ కాస్తుంది. అప్పుడు తను దెబ్బలు తిని మూలుగుతున్న యీ రెండు రౌడీలతో రకరకాల డైలాగ్సు చెప్పొచ్చు. సింహాన్ని జూలో చూడండి. కానీ అడవిలో దానితో గోళీలాడడానికి ట్రై చెయ్యకండి. ఖడ్గ మృగం ముందు కత్తిసాము చెయ్యకండి. నాగేంద్రుడి ముందు యీలపాట పాడకండి. యిలా యెన్నో. రేఖను మురిపించడానికి ఫైటు తక్కువ, డైలాగులు యెక్కువ అయి తను రెచ్చిపోడం కచ్చితం. కానీ యీ వెధవల్ని కొట్టి పడగొట్టేదెలా? నిజం నిడదవోలంత దూరమై టైముకి అందేలాలేదు. వీళ్లు రేఖ ముందు తనను చిత్తుగా చితక్కొడితే యెంత అవమానం? రేఖను లాక్కెళ్లిపోతే యెంత అవమాన ప్రమాదం? ఇలా వొక్కసారిగా యెన్నో భయపుటాలోచనలు బాలరాజుని కందిరీగల్లా కప్పేసాయి.

రౌడీల్లా కనిపిస్తున్న మొరటు శాల్తీలిద్దరూ దగ్గరకొచ్చేశారు. రేఖలో యేం తేడా కనిపించడంలేదు. తనలో తేడా కనిపించకుండా వుండడానికి యెంతో ప్రయత్నిస్తున్నాడు. మరో పదిక్షణాల్లో వీళ్లచేత రేఖ కన్నులముందు తన్నులు తినడం తప్పేలాలేదు. అవమానకెరటం వువ్వెత్తున లేచి నిరాశాంబుధిలోకి లాక్కెళ్లిపోతే తలెత్తి వూపిరి పీల్చుకునేదెలా? ఇక లాభంలేదు. ఏదో వొకటి జరగకమానదు. తెగించాలి. ప్రేమకావాలంటే తెగింపు కావాలని చాలామంది రచయితలు రాశారు. ఫలితం భగవంతుడి కరుణకి అప్పజెప్పి ధైర్యంగా వీళ్ల నెదుర్కొంటాను. ఏదో వొకటి జరుగుతుంది. కనీసం నా

ప్రయత్నమేనా అర్ధం చేసుకోవచ్చు రేఖ - అనుకుంటూ బాలరాజు జారిపోయే ధైర్యాన్ని గుండెల్లోకి లాక్కుని పోరాటానికి రెడీ అయ్యాడు. రేఖకి ధైర్యం చెబుదామని, 'మీరేం భయపడకండి' అన్నాడు. 'వేరుసెనగపప్పు తినడానికి భయమెందుకు?' అనడిగింది రేఖ.

'వేరు సెనగ పప్పుకాదు ఎదురుగా చూడండి' అని భయంకరంగా కనిపిస్తున్న యిద్దరు శాల్తీలను చూపించాడు. 'వీళ్లా' అంది రేఖ నిర్లిప్తంగా. ఇద్దరు శాల్తీలు దగ్గరకొచ్చి, బాలరాజువేపు అనుమానంగా చుసి, 'దణ్ణాలమ్మా' అంటూ తమ తలలు వొంచుకుని క్లుప్తంగా రేఖకు నమస్కరించి ముందుకి సాగిపోయారు. బాలరాజుకి నోటమాటరాలేదు. స్పీడుగా వస్తున్న లారీ మీదకంటా వచ్చి తృటిలో పక్కకి తప్పుకుని వెళ్లి పోయినట్టుగా వుందతనికి. రేఖ వేపు చూశాడు. బాలరాజు ఆందోళన అంతా అర్ధం చేసుకున్నట్టు రేఖ వొక నవ్వుని విసిరింది. 'వాళ్లు మా యింటి గార్డెన్‌లో పనివాళ్లు. ఇలా యెందుకో వచ్చివుంటారు' అని చెప్పింది. గండం తప్పినందుకు దేవుడికి దండం పెట్టుకున్నా బాలరాజుకి తేరుకోవడానికి కొంత సమయం పట్టింది.

ఇద్దరూ హవామహల్ దాటారు. దగ్గర్లో వున్న బాచిలర్స్ డెన్‌వైపు చూపిస్తూ, 'నేనుండేది అక్కడే రండి. కాఫీ తీసుకువెడుదురుగాని' అన్నాడు బాలరాజు.

'థాంక్స్. ఇప్పటికే బాగా లేటయింది. మరోసారి చూద్దాంలెండి' అంది రేఖ.

'అయితే రామక్రిష్ణా మిషన్ దాకా మీతో వస్తాను అసలే చీకటి ముదిరేలా వుంది. అక్కడ బస్సో, ఆటోగాని దొరుకుతాయి' అన్నాడు.

'ఓ.కె' అంది రేఖ.

రామక్రిష్ణా మిషన్ దగ్గర రేఖను పదో నెంబరు బస్ 'కలెక్ట్రాఫీసు జంక్షన్‌లో దిగి మీరు పదమూడో నెంబర్ పట్టుకోవాలి. అక్కడిదాకా రమ్మంటారా' అడిగాడు బాలరాజు.

'అక్కర్లేదు. నేను వెళ్లగలను. మీరుండండి' అంది రేఖ.

'దారిలో నేను జిల్లా పరిషత్ స్టాపులో దిగిపోతాను. నాకు దగ్గర.' అని బాలరాజు కూడా యెక్కాడు.

తన స్టాపులో దిగిపోతూ 'వస్తానండి. మళ్లీ కలుస్తాంగా. అన్నట్టు ఏవనుకోకండి. మీదగ్గర బస్ ఫేర్‌కి చిల్లరుందా? మీ బ్యాగ్ కారులో'

'మర్చిపోలేదు. నా దగ్గరే వుంది ' అని తన బ్యాగ్ చూపిస్తూ 'థాంక్స్' అంది.

బాలరాజు రేఖకి వీడ్కోలు చెప్పి బరువుగా అడుగులేస్తూ బాచిలర్స్ డెన్ వేపు కదిలాడు.

అప్పటికే పాహియాన్ చైనా వంటకాలు తీసుకొచ్చి బాల్కనీలో టేబుల్ మీద వొక క్రమంలో యేర్పాటు చేస్తున్నాడు. పిట్టగోడ దగ్గర తానీషా, హిస్టరీ శర్మగారితో యేదో మాట్లాడుతున్నాడు.

బాలరాజు రాగానే నల్లతంబి చెప్పాడు - 'ఈ పూట నా వొంటకి రెస్టండి. అంతా రెడీ. మీకోసవే సూత్తన్నా రండి '

'మురళి, శశి రావాలిగా' అన్నాడు బాలరాజు.

'ఆరు సింవాసెలం సుట్టాల పెల్లి కెల్లారండి. ఇయాల రేపు అక్కడే వుండి యెల్లుండి యెలిపొత్తార్ట' అని చెప్పాడు నల్లతంబి.

చీకటి ముదిరినా వెన్నెల కాంతిలో ఆకాశం పరదా వేసినట్టుంది. దగ్గరలో సముద్రపు కెరటాలు రెస్టులేకుండా గుంజీలు తీస్తున్నట్టు లేస్తూ కూచుంటున్నాయి. దూరంగా డాల్ఫిన్స్‌నోస్ లైట్ హౌస్ బీచ్‌లో వెలుగుపిల్ల ధరించిన కిరీటంలా మెరుస్తోంది.

అంతా టేబుల్ దగ్గర చేరారు. పాహియాన్ తను తెచ్చిన చైనా స్పెషల్స్ ఆప్యాయంగా వడ్డిస్తున్నాడు.

'చాలా తెచ్చావయ్యా పాహియానూ! ఘుమఘుమలు గొప్పగా వున్నాయి' అన్నారు శర్మగారు.

'అందుకే పందిమెట్ట పాహియాన్ యిప్పుడు వైజాగంతా పాపులర్' అన్నాడు తానీషా, బాలరాజు రేఖ ఆలోచనల్లోంచి నెమ్మదిగా బైటికొస్తున్నాడు.

'ఇందాక యేదో కాస్త చెబుతూ ఆగి పోయావు. ఇప్పుడు మళ్లా అంతా చెప్పు. మంచి ఆలోచన చేసి నీ సంగతి సవ్యం చేద్దాం' అన్నారు శర్మగారు.

'నేనింకా హసీనా బేగంకి అసలు విషయం చెప్పలేదు' అన్నాడు తానీషా.

'అంటే.. నువ్వు ముస్లిమ్ కాదు హిందూవనా?' అడిగాడు బాలరాజు.

'ఏవయ్యా! పాహియానూ - వంటకాలు మహత్తరంగా వున్నాయి. కొంపదీసి వీటిలో కప్పల్నీ, పాముల్ని కోసి కలపలేదుకదా' అన్నారు శర్మగారు.

'బలేవారు మేష్టారు - ఇవన్నీ మీకందరకూ ప్రత్యేకంగా చేసి తెచ్చాను. అలాంటివేం అస్సలుండవండి' పాహియాన్ వివరించాడు.

'ఇంతవరకూ వచ్చాక యిప్పుడు సడెన్‌గా అసలు విషయం చెబితే నా కథ అడ్డం తిరుగుతుందేమోనని భయంగా వుంది.'

'పాయింటే - అసలే వాళ్లన్న జలాలుద్దీన్ కసాయివాడంటున్నావ్' - అన్నాడు బాలరాజు.

'మీరేవైనా ఢోకాలేని సలహా యివ్వండి మాస్టారూ' అని హిస్టరీ శర్మగారితో కూడా అన్నాడు.

'యిస్తాను. యిస్తాను. కొంచెం ఆ మంచినీళ్లందుకో పాహియాన్ - నువ్వు కూడా తినడం మొదలెట్టు' అని శర్మగారు నీళ్లు తాగి గొంతు సవరించుకుని మొదలెట్టారు. 'నిజమే ఇది కాస్త ఆలోచించాల్సిన విషయమే. మన తానీషా ముందు హసీనాతో మాట్లాడితే ఆమె కొంచెం షాకయ్యే అవకాశం వుంది. అంత మాత్రాన ప్రేమలేదని పారిపోదు. స్త్రీ ప్రేమ యెప్పుడూ నికరమే. ఆ విషయం హిస్టరీయే నిర్ధారిస్తోంది."

శర్మగారు మళ్లీ చరిత్రలోకి దీర్ఘప్రయాణం చేస్తారేమోనని పాహియాన్ అన్నాడు -' మరయితే యిప్పుడు తానీషా ఏం చేస్తే బెటరంటారు' అని.

'బాగా ఆలోచిస్తే నాకో మార్గం కనిపిస్తోంది -' అన్నారు శర్మగారు.

'ఏవిటది?' అడిగాడు బాలరాజు.

తానీషా ఆత్రుతగా చూస్తున్నాడు.

శర్మగారు విశదీకరించారు -' నిజాన్ని దాచడం న్యాయంకాదు. తర్వాత నిజం బయటపడక మానదు. అప్పుడు క్షేమమూ కాదు. ఇప్పుడు నిజం చెబితే హసీనా మనసు చాలా గాయపడుతుంది. జులాలుద్దీన్, తానీషాను బాగా గాయపరుస్తాడు. అందుచేత -' ఆగారు.

'అందుచేత?' తానీషా.

'మీ నాన్నగారి పేరేవిటి?' అడిగారు శర్మగారు.

'రామయ్యగారు'

'రామయ్యగారు. ఇప్పుడు వినండి. రామయ్యగారికి రహీం అనే ప్రాణస్నేహితుడుండేవాడు. తల్లిలేని పిల్లవాడైన వొక్కగానొక్క కొడుకు తానీషాను, రహీం యెంతో గారాబంగా పెంచాడు. కొన్నాళ్లకు రహీం అనారోగ్యంవల్ల తనువు చాలించాడు. తను పోయేముందు తన కొడుకు తనీషాను ప్రాణమిత్రుడైన రామయ్యగారి చేతిలో పెట్టి తర్వాత వెళ్లిపోయాడు.' శర్మగారు ఆగారు.

'తానీషా ముస్లిం అయితే గొడవేలేదు' అన్నాడు పాహియాన్. తానీషా బిక్క మొహం పెట్టాడు.

'అలా బిగిసిపోకు. అల్లా, క్రీస్తు, క్రిష్ణపరమాత్మ అందరూ వొకటే. అచంచలమైన మీ ప్రేమ ముందు అంతా ఏకత్వమే' అన్నారు హిస్టరీ శర్మగారు.

'హసీనాని చూసిందగ్గర్నుంచీ దేవుడిని మరచిపోయాను మేష్టారూ' అన్నాడు తానీషా.

'నీ ప్రేమ దైవ స్వరూపం తానీషా' అన్నాడు బాలరాజు.

'గిన్నెలేవన్నా కడగాలా సార్' అన్నాడు నల్లతంబి కిచెన్‌లోంచి వస్తూ.

**మూడు చావులు,** ఆరు జ్వరాలతో కె.జి.హెచ్‌లో వార్డులన్నీ విలవిల్లాడుతున్నాయి. సర్జికల్ వార్డులో సర్జరీ ప్రొఫెసర్ పదును పాపారావుగారు చుట్టూ స్టూడెంట్స్ పి.జి.లు పోగయ్యారు. పాపారావుగారి కోరమీసాలు పొడుగ్గా, సూదిగా వున్నాయి. అవి గుచ్చుకోకుండా పిల్ల డాక్టర్లు కాస్త దూరంగానే నిలబడ్డారు.

పాపారావుగారు ప్రారంభించారు.

'మనవంతా సర్జన్లు. మనవేం చేస్తాం? ఆపరేషన్లు, మేజర్ ఆపరేషన్లు, మైనర్ ఆపరేషన్లు. మేజర్ ఆపరేషన్లంటే యేవిటి? మైనర్ ఆపరేషన్లంటే ఏవిటి?'

'పిల్లలకి చేస్తే మైనరండి. పెద్దవాళ్లకి చేస్తే మేజరండి' వొక పి.జి స్టూడెంటన్నాడు.

'పేదవాళ్లకి చేస్తే మైనరండి.డబ్బున్న వాళ్లకి చేస్తే మేజరండి' మరో స్టూడెంటు పిల్ల చెప్పింది.

'కాదు. మీ యిద్దరూ తప్పే. మన వొంటిమీద చేస్తే అది మేజర్ ఆపరేషన్. మనం యితరుల వొళ్లు కోస్తే అది మైనర్ ఆపరేషన్. సర్జరీలో యీ మూల సూత్రం మీరంతా బాగా గుర్తుపెట్టుకోండి. అప్పుడే మీరు గొప్ప సర్జన్లు అవుతారు. కడుపు కోసినా, కంతి కోసినా తిరుగుండదు. ఆపరేషన్ సక్సెస్ అయితే అది సర్జను గొప్పతనం. ఫెయిలయితే అది ఎనస్తటిస్టుగాడి తప్పు అర్థమైందా?'

'అర్థమైంది సార్' అని అంతా తలలు పంకించారు.

'మరో విషయం ప్రతికేసుకీ హిస్టరీ ముఖ్యం అని మీరంతా యిప్పటికే చదువుకుని, తెలుసుకుని వుంటారు. అయినా మీ కెరీర్ పొడుగునా, ప్రతీ కుర్ర జూనియర్ నాగన్నగాడూ హిస్టరీ యీజ్ యింపార్టెంట్ అని మీకేదో తెలియని విషయం వాడికే తెలిసినట్టు క్లాసులు పీకుతూ వుంటాడు. అలాంటి గుంట వెధవల్ని దగ్గరకు జేరనివ్వకండి. '- సర్జరీ మేష్టారు కంటిన్యూ చేశారు'

'అసలు మన మెడికల్ ప్రొఫెషన్లో డాక్టర్లందరికీ వొక జబ్బుంది, ప్రతి వెధవా తను మిగతా డాక్టర్లకంటే గొప్ప అనుకుంటాడు. మీరు మాత్రం అలాంటి ఆలోచనల్ని పెంచుకోకండి. మీరు నేర్చుకున్నది, అదర్స్ నేర్చుకున్నదీ అంతా కలిసి పంచుకోండి. తోటి డాక్టర్లను గౌరవించడం నేర్చుకోండి.- కమాన్, లెటజ్ స్టార్ట్ ద రౌండ్స్ అంటూ కదిలారు. ఏసుక్రీస్తు వెనక గొర్రెపిల్లల్లా శిష్య డాక్టర్స్ బృందవంతా కూడా కదిలారు. ఇంతలో తానీషా, బాలరాజు కంగారుగా వచ్చి గుంపులో

కలిశారు. సర్జన్ మేష్టారు వాళ్లని చూశారు. చూసి, 'ఏవోయ్ - సర్జన్లూ లేటయింది. యింతసేపూ చేతులు తోముకుంటున్నారా?' అనడిగారు.

'లేదండి. వూళ్లో అంతా గొడవగా వుంది. బస్సులు తిరగడంలేదండి. నడిచి వచ్చాం' అన్నాడు తానీషా.

'వూళ్లో గొడవా?' అడిగారు సర్జన్.

'మరేనండి స్టీల్ ప్లాంట్ కోసం స్ట్రయికులు మొదలెట్టారు కొట్లన్నీకూడా కట్టేస్తున్నారు' అన్నాడు బాలరాజు.

'అవునండి. కలెక్టరాఫీసు జంక్షన్లో పదో నెంబర్ బస్ స్టాపు దగ్గర వొకాయనెవరో నిరాహారదీక్ష కూడా మొదలెట్టారండి' అని మరో స్టూడెంట్ మాట కలిపాడు.

'అవునండి. మా డాడీ నన్ను కార్లో తీసుకొస్తుంటే కారాపి విశాఖ ఉక్కు 'ఆంధ్రుల హక్కు' అని అరవమన్నారండి' అంది వొక అమ్మాయి సర్జను.

సర్జను పదును పాపారావుగారు ముక్కుమీద వేలేసుకున్నారు. ఆయన వేలు తీసేలోగా సూపరింటెండ్‌గారు వొగరుస్తూ పరిగెత్తుకుంటూ వచ్చారు.

'ఏవిటా కంగారు సూపర్ సూరిగారూ - లుంగీ కట్టుకుంటే యీపాటికి వూడిపోను' అన్నారు సర్జనుగారు.

'కంగారు కాక ఏవిటనుకున్నారు. మీరు అర్జంటుగా థియేటర్లన్నీ ఎమర్జన్సీలకి రెడీ చేసుకోండి. రొటీన్ ఆపరేషన్లన్నీ పోస్ట్‌పోన్ చేసేయండి.'

'ఏవిటి? ఏవైంది?'

'ఏమవడం ఏవిటండీ - వూరంతా గగ్గోలుగా వుంది. జనం పెద్ద పోస్టాఫీసు మీదికి ఎగబడ్డారుట. రిజర్వు పోలీసులు షూటింగ్ చేశారు. చిన్నా చితకా ఫిజికల్‌గా గాయపడ్డారు. గన్ షాట్ వూండ్స్‌తో పడిపోయిన వాళ్లని యిక్కడికి మోసుకొస్తున్నారు. కింద మన స్టూడెంట్స్ అంతా రక్తదానాలు మొదలెట్టారు. మీరు మీ టీమ్స్ ఎమర్జన్సీలకి రెడీ అవండి. నేను అదర్ యూనిట్స్‌ని ఎలర్ట్ చేస్తాను' అంటూ సూపరింటెండ్ సూరిగారు గబగబా నడుచుకుంటూ వెళ్లిపోయారు.

'సరే - రౌండ్స్ తర్వాత. అంతా ఆపరేషన్ థియేటర్స్‌కి నడవండి -' అన్నారు సర్జన్ మేష్టారు.

హాస్పిటలంతా జనం హాహాకారాల్తో గందర గోళాస్పత్రిలా మారింది. కారిడార్స్‌లో కంగారుగా విశాఖ ప్రజలు విషాద వదనాల్తో దీనంగా పరుగులెడుతున్నారు. తుపాకీ దెబ్బలకు మరణించిన వారినీ, రక్తాలు కారుతూ మరణిస్తున్న వారినీ అంబులెన్సుల్లో, కార్లలో, రిక్షాల్లో, యే వాహనం దొరికితే ఆ వాహనంలో మోసుకొస్తున్నారు. మార్చ్యురీలో స్థలం చాలక శవాల మీద శవాలను గుట్టగా పడేస్తున్నారు. బాలరాజు, తానీషా మిగతా మెడికోస్‌తో జాయినయి రక్తదానాలు చేశారు.

ఆపరేషన్ థియేటర్స్ దగ్గర సర్జికల్ టీమ్స్ అలా వేచి చూస్తూనే వున్నాయి. ఎమర్జన్సీ సర్జరీకి యెవరూ రాలేదు. గుండు దెబ్బలు తిన్న వారంతా చాలామంది దారిలోనే ప్రాణాలు కోల్పోయారు. కొంతమంది కె.జి.హెచ్ ప్రాంగణంలోకి రాగానే ప్రాణాలు వదిలేశారు. అనామకులైన పెద్దలు, పిల్లలు అలా హఠాన్మరణానికి గురవడం విశాఖ తల్లి గుండెల్ని పిండేసింది. వూరంతా వుద్రిక్తత అధికమైంది. బస్సులు తగలబడుతున్నాయి. షాపులు కొల్లగొడుతున్నారు. హాస్పిటలంతా అల్లకల్లోలంగా వుంది. మార్చ్యురీ దగ్గర జనం గుంపులు గుంపులుగా పోగవుతున్నారు. పోయిన వారి బంధువులు మిత్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు.

కలెక్టరాఫీసు జంక్షన్లో కదలడానికి వీల్లేని మనుషుల సందోహం. అజంతా హోటల్ దగ్గర కిళ్లీకొట్టు అప్పలరాజు కొట్టు సగమే తెరిచాడు. అక్కడ ముందు బెంచీ మీద కొందరు, బస్‌స్టాపులో మరికొందరు నిలబడి రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

'సెంటరు వాళ్లు మనకి స్టీలు ప్లాంట్ యిచ్చేదాకా మనకీ యిబ్బందులు తప్పవు'

'ఏవిటో మన ఆస్తులు మనం తగలెట్టుకోడం, మన ప్రాణాలు మనం తీసుకోవడం, మనం బుర్రల్లేని మనుషులం.'

'మనకి బుర్రల్లేకపోవడమేవిటి, వేదాలు, వుపనిషత్తులు లోకానికి అందించిన వాళ్లం. ఈనాటిదా మన సంస్కృతి.'

'సంస్కృతా, పాడా. గతం గోక్కుని విర్ర వీగడం తప్ప, యెక్కడున్నాం మనం. నిన్నకాక మొన్న పుట్టిన దేశాలు ముందుకి పోతున్నాయి. మనం రోజు రోజుకీ దిగజారిపోతున్నాం.'

'అయితే యింకేం చెయ్యాలంటారు?'

'కావల్సిందేవిటో కరెక్టు పద్ధతిలో అడుక్కోవాలి'

'వాళ్లు పట్టించుకోపోవడం వల్లే కదా యీ గొడవంతా'

'అందుకని మన ప్రాణాలు మనం తీసుకుంటామా - మన షాపులు ఆఫీసులు మనం తగలెట్టుకుంటామా, కామన్‌సెన్స్ వున్న వాళ్లు చేసే గొడవేనా యిది?'

'నిజమేలెండి. ఎవడికి వోటు వెయ్యాలో తెలీదు మనకి, యెందుకు వేస్తున్నామో తెలీదు మనకి. ఎందుకు వెయ్యట్లేదో కూడా తెలీదు మనకి. ఆ సెన్సుంటే యీ న్యూసెన్సులేవుండవు.'

'మనలో మనం యిలా యిక్కడా అక్కడా వాక్కోటం తప్ప యిప్పుడేదీ మార్చలేంలెండి.'

- ఇలా సాగుతూనే వున్నాయి రకరకాల సంభాషణలు. అందరిలో కంగారు, భయం అస్తిమితం వుధృతం అవుతున్నాయి. ఏవైనా సరే విశాఖకి స్టీలు ప్లాంటు రావాలన్న ఆకాంక్ష వూళ్లో గొడవల భీబత్సానికి తల్లడిల్లిపోయే సగటు

మనిషి గుండెలో మూల కూర్చుని ముసుగేసుకుంది. రోజు రోజుకీ రాజుకుంటున్న సమ్మెలు, దొమ్మీలు రాష్ట్రమంతా పాకుతున్నాయి. ప్రజలదైనందిన జీవితం అతలాకుతలం అయిపోయింది. అయినా వారికి అలవాటు పడటం అలవాటే. కాలిన యినుము చల్లబడుతున్నట్టు క్రమంగా పరిస్థితులు వొక తీరుకి రాసాగాయి. బస్సులు, రైళ్లు నడుస్తున్నాయి. మనుషులు మాత్రం యింకా పరిగెడుతున్నారు.

తేరుకుంటున్న రోగిలా కె.జి.హెచ్ క్రమంగా రొటీన్‌లో పడుతోంది. బాలరాజు, తానీషా క్లినికల్ యియర్స్ శ్రద్ధగా నేర్చుకుంటూ గడుపుతున్నారు. మురళి తండ్రికి అంతకుముందు పనిచేసే చిన్నవూరు నుంచి హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ అయింది. అంచేత మురళికూడా మిగతా చదువుకి హైదరాబాదుకి మారాడు. శశికూడా తనకీ మార్పుకావాలంటూ హైదరాబాదుకి షిఫ్ట్ అయిపోయాడు. ఇక బాచిలర్స్ డెన్‌లో ప్రేమ పక్షులు బాలరాజు, తానీషా, వంటకోసం నల్లతంబి మిగిలారు. హిస్టరీ శర్మగారు, పాహియాన్ తరచూ కలుస్తున్నారు. తానీషా, హసీనా బేగం కథ దాదాపుగా వొకదారికొచ్చేసింది. బాలరాజు రేఖను తలచుకుంటున్నా తన క్లినికల్ స్టడీస్ మీదే బాగా శ్రద్ధ చూపిస్తున్నాడు. రేఖా అంతే.

హాస్పిటల్ క్లాక్ టవర్‌లో గడియారం తిరగనంత మాత్రాన కాలం ఆగుతుందా - అనతికాలంలోనే వీళ్లు ఫైనల్ యియర్ దాటేసి హౌస్ సర్జన్సీలోకి అడుగులు పెట్టారు.

**కొందరు రోగులు** మూలుగుతున్నారు. కొందరు రోగులు నీలుగుతున్నారు. వార్డులో విద్యుద్దీపాలు చమురు చాలని వొత్తుల్లా వెలుగుతున్నాయి. అవాళ నైట్ డ్యూటీ లేకపోయినా బాలరాజు యింకా డ్యూటీ రూమ్‌లోనే వున్నాడు. స్టాఫ్ నర్స్ మందాకిని వచ్చి, యియేల తవకి' డూటీనేదుగా యింటికెళ్లా డాక్టారూ' అని అడిగింది.

'వెళ్తాను' ఆ కార్నర్ బెడ్‌లో డయాబెటిక్ పేషెంట్‌కి షుగర్ లెవెల్స్ యింకా స్టెబిలైజ్ కాలేదు. యింకో టు అవర్లీ శాంపుల్స్ చూశాక వెళ్తాను' అన్నాడు బాలరాజు.

'ఏటోనండి. ఈ యంగు డాకటర్లెవరూ డూటీలో వున్నా పిలిచినా పలకరు. తవరేమో రేతిరీ లేదు పగలూ లేదు. యవా డివోసను' మళ్లీ అంది మందాకిని.

'అవును సిస్టర్. కష్టపడి పనిచేసి మంచి డాక్టరవ్వాలని మా నాన్నగారి కోరిక. నా కోరికా అంతే.'

'ఏటోనండి. ఏ డాకటరెంత జేసినా యీ పేసెంటోల్లకోలెక్కా - బతికితే బగవంతుడి దయంటారు. లేకపోతే డాకటర్లు తిన్నగా సై లేదంటారు.'

'ఓ కవిగారేవన్నారో తెలుసా సిస్టర్'

'ఏటన్నారేటి?'

''నలిపేసే చేతికి కూడా సౌరభాన్నిస్తుందిట పువ్వు'

'సెబాసో. అందుకే ఆయన్ని కయిగారన్నారు' మందాకిని మెచ్చుకుంది.

మెచ్చుకుని 'మెడికేసిన్లకి టయిమైంది. ఆల్లకి మాత్తర్లు పంచుతా డాట్రారూ' అంటూ కదిలింది.

బాలరాజు తన చేతిలో వున్న మెడిసెన్ టెక్స్ట్ బుక్‌లోకి తలదూర్చాడు. తల దూర్చేముందు స్టాఫ్ నర్స్ మందాకిని వెనుకభాగం చూశాడు. అందమైన గుర్రం నడిచి నట్టుంది. రేఖ గుర్తొచ్చింది. రేఖ నడక కూడా గుర్తొచ్చింది. ఏవిటో యిద్దరూ చాలాసార్లు కారిడార్స్‌లోనూ, క్యాంటీన్‌లోనూ కలుస్తున్నా యిద్దరిమధ్యా సుదీర్ఘమైన సంభాషణలేం జరగడంలేదు. రేఖకి వేరే వార్డ్సులో పోస్టింగ్స్. చాలా నెలలుగా వీచిన ప్రేమగాలుల విసురు తగ్గి తనకు చదువుమీద, కెరీర్ మీద శ్రద్ధ పెరిగింది. ఏవనుకుంటోందో తను. యిష్టం తగ్గిపోయిందనుకుంటోందా? తన యిష్టం గురించి తప్పకుండా తెలిసేవుంటుంది. అయినా తనకిష్టం వుందో లేదో అందుకే అంతగా పట్టించుకోవడంలేదేమో. అయినా ఆడపిల్ల పట్టించుకోవాలని అనుకోవడం యేవిటీ, తనే కదపాలి కానీ బాలరాజు మనసు పరి పరి విధాల ఆలోచిస్తోంది -

బాగా లేటయింది. బాలరాజు కదిలాడు. వార్డు వదిలి అవుట్ గేట్ వేపు నడుస్తున్నాడు.

'ఏవిటి? ఈ మధ్య రోజూ నైట్ ఆన్ కాల్ చేస్తున్నట్టున్నారు?'

చెవిలో వెయ్యివీణలు మోగినట్టు రేఖ పలకరింపు. తన వెనకే నడుస్తూ వచ్చి కలిసింది. రేఖ తనంతట తాను తనను పలకరించడం యిదే ప్రథమం. తన ఆలోచనకి యెంతబలం తనలో తనే నివ్వెరపోయాడు బాలరాజు.

'వేరే వార్డులో పనిచేస్తున్నా నా డ్యూటీల గురించి మీకు బాగా తెలుసే' అన్నాడు.

'నాకేకాదు. మన కొలీగ్స్ అందరికీ తెలుసు. ఈ మధ్య డ్యూటీలకి బాగా అంకితమైపోతున్నారని.'

'ఏదోలెండి. ప్రాబ్లమ్‌కి సొల్యూషన్ దొరికేదాకా పేషెంట్‌ను వదిలి రాలేకపోతున్నాను. తొందర్లోనే మన డెసిషన్స్ మనమే తీసుకోవాలి. అందుకే యీ ఆరాటం.'

'మంచిదే. గుడ్ డాక్టరయ్యే క్వాలిటీ. ఏదో అనుకున్నాను. మీరు ఏదో కాదు'

'అనుకున్నది అనుకున్నట్టు చెప్పడంలోనే తెలుస్తోంది మీ నిర్మలమైన మనసు. అందుకేనేమో మీ గురించి తరచూ తలుచుకుంటాను.'

'ఏం తలుచుకుంటారో'

'మీకు తెలుసులెండి.'

'అలాగా'

'అవును. అలాగే'

ఇద్దరూ కలిసి నవ్వుకున్నారు. ఔట్ గేట్‌లో రేఖ తనకోసం లేచివున్న కారెక్కుతూ' రండి. మిమ్మల్ని డ్రాప్ చేస్తాను.' అంది. బాలరాజు క్షణం సందేహించాడు. 'ఫర్వాలేదు. ఎక్కండి. ఇక మనం ఆగం' అంది.

'అవును. మనమింక ఆగం' అంటూ బాలరాజు కారెక్కాడు.

తర్వాత వారం యువడాక్టర్లందర్నీ లాసెన్స్ బే కి తీసుకెళ్ళారు సీనియర్ సర్జన్ పదును పాపారావుగారు. ఆయన యింగ్లాండ్‌లో చాలా రోజులు పనిచేసి చాంతాడంత పొడుగైన దొర డిగ్రీలు సంపాదించి తిరిగి వచ్చారు. భావి డాక్టర్లను తన సలహాలతో తీర్చిదిద్దడానికి తీసుకొచ్చారు. సరుగుడు చెట్ల మధ్య లాసెన్స్ బేలో శాంతి ఆశ్రమం అతి మనోహరంగా వుంది. చెట్లు గుబుర్లు వొత్తుగా వున్నాయి. సైకతాలు మెత్తగా వున్నాయి. సముద్రపుటలల విరుపులు మత్తుగా వున్నాయి. రేఖ సమీపంలో బాలరాజుకి అన్నీ అలానే వుంటాయి. అంతా యిసుకలో కూర్చున్నారు. కొంతమంది కాఫీలు తెచ్చుకున్నారు. మరి కొంతమంది ఐస్ క్రీములు తెచ్చుకున్నారు.

సర్జన్ మేష్టారు పదును పాపారావుగారు అందర్నీ వుద్దేశించి మాట్లాడటం ప్రారంభించారు.

'వినండోయ్ కుర్రడాక్టర్లూ. నేను చెప్పేది శ్రద్ధగా వినండి. ఇది వేదంకాదు. కేవలం నా అనుభవంతో నేను నేర్చుకున్న విషయాలు మీకు వుపయోగిస్తాయని చెబుతున్నాను. ఎవడో అన్నాడు, ఎక్కడ వొదగాలో, యెక్కడ యెక్కాలో తెలుసుకో అని. అలాగే మీరు యెక్కడ కొయ్యాలో, యెక్కడ కుట్లేసి ముయ్యాలో కచ్చితంగా చెయ్యాలి. అనుభవం కావాలంటే అదర్ హాస్పిటల్స్‌లో కూడా పనిచేయండి. ఇంకా పెరగాలంటే పోస్ట్ గ్రాడ్యుయేషన్ చైండి. కావల్సిన చోట జాబ్ కావాలంటే యెవడికి యెంత లంచం యివ్వాలో తెల్సుకోండి. అమెరికా, యు.కె లాంటి దేశాలకు వెళ్లి మంచి క్వాలిఫికేషన్లు పొంది మంచి కంఫర్టబుల్ లైఫ్ గడపాలంటే వారి ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ పాసై, వీసాలు తీసుకుని ఎగరండి' అని సర్జన్ పాపారావుగారు ఆగారు.

'ఫారిన్‌లో ఎలా ప్రోగ్రెస్ అవాలో చెప్పండి సార్' అనడిగాడొక యంగ్ డాక్టరు.

'వస్తున్నా. వస్తున్నా. అక్కడ నా అనుభవం దృష్ట్యా అన్నీ మీకు వివరిస్తాను' అంటూ కంటిన్యూ చేశారు.

'నేను యెన్నో దేశాలు తిరిగినా, యెక్కువ పనిచేసింది ఇంగ్లండ్‌లో. అక్కడ బాగా చలి. ఏడాదిలో ఆరునెలలు అయితే మరీ యెక్కువ చలి. సూర్యుడు తనకి తోచినప్పుడు కనిపిస్తాడు. అలా కనిపించినా వెలుగు తప్ప వేడివుండదు.

వెళ్లగానే మీకు లాంగ్ టెర్మ్ జాబ్స్ దొరకవు. లోకమ్స్‌గానీ, ఆర్నెల్ల జాబ్స్‌గానీ వెతుక్కోవాలి. బుద్ధిగా పనిచేసి. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కి తయారవుతూ తర్వాత జాబ్స్ వెతుక్కోవాలి. కొత్త జాబ్స్‌కి రిఫరెన్సులు కావాలి. తెల్లవాడి రిఫరెన్సులు అయితే బెటరు. మన వెధవలు తిన్నగా యివ్వరు, వొకవేళ యిచ్చినా వేస్టు. మన వెధవలకి మరో జబ్బు వుంది. తెల్లవాడిని తృప్తి పరుస్తున్నాననుకుంటూ సాటి మనిషైన మనల్ని వాడి ముందు చిన్న చూపు చూస్తూ తక్కువచైడానికి ప్రయత్నిస్తారు. తెల్లవాడి గురించి మనం చాలా కథలు విన్నాం. మన దేశాన్ని కొల్లగొడుతూ పరిపాలించాడని, అప్పుడు భారతీయుల్ని చిత్రహింసలు పెట్టాడని, యెదురు తిరిగిన వాళ్లను చంపేశాడని రకరకాలుగా. కానీ నేనక్కడ పనిచేయడానికి వెళ్లినప్పుడు తెల్లవాడు మన వాళ్లని యెంతో మర్యాదగా చూడటం తెలుసు. మనకి తెలీకపోతే చక్కగా తెలిసేలా చెబుతాడు. మనకి తెలిస్తే ఆనందిస్తాడు. అంతేగానీ మన వెధవల్లా అరవడం, విసుక్కోవడం, పులి డ్యాన్సలు చైడం చెయ్యడు. అంచేత మీలో యెవరేనా ఫారిన్ వెళ్తే, మన వృత్తి మీద శ్రద్ధ పెడితే మంచి డాక్టర్లయి తిరిగి వచ్చి మన వాళ్లకి సేవ చెయ్యవచ్చు'

పదును పాపారావు మళ్లీ ఆగారు. కుర్ర డాక్టర్లంతా చెవులు రిక్కించి ఋషిప్రోక్తం వింటున్న శిష్యుల్లా అలా ఆ శాంతి ఆశ్రమంలో ఏకాగ్రతలో మునిగిపోయారు.

సర్జరీ మేష్టారు మళ్లీ మొదలెట్టారు.

'మరొక్క విషయం. ముఖ్యంగా అబ్బాయిలకి. మీరిప్పుడు మంచి వయసులో వున్న కుర్రాళ్లు. మీకంటికిప్పుడు వయసులో వున్న గాడిద కూడా గంధర్వ కన్యలా కనిపిస్తుంది. మరి అక్కడ తెల్లపిల్లలు ఏపుగా యెదిగి మహా టెంప్టింగా వుంటారు. వాళ్లని చూసి వెళ్లిన పని మానేసి వాళ్ల వెనకాల పడితే -'

'పడితే?' అబ్బాయిలు కోరస్‌లో అడిగారు.

'పడితే యేముంది. వాళ్లకిష్టమైతే మీరు క్షవరం. ఇష్టం లేకపోతే కేసులు, కోర్టులు - మీ జీవితాలే గందరగోళం. పొరపాటున తెల్లపిల్ల వొళ్లు తగిల్తే వెంటనే 'సారీ' అనడం నేర్చుకోండి. సర్దుకుపోతుంది. భాషాభిమానం యెక్కువ.

అనుకోకుండా బాలరాజు చెయ్యి, రేఖ చేతికి తగిలింది. 'సారీ అన్నాడు.

రేఖ 'సరే' అంది చూపు తిప్పకుండా.

**సాయంత్రం** అలసిపోతోంది. చీకటి ముంచుకొచ్చే రోగంలా కమ్ముకుంటోంది. పిల్ల డాక్టర్లంతా దీపాలు వెలిగించి చీకటిని చెరిపేస్తున్నారు. పదును పాపారావుగారు చుట్ట వెలిగించి పొగలు విసురుతూ అన్నారు. 'అదీ విషయం, మైడియర్ యంగ్

డాక్టర్స్. మీరు తలుచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు. సాధించమని చెప్పడానికే మీ చుట్టూ యీ అందమైన ప్రపంచం వుంది. బాగా లేట్ అవుతోంది. ఇక కదుల్దాం. మీకింకా యేవన్నా సందేహాలుంటే వచ్చి నన్ను అడగండి. ఆల్ ది బెస్ట్‘ అని సరుగుడు చెట్ల మధ్య సమావేశానికి ముగింపు వాక్యాలు పలికారు. అంతా లేచి కదిలారు. బాలరాజు, రేఖ కూడా లేచారు. రేఖ కారు వైపు కదిలింది. బాలరాజు రేఖతో అడుగులు కలిపాడు.

‘ఏంచేద్దావని?‘ అడిగింది రేఖ.

‘మీతో కారుదాకా వస్తాను. అప్పుడు ఆలోచిస్తాను.‘

‘నా వుద్దేశం మీరు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేద్దావనుకుంటున్నారా? అనుకుంటే యిక్కడా? ఫారిన్‌లోనా? లేక ఏవన్నా జాబ్‌లో చేరతారా?‘

‘ఏదీ కచ్చితంగా అనుకోలేదు. ఇంకొన్నాళ్లు పనిచేస్తూ కాస్త అనుభవం సంపాదించాలనుకుంటున్నాను.‘

‘దట్స్ నైస్.‘

‘మరి మీరు.‘

‘నేనూ మీలాగే అనుకుంటున్నాను.‘

‘ఎప్పుడూ అడగలేదు. మీ అమ్మగారు, నాన్నగారు –‘

‘నాకు అమ్మా, నాన్నా లేరు.‘

బాలరాజు కొంచెం షాకయ్యాడు.

రేఖ చెప్పింది – ‘ఫ్యూయియర్స్ క్రితం ఫ్లైట్ యాక్సిడెంట్‌లో పోయారు.‘

‘సారీ టు హియర్. నేను వూహించలేకపోయాను.‘

‘నాకు తోడబుట్టిన వాళ్లెవరూ లేరు. మావయ్య దగ్గర వుంటున్నాను. ఆయనా వొక్కడే పెళ్లి చేసుకోలేదు. తను డాక్టరు. సొంత హాస్పిటల్‌తో యెప్పుడూ బిజీగా వుంటాడు. నాకు తల్లీ తండ్రీ ఆయనే.‘

‘అలాగా‘

‘మీరు.‘

‘మా అమ్మా, నాన్నా బాగా పెద్దవారయిపోయారు. మా విలేజ్‌లోనే వుంటారు. ఇక్కడ వొక్కణ్నే ఫ్రెండ్స్‌తో వుంటున్నాను. అఫ్‌కోర్స్, యిప్పుడు ఫ్రెండ్స్ తలోచోటికి వెళ్లిపోయారు. వొకడు తప్ప.‘

‘ఒక్కరే వున్నా తిన్నగానే వున్నారే‘

'ఎక్కడ తిన్నగా వుండడం. మీ వెనకాల పడుతున్నానుగా.'

రేఖ కిలకిలా నవ్వింది. బాలరాజు పకపకా నవ్వాడు. రేఖ కళ్ళు ధగధగలాడాయి.

'ఎక్కడ మీ మావయ్య హాస్పిటల్?

'క్యూర్ హాస్పిటల్. మీకు తెలియదా?'

'ఓ. క్యూర్ హాస్పిటల్ తెలియకపోవడమేవిటి? వైజాగ్‌లో అతి పెద్ద ప్రైవేట్ హాస్పిటల్. ఆశీలు మెట్ట దగ్గర కదూ వుంది'

'యెస్. అదే'

ఇద్దరూ రేఖ కారు దగ్గరికి వచ్చారు.

'ఎక్కండి బాలూగారూ, మిమ్మల్ని డ్రాప్ చేస్తాను' అంది రేఖ.

'స్పేర్ టైర్ వుందిగా' - నవ్వుతూ కారెక్కాడు బాలరాజు.

'ఈసారి మనం ఆగంలెండి' కారులో కూర్చుంటూ అంది రేఖ.

'అవును - మనం ఆగం - మనకిప్పుడు తెలిసింది వొక్కటే - వేగం.'

'ఇన్నేళ్లూ వోపిగ్గా వుంటూ చదువుకున్నాం. ఇప్పుడు వేగం మనకి బలే బావుంటుంది కదూ.'

'అవును' అంటూ బాలరాజు ఆమె బుజాన్ని తాకాడు. ఆమె 'ఊం' అంది. తెలుగులో అచ్చులు అప్పుడప్పుడు మరీ తన్మయంగా వుంటాయనుకున్నాడు బాలరాజు.

కారు చాలా దూరం వెళ్తోంది.

'ఎక్కడికి వెళ్తున్నాం?' అడిగాడు బాలరాజు.

'డ్రాప్ చేస్తానన్నాను కదూ - సారీ. మర్చిపోయా. ఫర్లేదు. మా యింటికి వచ్చి కాఫీ తాగి వెళ్లండి. నేను మళ్లీ డ్రాప్ చేస్తాను.'

'సరే నేను మీ యిల్లు కూడా చూసినట్టు వుంటుంది.'

చెట్లు, కొట్లూ, రోడ్లు, యెడ్లూ దాటి కారు రేఖ ఇల్లు చేరింది. ఇల్లు బాగా యెత్తులో వుంది - విశాలమైన విశాఖపట్నం అంతా చూస్తున్నట్టు. గేటు దాటి ఆవరణలోకి ప్రవేశించగానే అటూ యిటూ యెనలేని వృక్ష సంపద, యెన్నో పూల మొక్కలు. ఇంటి సంపదను హరితాలన్ని సంపన్న భరితంగా చూపిస్తున్నాయి.

రాణీగారు రాగానే రాజభటులు వచ్చి వినయాన్ని ప్రదర్శిస్తున్నట్టు అటునుంచీ యిటు నించీ పనివాళ్లు వొంగి వొంగి కదిలారు. కండలు తిరిగిన మనిషి వొకడు వచ్చి కారు తలుపు తీశాడు. రేఖ, బాలరాజు కారు దిగారు. తలెత్తి చూసిన బాలరాజు యిది ఇల్లు కాదు. భవంతి అనుకున్నాడు. ఇద్దరూ లోపలికి నడిచారు. గోడలు ఖరీదైన తైల వర్ణచిత్రాలను తగుల్చుకుని తాము గొప్పింటి గోడలమని చెబుతున్నాయి. సీలింగు ఆకాశంలా బాగా యెత్తుగా వుంది. ఒక షాండ్లియర్ దేదీప్యమానంగా వెలుగుతూ మెరుస్తూ విర్రవీగుతోంది.

'ఇదే మా యిల్లు - కూర్చోండి. యిప్పుడే వస్తా' అని రేఖ, బాలరాజుని కూర్చోమని చెప్పి లోపలికి వెళ్లింది. బాలరాజు సోఫాలో కూర్చోగానే అతనికి సోఫియా లారెన్ తొడమీద కూర్చున్నట్టు అనిపించింది. ఇంతలో వంట మనిషి, వొంటి మనిషి కాదు - కడుపుతో వుంది - ప్లేట్‌లో పకోడీలు తీసుకువచ్చి టీపాయ్ మీద పెట్టి వెళ్లింది. రేఖ రెండు కాఫీ కప్పులు ట్రేలో పెట్టుకుని తీసుకొచ్చి 'కాఫీ తీసుకోండి' అని వొక కాఫీ నిండిన కప్పు బాలరాజుకిచ్చి, తనొక కప్పు తీసుకుని కూర్చుంది.

'మీ యిల్లు చాలా బాగుంది' అన్నాడు బాలరాజు కాఫీ సిప్ చేస్తూ.

'థాంక్యూ. ఎప్పుడూ యిలా క్వయిట్‌గానే వుంటుంది. మావయ్యని పరిచయం చేద్దామనుకున్నాను. కానీ యింకా వచ్చినట్టులేదు. ఇంత పెద్దింట్లో ఎవరేనా వచ్చినా వెళ్లినా కూడా తెలియదు. అందుకే యింట్లో మనుషులకంటే యిల్లు చూసే మనుషులే యెక్కువ.' నవ్వుతూ చెప్పింది రేఖ.

మళ్లీ అంది. 'కాఫీ తాగండి యిల్లు చూపిస్తాను.'

'లేదు. మరోసారి వచ్చినప్పుడు చూస్తాను. నాకోసం మేష్టారు వస్తానన్నారు. త్వరగా బైల్దేరుతాను.'

'మేష్టారేవిటీ?'

'మేష్టారంటే ప్రైవేటు మేష్టారు కాదు. హిస్టరీ శర్మగారు. నా వెల్ విషర్. మహా జ్ఞాని.'

'అలాగా. అయితే ఆయన్ని నేను తప్పకుండా చూడాలి.'

'ష్యూర్. పరిచయం చేస్తాను.'

'ఇన్నేళ్లు మనం కలుస్తూనే వున్నాం కానీ యిప్పటిదాకా కలిసి కాఫీ తాగడమే కుదర్లేదు.' అంది రేఖ.

'కలిసి యిలా యిష్టంగా మాట్లాడుకోవడం కూడా యీ మధ్యేగా మొదలైంది.'

'అఫ్‌కోర్స్. మనకిప్పుడు బోలెడంత టైము. దేనికీ కొదవుండదు.'

'అవును రేఖాజీ'

'ఇక మీరు నన్ను జీ, గారు అనకండి. రేఖ అంటే చాలు. అలాగే బాగుంటుంది.'

'అయితే నన్ను బాలరాజుగారూ కూడా అనొద్దు.'

'బాలూ' అంటాను.

'అవును. అలాగే బాగుంటుంది.'

రేఖ బాలరాజుని మెరిసే కళ్లతో చూసింది.

బాలరాజు ఆమె కళ్లనే చూస్తూ వుండిపోయాడు. 'పకోడీ తిన్నారా?' అడిగింది.

'ఒకటి తిన్నా చాలు. బాగుంది. మరి కదుల్దామా?' అన్నాడు కాఫీ తాగడం పూర్తి చేసి బాలరాజు.

'ఓకె. అయితే బైల్దేరదాం' అంటూ రేఖ లేచింది.

ఇద్దరూ హోలు విడిచి, కారువేపు కదిలారు.

కాసేపట్లో కారు బాచిలర్స్ డెన్ చేరింది.

నల్లతంబి కనిపించాడు. 'శర్మగారొచ్చారా?' అని అడిగాడు బాలరాజు.

'యింకా నేదు సార్' అని చెప్పాడు నల్లతంబి.

'ఇతను మా కుక్. పేరు నల్లతంబి. ఇంకా మేష్టారు రాలేదుట. పైకెళ్లి వెయిట్ చేద్దామా.'

'నో - బాగా లేటయింది. ఇంకోసారి. నైస్ మీటింగ్ యూ నల్లతంబీ' అంది రేఖ.

'సరే మరి' కారు దిగుతూ అన్నాడు బాలరాజు.

'కాఫీ బాగుంది. కలిసి కాఫీ తాగడం యింకా బాగుంది రేఖా.'

'థాంక్యూ బాలూ - యు మేడ్ మై డే' నవ్వింది.

'నవస్కారవమ్మా' అని వెనక్కి నడిచాడు నల్లతంబి.'

రేఖకు గుడ్‌నైట్ చెప్పి బాలరాజు తన రూమ్‌కి కదిలాడు.

రేఖ కారు వెనక్కి తిప్పుకుని మధురోహల్తో యింటివేపు కదిలింది. కాసేప్పటికి హిస్టరీ శర్మగారు, పాహియాన్ వచ్చి బాలరాజుని బాచిలర్స్ డెన్ బాల్కనీ మీద కలిశారు. ఫుడ్ రెడీ చేస్తానంటూ నల్లతంబి కిచెన్‌లోకి వెళ్లాడు. తానీషా వస్తాడో లేదో వాళ్లకి తెలియదు. తానీషాకీ తెలియదు. అతనింకా హసీనా బేగంతో మాట్లాడుతూనే వున్నాడు.

**శర్మగారు** అనుకున్న సమయంకంటే లేటుగా వచ్చారు. నల్లతంబి భోజనం పెట్టేలోగా కబుర్లు సాగాయి.

'అన్నట్టూ యీ వారంతో హౌస్ సర్జన్సీ పూర్తి అవుతుందని చెప్పినట్టు గుర్తు. తర్వాత యేం చేద్దావని?' అనడిగారు శర్మగారు.

'పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేద్దావనే ఆలోచన వుంది. ఇక్కడా, ఇంగ్లండ్‌లోనా, అమెరికాలోనా యింకా యేమీ అనుకోలేదు. బహుశా యిక్కడే చేస్తానేమో మేష్టారూ.'

'ఇక్కడే బెటరయ్యా! ఎక్కడో యెందుకు, మనదేశమా, మన మనుషులా, మన భాషా, మనలోకమా'

కరెక్టేసార్. బహుశా యిక్కడే చేస్తాను చేసేముందు వొక యేడాది సీనియర్ హౌస్ జాబ్ చేద్దామనిపిస్తోంది. ఎక్స్‌పీరియన్సు కోసం.'

'అదీ మంచిదే నీ మనసుకి అనిపించింది చెయ్యి - బాగా చెయ్యగలవు.'

'థాంక్యూ మేష్టారూ - రండి. ఫుడ్ ఫెడీ అయ్యింది మనకి' అన్నాడు బాలరాజు. ఇద్దరూ బాల్కనీలో టేబుల్ దగ్గరకు చేరారు.

పక్షుల కిలకిలా రావాల్తో, పేషెంట్ల కలకలా రావాల్తో కె.జి.హెచ్ నిద్రలేచింది. మెడికల్ వార్డులో బాలరాజు పేషెంటుని చూస్తున్నాడు. మందాకిని వూగుతూ నడుస్తోంది. పి.జి.లు వొకచోట నిలబడి నర్సు మందాకిని వైపే చూస్తున్నారు. ఎందుకంటే ఆమె వూగుతూ నడుస్తూంటే ఆమె చెస్టోజాలు వూగుతున్నాయి. వెనుక హిప్పోజాలు కూడా వూగుతున్నాయి. ఇంతలో సూపరింటెండు సూరిగారు వచ్చారు. పి.జి.లు కంగారుగా చెదిరి తలో పేషెంట్ బెడ్ దగ్గరకీ సర్దుకున్నారు. సూరిగారు మందాకినితో యేదో మాట్లాడుతున్నారు. దూరం నించి బాలరాజు చూశాడు. సూరిగారు పొట్టిగా చిన్న సైజులో వుంటారు. మందాకిని టానిక్ తాగిన మన్మథ సృష్టిలా వుంటుంది. సూరిగారు ఆమె చుట్టూ తిరుగుతూ మాట్లాడుతూంటే కుక్కపిల్ల గుర్రం చుట్టూ అటూ యిటూ తిరుగుతున్నట్టుగా వుంది. బాలరాజు తన దృష్టి మరల్చుకుని మళ్లీ కేసులు చూడ్డంలో నిమగ్నమయ్యాడు. సూరిగారు, మందాకినీ యేదో డిస్కస్ చేస్తూ డ్యూటీ రూమ్‌లోకి నడిచారు. వార్డులో తను ఫాలో అవుతున్న యిద్దరు డయాబెటిక్ పేషెంట్స్ కనిపించలేదు బాలరాజుకి. కొద్దిరోజుల క్రితం కూడా ముగ్గురో నలుగురో డయాబెటిక్ పేషెంట్స్ మిస్సయినా పట్టించుకోలేదు తను. బాగైపోయి యింటికి పోయారో లేక పోయారో అనుకున్నాడు. ఇంతకు ముందు కూడా యిలాగే అయివుండవచ్చు. తను నోటీస్ చైలేదేమో సిస్టర్ యిన్ ఛార్జ్ మందాకినిని అడిగి తెలుసుకోవాలి అనుకుంటూండగా తనే డ్యూటీ రూమ్‌లోంచి బైటికి వచ్చింది. వస్తూ 'యీ పొట్టోడికి

యావెక్కువ. చ్చేవ తక్కువ - కేసులూ, డిస్కసనూ అంటూ వొంకొకటి.' తను సూపరింటెండ్ సూరి గురించే అంటోందని తెలుసు.

'డయాబెటిక్స్ డిశ్చార్చ్ అయ్యారా సిస్టర్' అనడిగాడు.

'డిచ్చాజ్జా, పాడా - పెసల్ టిరీట్‌మెంట్ కోసం టాన్సుపరు. ఆ పొట్టి సూరిగాన్నడిగితే యివరాలన్నీ సెబుతాడు. అన్నట్టు డాౖటారూ - ఆ యెదవ మిమ్మల్నోసారి సూత్తాట్ట. యెల్లి కలవండి' అంది మందాకిని.

'అలాగా' అంటూ బాలరాజు సూరిగారున్న గదిలోకి వెళ్లాడు. సూరి కేసు నోట్సులు చూస్తూ, 'రావయ్యా! బాలరాజూ - అలా కూచో' అన్నాడు.

బాలరాజు, సూరిగారికెదురుగా కూర్చున్నాడు.

సూరిగారు చేతిలో ఫైలు మూసి పక్కన పడేసి, బాలరాజుకేసి చూస్తూ, ఆఁ - ఎలా వున్నావ్ బాలరాజూ' అనడిగాడు.

'బానే వున్నాను సార్' అన్నాడు బాలరాజు.

'ఈ వీక్‌తో హౌస్ సర్జన్సీ అయిపోతుంది కదూ - మరి ఎనీ ప్లాన్స్?' అడిగారు సూరిగారు.

'అదే ఆలోచిస్తున్నానండి.'

'ఇంకా ఆలోచనేవిటయ్యా. పి.జి కేవన్నా అప్లై చేశావా చెప్పు.'

'లేదండి. ఎక్స్‌పీరియెన్స్ కోసం సీనియర్ రెసిడెన్సీ చేస్తే యెలా వుంటుందా అనుకుంటున్నానండి.. ఇంకా డిసైడ్ చేసుకోలేదుగానీ అదే చేద్దావనిపిస్తోందండి.'

'వెరీగుడ్ మంచిదే, నీ గురించి అన్నీ మంచి రిపోర్ట్సే వస్తున్నాయి. నువ్వేం డిపార్ట్‌మెంట్ ప్రిఫర్ చేస్తావో తెలియదుకానీ, ఐ వుడ్ లైక్ టు సజెస్ట్ సమ్‌థింగ్ - కెన్ ఐ?'

'అదేంటి సార్ - తప్పకుండా చెప్పండి.'

'ఇట్స్ లైక్ ఎ రెసిడెంట్ జాబ్. ఇన్‌ఫాక్ట్ బెటర్. అండ్ విత్ బెటర్ పే.'

బాలరాజు ప్రశ్నార్థకంగా చూశాడు. సూరిగారు చెప్పారు. 'నువ్వు యిక్కడే మన కె.జి.హెచ్‌లో కంటిన్యూ చేస్తానంటే నాకు అభ్యంతరంలేదు. కానీ వొక స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ హాస్పిటల్లో యెన్నో మోడర్న్ ఫెసిలిటీస్ వున్న చోట పనిచేస్తే యింటెలిజెంట్ డాక్టరైన నువ్వు యెంతో పదునెక్కుతావ్. ఏవంటావ్?'

బాలరాజు అన్నాడు 'మీరు పెద్దవారు. మీరేం చెబితే అలాగే చేస్తాను.'

'ఓ.కె గుడ్ వాళ్లకి నువ్వొస్తావని చెబుతాను. ఖాళీ చూసుకుని వొకసారి ఆ హాస్పిటల్ డైరెక్టరుకి కనబడు.'

'ఇంతకీ ఏ హాస్పిటల్ సార్?'

'సారీ. చెప్పడం మరిచిపోయాను. నీకు తెలుసుగా 'క్యూర్' హాస్పిటల్.'

'తెలీకపోవడమేవిటి సార్. విన్నాను. వైజాగ్‌లో అందరికీ తెలిసిన హాస్పిటల్.'

'మరయితే - ఆల్ ది బెస్ట్ - నేను కదుల్తాను. యింకా అదర్ వార్డ్స్ రౌండ్స్ వున్నాయి' సూరిగారు లేచారు.

'అన్నట్టు మీతో యింకో విషయం చెప్పాలి.'

'ఏవిటి?'

'ఏం లేదు సార్. ఈ వార్డ్‌లో డయాబెటిక్ పేషెంట్స్ -' బాలరాజు నసిగాడు.

'ఓ. అదా. డోంట్యూవర్రీ అడ్వాన్స్ ట్రీట్‌మెంట్ కోసం వాళ్లు ట్రాన్స్‌ఫర్ అవుతున్నారు. ఎక్కడికో కాదు నువ్వు వెళ్లే 'క్యూర్' హాస్పిటల్‌కే. వన్స్ యు గో దేర్, యు నో మోర్' సూరిగారు లేచి కదిలారు. అర్థం కాని ముఖంతో బాలరాజు కూడా ఆయన్ని వార్డు మెయిన్ డోర్ దాకా అనుసరించాడు. సూపరింటెండ్ సూరిగారు చిన్న మనిషైనా ఆయనది రథంలా పెద్దకారు. ఆయన తన కారు వైపు నడుస్తూంటే యేనుగుని యెక్కడానికి వెళ్తున్న యెలుకలా అనిపించారు బాలరాజుకి.

లోపలికి వచ్చాక మందాకిని అడిగింది.

'ఏటంతాడు పొట్టిగూటం?' అని.

'నాకు 'క్యూర్' హాస్పిటల్లో జాబ్ ఫిక్స్ చేశారు' చెప్పాడు బాలరాజు

'అయిబాబొ - యెల్లిపోతారా డాట్రారూ - అయితే నానూ మీ యెనకే'

'అదేవిటి?'

'అవును డాట్రారూ - మీరు సానా మంచోరు. మెదడున్నోరు. మీతో పనిసేత్తే పదింతల జాబు తృత్తి'

'ఏదో నీ అభిమానం సిస్టర్.'

'అలాగనకండి. తవకాడ దయాదాచ్చిన్నేలున్నయ్.'

'మరక్కడ వేకెన్సీ వుండాలిగా నువ్వు జేరాలంటే'

'సవస్యేనేదు. మన సూరిపండుగాడున్నాడుగా, ఆడికి నేనంటే యామోవం. ఆడే సూత్తాడు'

'సరేమరి. నీలాంటి డివోటెడ్ సిస్టర్ వుంటే అంతకంటే యేం కావాలి' అన్నాడు బాలరాజు.

'మరి యాడయాబిటిక్కోల్ల గురించి అడిగేరా?'

'అడిగా అడ్వాన్స్ ట్రీట్‌మెంట్ కోసం 'క్యూర్' హాస్పిటల్‌కి ట్రాన్స్‌ఫర్స్ చేస్తున్నార్ట.'

'మరీడ మనం సేసేడిదేంటో?'

'వెళ్ళి చూస్తే తెలుస్తుంది మనకి.'

'అదీ కరస్టే. కాఫీ కలుపు కొత్తా డా్రటారూ' అని మందాకిని హుషారుగా నడిచింది.

కాఫీతాగాక బాలరాజు పని పూర్తి చేసుకుని బైటికి వచ్చాడు. ఈ విషయం యింకా రేఖకి తెలీదు. తను చెబితే యెంతో సంతోషిస్తుంది అనుకున్నాడు బాలరాజు. ఇన్నాళ్లు అలవాటయిపోయిన కె.జి.హెచ్ గోడలు దాటి వెళ్లాలంటే యేదో తెలియని వెలితిగా వుంది బాలరాజుకి.

అజంతా హోటల్ బస్ స్టాప్ దగ్గర కిళ్లీ కొట్టు అప్పలరాజు బిజీగా వున్నాడు. హిస్టరీ మేష్టారు శర్మగారు పాహియాన్‌తో యేదో మాట్లాడుతున్నారు. బాలరాజు కూడా కలిశాడు. పాహియాన్ సినిమాల గురించి మాట్లాడుతున్నాడు.

'సినిమాహాలు దగ్గరికి యిల్లు మారిపోదామా అనిపిస్తోంది' అన్నాడు పాహియాన్.

'ఎందుకో?' అడిగారు శర్మగారు.

'ఏం చెప్పమంటారూ - శతదినోత్సవాలు చేసుకునే సినిమాలు తగ్గిపోతున్నాయి. జత దినోత్సవాలు చేసుకునే సినిమాలు పెరుగుతున్నాయి. ఆ మాట కొస్తే కొన్ని యింటర్వెల్ దాకా ఆడి వెళ్లి పోతున్నాయి. ఈ మధ్య మరీ అన్యాయం. రిలీజయిన సినిమా, యింటి దగ్గర్నుంచి బైల్దేరి థియేటర్‌లోకి చేరేలోపునే వెళ్లిపోతోంది. అందుకే హాలు పక్కనే యిల్లు తీసుకుంటే సినిమాను వెళ్లిపోయేలోగా చూడొచ్చని' అని చెప్పాడు పాహియాన్.

'ఏడిసినట్టే వుంది. అంత తొరగా వెళ్లిపోయే దిక్కుమాలిన సినిమాను చూడకపోతే యేవొచ్చిందిట' అన్నారు శర్మగారు.

'మీకో న్యూస్' అన్నాడు బాలరాజు టాపిక్ మారుస్తూ.

'ఏవిటి?' అని యిద్దరూ అడిగారు.

'ఇక్కడ నా రెసిడెన్సీ అయిపోయింది. వచ్చేవారం నుండీ 'క్యూర్' హాస్పిటల్లో పనిచేయబోతున్నా' చెప్పాడు బాలరాజు.

'సరే. ఏ హాస్పిటలయితేనేం ప్రాణం తియ్యడానికి' అన్నాడు పాహియాన్. 'ఈ మధ్య డాక్టర్లంటే అందరికీ జోకే' అన్నాడు బాలరాజు.

'నువ్వు ప్రాణాలు పోసేవాడివేకాని తీసేవాడివి కావు. పాహియాన్ యేదో పరిహాసానికన్నాడంతే' అని శర్మగారు శాంతం పలికారు.

**రోడ్డు కాస్త** యెత్తుగా వుంది. ఎత్తులో వున్న యెత్తైన 'క్యూర్' హాస్పిటల్ కూడా బాగా యెత్తుగా వుంది. రిసెప్షన్‌లో రిసెప్షెనిస్టు చాముండేశ్వరి కూడా బాగా యెత్తుగా వుంది. ఆమె ముందు నిలబడ్డాయన మాట్లాడకుండా ఆమె యెత్తైన వక్షోజాల కేసి చూస్తున్నాడు.

'ఏటీ - ఆ సూపేటి? మాటాడరేటి?' అనడిగింది చాముండేశ్వరి.

'మా బామ్మరిదికి ఆపరేషన్ అయింది. చూడ్డానికొచ్చా' అన్నాడాయన.

'రోగి సుట్టాలా? పేరేటి?'

'నాదా?'

'కాదు - నాది' నవ్వింది.

'మీ బామ్మర్దిపేరు.' అంది ఏదో కాయితం చూస్తూ.

'యమ్ చలపతిరావ్.'

'సెలపతిరావా?' కాయితం కేసి చూసి మూడో పోర్లో కెల్లండి అంది. ఆయన కదిలాడు.

ఫోన్ మోగింది. 'కూరా సిపితల్ - సాముండేసరీ యిస్‌పీకింగ్' అంటూ ఫోన్ అందుకుంది రిసెప్షనిస్టు.

బాలరాజు నల్లసూట్‌లో నిగనిగలాడుతూ రిసెప్షను వైపు నడిచాడు. బాలరాజుని చూడగానే చాముండేశ్వరికి కళ్లు పెద్దవై నోరెళ్లబెట్టి చూసింది. అనుకోకుండానే - 'నవస్కారవండి' అంది.

బాలరాజు ప్రతి నమస్కారం చేసాడు. ఏదో అడగబోయాడు. అంతలోనే చాముండేశ్వరి మాట్లాడింది.

'తవరొత్తారని సెప్పారండి డాట్రారూ'

'నేను డాక్టరని యెలా తెలుసు?' అడిగాడు బాలరాజు.

'బలేవోరే. యేల్ల తరబడి పన్జేత్తన్నా ఆ మాత్తరం తెల్దేటండి. బాసుగారు పస్టుపోర్లో మానేజింగు డవిరెట్టరు రూములో వున్నారండి. యెల్లండి - అదుగో ఆ పక్కకెల్తే లిప్టు' అంది.

బాలరాజు 'క్యూర్' హాస్పిటల్ నలువైపులా చూస్తూ కదిలాడు. అంతా అతి శుభ్రంగా స్టార్ హోటల్‌లా వుంది. పైకి వెళ్లి మేనేజింగ్ డైరెక్టర్ ఆఫీసు రూము దగ్గరకు వెళ్లాడు. అక్కడి బోయ్, 'కూచోండి సార్' అని వెయిటింగ్

యేరియాలో కుర్చీ చూపించి లోపలికి వెళ్లాడు. బాలరాజు కూర్చున్నాడు. బోయ్‌లోపలికి వెళ్లి వచ్చి 'రండి సార్ - సార్ రమ్మన్నారు' అని ఆఫీస్ రూమ్‌లోకి దారి చూపించాడు.

బాలరాజు లోపలికి అడుగెట్టగానే యెదురుగా కూర్చున్న శాల్తీని చూడగానే క్షణం చకితుడయ్యాడు. ఎదురుగా కనిపించేది యెవరో కాదు. ఏళ్ల క్రితం తను చూసిన క్రూరమృగం నాగదాసు. నాన్ననూ, అమ్మనూ హీనంగా చూసి, ఏహ్యంగా, కటువుగా మాట్లాడిన డాక్టరు నాగదాసు. తను పుట్టిన వూళ్లో హాస్పిటల్లో అప్పుడు పనిచేసిన ఆ జంతువు ముఖం బాలరాజుకి బాగా గుర్తు. కొంచెం మీసాలు బొద్దుగా పెంచాడంతే. బహుశా తర్వాత పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి యిలా యెదిగి వుంటాడు.

తనని గుర్తుపట్టినట్టులేడు. కుర్రాడిగా తనని చూశాడప్పుడు. ఇప్పుడు తను బాగా యెదిగాడు.

'కమాన్. కూర్చో. నీ గురించి చాలా బాగా విన్నాను. కె.జి.హెచ్‌లో నువ్వు బెస్టు అంటున్నారు' చిరునవ్వుతో ఆదరంగా ఆహ్వానించాడు బాలరాజుని నాగదాసు.

బాలరాజు నమస్కారం పెట్టి కూర్చున్నాడు. ఉద్యోగ వివరాలు, వర్క్ రొటీన్ వగైరా విషయాలన్నీ యిద్దరూ మాట్లాడారు. ఒక పక్క మాట్లాడుతున్నా బాలరాజు మరో పక్క ఆలోచిస్తూనే వున్నాడు. తన గురించి సూపరింటెండ్ సూరి కాకుండా యింకెవరేనా చెప్పి వుంటారా? రేఖ చెప్పిందా? రేఖ మావయ్య యీ నాగదాసు కాదుగదా? మైగాడ్ వాటె కో యిన్సిడెన్సు నాగదాసు యింకా దుర్మార్గుడేనా. లేక మారాడా? ఏమో? కొంతమంది డాక్టర్లు పేషెంట్స్‌తో క్రూరంగా వుంటారు. విడిగా అందరితో చాలా ప్రసన్నంగా వుంటారు. నాగదాసు యీ కోవకి చెందినవాడా. ఏమైనా తన తల్లిదండ్రుల యెడ వీడు చూపిన అమానుషాన్ని యెలా మరువగలడు. ఈ జాబ్‌లో చేరాలి. వీడి సంగతి తెలియాలి. అయినా తనకి పనిలో అనుభవం కూడా కావాలనుకున్నాడు. అంచేత తను కూడా వినయంగా మాట్లాడి 'క్యూర్' హాస్పిటల్లో వుద్యోగానికి నాగదాసు స్వాగతం స్వీకరించి వొప్పుకున్నాడు. నాగదాసు కాఫీ తెప్పించాడు. తను సగమే తాగాడు. జాయినింగ్ డేట్ నిర్ధారించుకున్నాక, కృతజ్ఞతలు చెప్పి బాలరాజు లేచాడు.

బైటికి వస్తూంటే, రిసెప్షన్ దగ్గర రిసెప్షనిస్టు చాముండేశ్వరి మళ్లీ పలకరించింది' మాకడకి ఎలిపొచ్చేత్తనారా డాట్రారూ. సేనా హేపీస్. మిమ్మల్ని రోజూ జూసుకుంటూనే వుంటాం' బాలరాజు చిరునవ్వు వొకటి ఆమెకు విసిరి హాస్పిటల్ బైటికి నడిచాడు.

రామక్రిష్ణా మిషన్ దగ్గర యిద్దరు వృద్ధ దంపతులు రామక్రిష్ణా అనుకుంటున్నారు. దూరంగా యిసుకలో యిద్దరు పడుచు దంపతులు క్రిష్ణా విజయ నిర్మలా అనుకుంటున్నారు. క్వాలిటీ రెస్టారెంట్ వోపెన్ ఎయిర్ డెక్ మీద యెదురెదురు కుర్చీల్లో బాలరాజు, రేఖ కూర్చుని వొకరి ముఖాన్ని మరొకరు దోచుకుంటూ చూసుకుంటున్నారు.

'అయితే జాయిన్ అయిపోయావన్నమాట'

'అన్నమాట కాదు. జాయినయిపోయాను. నీక్కూడా రెసిడెన్సీ అయిపోతున్నట్టుంది.'

'అవును. నేను కూడా మావయ్య హాస్పిటల్లోనే వర్క్ చేస్తాను.'

'పి.జి. చెయ్యవా?'

'చేస్తాను. నీలాగే నాకూ వర్క్ ఎక్స్‌పీరియన్స్ కావాలి కదా'

'అవును. ఇద్దరం కలిసి పనిచేస్తేనే కదా అనుభవం'

'ఏయ్'

'అదే ఐ మీన్ వర్క్ ఎక్స్‌పీరియన్సు' నవ్వుతూ అన్నాడు బాలరాజు.

'మావయ్యని కలిశావా మరి?'

'మేనేజింగ్ డైరెక్టర్ని కలిశాను. ఎవరో నాగదాసుట. వెల్కమింగానే వున్నాడు.'

'ఆయనే మావయ్య. నేనింకా పరిచయం చేద్దామనుకుంటున్నాను. నువ్వు ముందే కలిశావు.'

'వాట్ ఎ కోయిన్సిడెన్స్' అన్నాడు బాలరాజు తను వూహించిన విషయమే అని తెలిసినా.

'మావయ్య వున్నప్పుడు యింటికి వద్దువుగాని, అప్పుడు యు నో హిమ్ మోర్.'

'అవునవును' అన్నాడు బాలరాజు - మావయ్య పెంచే గారాబు పిల్లకి మావయ్య తన కథలో విలన్ అని తెలిస్తే ముందు కథ యెలా వుంటుందా అని ఆలోచిస్తూ.

ఇద్దరూ క్వాలిటీ ఐస్‌క్రీమ్ తిన్నారు.

రేఖ తన కింద పెదవితో పై పెదవినీ, పై పెదవితో కింద పెదవినీ క్లియర్ చేసుకుంది.

'నీ పెదాలు బలే వున్నాయని అనాలనిపిస్తోంది.'

'అనిపిస్తే అను.'

'ముద్దెట్టుకోకుండా యెలా?'

'ఏయ్. కెరటాలకి కళ్లుంటాయి తెలుసా.'

'వుంటే వుండనీ. మన దగ్గరితనం చూసి, ఆనందంతో యెగిరిపడతాయి.'

'ఇప్పుడే యెగిరెగిరి పడుతున్నాయి. ఆల్‌రెడీ చూస్తున్నాయనుకుంటా' అంది రేఖ సముద్రం కేసి చూస్తూ.

ఆమె యెగిరిపడే ముంగురుల్ని సవరించాడు బాలరాజు. ఇసుకలో మాసిపోయిన నిక్కర్లేసుకున్న యిద్దరు మాసిపోయిన కుర్రాళ్లు 'లవ్వు, లవ్వు' అంటూ కెరటాల్లా యెగిరిపడుతున్నారు రేఖకి నవ్వొచ్చింది. ఆ నవ్వు అర్జంటుగా మల్లెపూలు విరిసినట్టుంది. బాలరాజుకి పరవశం, పరాయి వశం అంటే యేంటో బాగా తెలుస్తోందిప్పుడు.

డ్యూటీలో ప్రవేశించడానికి ముందే, బాలరాజు 'క్యూర్' హాస్పిటల్ డీటైల్డ్ విజిట్‌కి వెళ్లాడు. దగ్గరుండి చూపిస్తానని రిసెప్షనిస్ట్ చాముండేశ్వరి, బాలరాజుని తన వెంటే రమ్మంది. చాముండేశ్వరి చాలా కేర్ ఫ్రీ మనిషి - బాలరాజుని చూసిందగ్గర్నుంచీ తన బంధాల గురించి ఆలోచించడం మానేసింది. బాలరాజుకి ఏమైనా బంధాలు, అనుబంధాలు వున్నాయా అని కూడా ఆలోచించదల్చుకోలేదు.

'డాక్టర్లకి నర్సులే కాదండి. స్టాపు కూడా సక్కటి ఫ్రెండుచిప్పుతో తోడుంటారని తవరికి నాను సెప్పక్కర్లేదండి' అంది చాముండేశ్వరి.

'ఎప్పుడూ సరదాగా నవ్వుతూ వుంటారు మీ ఫ్రెండ్షిప్ కోరకుండా యెవరుండగలరు?' అన్నాడు బాలరాజు.

'సెబాసో - సత్తెం బలికారు డాట్రారూ' అంది చాము.

'క్యూర్' హాస్పిటల్ అయిదంతస్తుల భవనం - యాభై పడకలు ప్లస్ పది ఎక్యూట్ బెడ్స్, ఎక్స్-రే, పెథాలజీలాబ్, ఐసియు పై మూడు ఫ్లోర్స్‌లో వున్నాయి. సెకండ్ ఫ్లోర్‌లో వొక పక్క ఎడ్మినిస్ట్రేషన్, మరో పక్క డాక్టర్ల రూమ్స్, ఫిజియోథెరపీ, పిల్లల ప్లే రూమ్ వున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో యాక్సిడెంట్ అండెమర్జన్సీ, ఆపరేషన్ థియేటర్లు, రికవరీ రూమ్స్ వున్నాయి హాస్పిటల్‌కి బేస్‌మెంట్ కూడా వుంది. అక్కడ వొకవైపు స్టోరేజ్, లాండ్రీ, ఎలక్ట్రిసిటీ, వాటర్ కంట్రోల్స్ వున్నాయి. మరోవైపు తలుపులు మూసిన వొక హాల్ వుంది. అక్కడ యిద్దరు సెక్యూరిటీ గార్డులున్నారు 'అదికూడా చూద్దామా!' అనడిగాడు బాలరాజు.

'అది రీచెచ్చి వార్డండి. మనం యెల్డానికి లేదు బాస్ గారే వాడుతారండి ఆర్నడిగితే చూపిత్తారండి' అది చాముండేశ్వరి.

హాస్పిటల్ ముందు, పక్కన బాగా విశాలమైన కారు పార్కు, కారు పార్కులోంచి ఎమర్జన్సీ యూనిట్ డైరెక్ట్‌గా వెళ్లే సదుపాయం. అన్నీ అధునాతనంగా వున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో 'ఎ అండ్ ఇ' ఎడమ పక్కవుంటే, కుడివేపు రిసెప్షన్

ఏరియా, క్యాంటీన్ వున్నాయి. చాముండేశ్వరి, బాలరాజుకి హాస్పిటలంతా చూపించాక 'కాపీ యేద్దాం, రండి' అంది. బాలరాజు కాదనలేదు.

బాలరాజు తనతో కాఫీ తాగడానికి వచ్చినందుకు చాముండేశ్వరి మురిసిపోయింది.

'డా్క్టారూ - మీ దగ్గర పొగరు లేదు. మంచోరు. మాంచి గొప్ప డాక్టరనియెందరో సెప్పారు. మీలా అన్నీ వున్నోరు మా హాస్పిటలుకి పని చేయడానికి రాటం అదురుస్టం.'

'డాక్టర్లకి పొగరుండకూడదు'

'కరెస్టండి. వుంటే ఆడెదవే. డా్క్టుకాడు.'

'మీరెప్పుడూ యిలాగే మాట్లడతారా?'

'అదుగో - మీరలా మీరు అనబోకండి డా్క్టారూ - సేమూ అని పిలండి సాలు.'

'సేమూ - అంటే చామూ అనా?'

'ఆయ్. చాము. మరి నా పేరు సాముండేసరి గదండీ.'

'ఓకె. చామూ' నవ్వాడు బాలరాజు.

'అయ్ బాబో - నాకు హేపీసే హేపీసు.

ఇయాల్నించీ మీరు నా పేనం.'

'నీ సంతోషం కంటేకావల్సిందేముంది?'

'ఆ మాటన్నారు సాలు. ఈ రోగాల కొంపలో మీకేం కావాలన్నా సూసుకుంటాను. మీరడగడమే తరవాయి. పెద్దోరు. రిసప్సను గుంటకి గౌరవం సేసారు. సవస్కారం అనేటి మాట వూరికే పుట్టనేదండి' అంటూ చాముండేశ్వరి పొంగిపోయింది.

**మంచాలన్నీ** రోగులతో నిండివున్నాయి. పడుకున్న రోగులందరూ పైలోకానికి వెళ్లే రైల్లో బెర్తులు బుక్ చేసుకుని పడుకున్నట్టు వున్నారు. అంతా డబ్బున్న వారిలాగే వున్నారు. డబ్బున్న జబ్బున్న వారిలా కూడా వున్నారు.

'వచ్చేసినాను డా్క్టారూ' అంటూ మందాకిని, పేషెంట్‌ని పరీక్ష చేస్తున్న బాలరాజుని పలకరించింది. జూనియర్‌కి సలహాలిచ్చాక బాలరాజు 'సో హేపీ' అంటూ మందాకినిని పలకరించాడు.'

'మన కె.జి.హెచ్ కంటే యిక్కడ సందడి శానా తక్కువలాగుందండి.'

'అలాగే అనిపిస్తోంది.'

'మనకి తెలిసిన స్టాఫు యింకోరన్నా తగిలారా డాక్టారూ.'

'నో. కానీ కింద చాముండేశ్వరి అని రిసెప్షనిస్ట్ వుంది. నీలాగే అందగత్తె. నీలాగే మాట్లాడుతుంది. నీ సిస్టరంటే నమ్మేయొచ్చు. మంచి పిల్లలాగా వుంది.'

'ఆయ్. సాముండి నాకు తెల్సండి. అడపా దడపా పేసెంట్లు వచ్చినప్పుడు పరిసయం. సాయం అంటే పేనవిస్తది. మంచి గుంట.'

మధ్య మధ్యలో మాట్లాడుకుంటూ రౌండ్స్ పూర్తి చేశారు. నాగదాసు పిలుస్తున్నారని వార్డ్‌బోయ్ చెప్పాడు. బాలరాజు వెళ్లి కనిపించాడు. యమ్ ఎల్ ఏ హనూరావుగారు గాల్ బ్లాడర్ సర్జరీ కోసం ఎడ్మిట్ అవుతున్నార్ట. జాగర్తగా వ్యవహరించమని బాధ్యత అప్పగించారు. బాలరాజు. ఓ.కె అని బైటికొచ్చాడు. పేషెంటుకి డబ్బున్నా లేకపోయినా, పవరున్నా లేకపోయినా బాలరాజు ఏకాగ్రతకీ, పని తనానికే తేడా వుండదు. అందర్నీ తన సొంత మనుషుల్లానే చూస్తాడు.

కింద క్యాంటీన్లో రేఖ కనిపించింది.

'నేను నెక్స్ వీక్ జాయినవుతున్నాను' అంది.

'వెరీగుడ్ గ్రేట్ న్యూస్' అన్నాడు బాలరాజు.

'ఎలావుందిక్కడ నీకు?' అడిగింది రేఖ.

'ఏదీ. యింకా అలవాటు పడుతున్నాను. సోఫార్ సో గుడ్'

''ఏవిటి ఈవినింగ్ ప్రోగ్రామ్'

'ఏవీ అనుకోలేదు. అన్నట్టు యివాళ నైట్ ఆన్ కాల్ చెయ్యాలనుకుంటా. చెక్ చేస్తా'

'ఇట్సోకె. వియి మీట్ లేటర్' అని రేఖ బై చెప్పింది.

బాలరాజు పై ఫ్లోర్‌కి వెళ్లాడు. అంతా హడావుడిగా అటూ యిటూ తిరుగుతున్నారు. ఎమ్మెల్యే హనూరావుగారు ఎడ్మిట్ అయ్యారు. తను ఆయన రూముకి వెళ్లి పరిచయం చేసుకున్నాడు. హనూరావుగారు పొలిటికల్ పొగరేం చూపించకుండా పొలైట్‌గా మాట్లాడారు. కొండంత పుచ్చకాయ కూడా కత్తి పీటకు తల వొంచాల్సిందే అధికారం, దర్పం, డబ్బూ, దస్కం అన్నీ రోగానికి బానిసలే. అయినా హనూరావుగారు చికిత్సకోసం మార్పు తెచ్చుకున్నట్టు లేరు. స్వతహాగానే సౌమ్యుడనిపించేరు బాలరాజుకి.

'అయితే నా గాలిబ్లాడర్‌లో గాలి తీసేస్తే నొప్పి తగ్గిపోతుందన్నమాట' అన్నారు హనూరావు.

'గాలి బ్లాడర్ కాదు సార్. గాల్ బ్లాడర్. రాళ్ళు పేరుకున్నాయి. ఆపరేషన్ చేశాక సమస్యేం వుండదు' బాలరాజు చెప్పాడు.

'ఈ పాలిటిక్స్‌లో బతకాలంటే గుండె రాయి చేసుకోవాలంటారు. కానీ నేను కడుపు రాయి చేసుకున్నానన్నమాట' నవ్వాడు.

బాలరాజు కూడా నవ్వు కలిపాడు. హనూరావుగారికి ప్రీ ఆప్ చెక్స్ చేసి, మర్నాడుదయం నిల్‌బై మౌత్ వుండాలని చెప్పి కదిలాడు.

సాయంత్రం దాటింది. దీపాలు వెలిగాయి. రిసెప్షన్‌లో చాముండేశ్వరి యింకా యింటికి వెళ్ళలేదు. బాలరాజు వార్డ్సులో పని పూర్తిచేసుకుని, డ్యూటీ రూమ్‌కి వచ్చి ముఖం కడుక్కుని కాస్త ఫ్రెష్ గా తయారయి కిటికీలోంచి దీపాల్తో విరివిగా వెలుగుతున్న విశాఖ నగరాన్ని చూశాడు. అతనికి బేస్ మెంట్‌లో తాళం వేసున్న హాల్‌లో ఏముందో తెలుసుకోవాలనే తహ తహ తగ్గలేదు. క్రిందకి వెళ్ళాడు.

'డ్యూటీ అయిపోలేదా?' అని చాముండేశ్వరిని అడిగాడు.

'ఇయాల వోవరు టయివు సేత్తున్నానండి' చాముండేశ్వరి నవ్వుతూ చెప్పింది.

'దా. కాఫీ తాగుదాం' పిలిచాడు బాలరాజు.

రిసెప్షన్ చూసుకోమని మరో కుర్రాడికి అప్పచెప్పి 'పదండి' అంది. ఇద్దరూ క్యాంటీన్‌కి నడిచారు. ఇద్దరూ కూచున్నాక చాముండేశ్వరి అడిగింది. 'ఎలాగుంది డాక్టారూ యీడ? ఆ కె.జి.ఎచ్ కన్నా యిక్కడ సుకవేనండి. పేసెంట్లు తక్కువ కదాండి మరి. అంచాత.'

'నిజమే అన్నట్టు గుర్తొస్తోంది. కె.జి.హెచ్ నుండి యీ మధ్యనే ముగ్గురో నలుగురో పేష్ంట్స్ యిక్కడికి స్పెషల్ ట్రీట్‌మెంట్ కోసం ట్రాన్స్‌ఫర్ అయ్యారు. వాళ్ల ముఖాలు నాకు బాగా గుర్తు. పైన వార్డ్సులో వాళ్లు కనబడలేదు,

'పేర్లేవన్నా తెలుసాండీ.'

'గుర్తుపెట్టుకోలేదు.'

'పేర్లు తెలీపోతే కట్టవండి. అయినా పైకెల్లిపోనారేమో - సెప్పడం కట్టవండి' అంది చాము.

కాఫీ సిప్ చేస్తూ బాలరాజు అడిగాడు.

'చామూ - నాకో హెల్ప్ చైగలవా?'

'మీరడగాలా డాక్టారూ. అడగండి. సేనవిచ్చేత్తా'

'ప్రాణం వద్దులే. బేస్‌మెంట్‌లో తాళం వేసున్న హాలు ఆ రోజు చూడ్డం కుదరలేదు. అదేవిటో చూడాలని వుంది.'

'అదేదో రీచెచ్చిట. బాసెవర్నీ యెల్నివ్వడు. అక్కడెప్పుడూ సెక్యూరిటీ బాచిగాడు కాపలా. మీకోసం ఏవైనా సేత్తా. నానోసారి బాచిగాడితో రగస్సింగా బేటీ యేత్తా. నాకొదిలీండి డాట్రారూ' అని హామీ యిచ్చింది చాముండేశ్వరి.

బాలరాజు కృతజ్ఞతా పూర్వకంగా చాము చేతిని నొక్కాడు.

'అయిబాబో - బలే యేడిగా వుంది మీ సెయ్యి' అని చాము అంటూంటే ఆమె బుగ్గలు ఎర్రగా అయిపోయాయి.

'యెంటనే సెప్తా డాట్రారూ' అని హామీ యిచ్చింది చాము.

'సరే పైన కాల్సేవన్నా వుంటాయి. మళ్లీ కలుద్దాం' అని బాలరాజు లేచాడు. చాముండేశ్వరి కూడా కదిలింది.

మర్నాడు వుదయం భానురావుగారి ఆపరేషన్ పూర్తయింది. నాగదాసే చేశాడు. అంతా అనీవెంట్‌ఫుల్. పోస్టాపరేటివ్ కేర్ బాలరాజుని చూసుకోమని చెప్పాడు. భానురావు నిద్రలేచాక బాలరాజు అన్ని పరీక్షలు చేసి కాసేపు కబుర్లు చెప్పాడు. భానురావుకి బాలరాజు దేవుడిలా అనిపించాడు. రెస్టు తీసుకోండి, మళ్లీ వస్తానని చెప్పి బాలరాజు హాస్పిటల్ వదిలి తన రూమ్‌కి బైల్దేరాడు.

బాచిలర్స్ డెన్ బాల్కనీ మీద అంతా ప్రశాంతంగా వుంది. తానీషాని చూసి కొద్దిరోజులైంది. అతని టైమంతా హసీనా బేగంతోనే గడుపుతున్నట్టుగా వుంది. పాహియాన్‌ని, హిస్టరీ వర్మగారిని కలిసి కూడా కొద్దిరోజులైంది. సముద్రంకేసి చూస్తుంటే నీరు దూరంగా వున్నా బాగా లోతుగా అనిపిస్తోంది. వీచుగాలి బీచ్‌గాలి, ముఖాన్ని హాయిగా తాకుతోంది.

'బాలూ' వెనుకనుంచి పిలుపు. వెనక్కి తిరిగాడు.

'సర్ప్రైజ్' అంటూ నవ్వుతూ కనిపించింది రేఖ.

'నువ్వా! ఎప్పుడొచ్చావ్?' ఆనందాతిశయంతో అడిగాడు బాలరాజు

'యిందాకే' అంటూ దగ్గరకొచ్చి అతని మెడచుట్టూ చేతులు వేసింది. తను కాస్త తడబడ్డాడు.

'డోంట్ వర్రీ - నల్లతంబి బజారు కెళ్లాడు. చాలా ఆలస్యంగా వస్తాడు' అంది మాటల్లో కాస్త మత్తు కలిపి.

ఎన్నేళ్ల తర్వాతో కలుసుకున్న ప్రేమికుల్లా యిద్దరూ, వొకర్నొకరు కౌగిలించుకున్నారు. వాళ్లిద్దరి మధ్య సముద్రపుగాలికి వూపిరాడలేదు.

నల్లతంబి చేసిన వుప్మా యింకా వేడిగానే వుంది. ఇద్దరూ తిన్నారు. కాఫీలు తాగారు.

'సాయంత్రం యింటికి రా. మావయ్యని ప్రోపర్‌గా పరిచయం చేస్తాను.

'సీను హెవీ అవుతుందేమో.'

'అంటే.'

'అంటే -నీ స్థాయి వేరు - నా అంతస్తు వేరు. నిన్నకాక మొన్న వుద్యోగంలో చేరావ్. నీకెన్ని గుండెలు- యిలా సాగితే?'

'ఓ - అదా - అవును. మావయ్యకి అంతస్థు క్రేజు వుందని నాకు తెలుసు. ఏ జంట అయినా, పెద్దవాళ్లు వొప్పుకున్నా, వొప్పుకోకపోయినా వాళ్ల బ్రతుకు వాళ్లదే.

'తనకి నచ్చినా, నచ్చకపోయినా నువ్వు చెప్పింది నిజం. మనం ఒకటై వేరే వుంటాం.'

'అయితే ఓ పనిచేస్తా. నేను మావయ్యతో ముందు మాట్లాడి యీ విషయం అర్థం అయేలా చెప్తా. ఆ తర్వాత యిద్దరం మావయ్యని కలుద్దాం.'

'జాగర్త - వుద్యోగానికి యెసరు పెట్టకుండా చూడు.'

'నోవే' - నవ్వింది రేఖ.

మర్నాడు యమ్మెల్యే భానురావ్, బాలరాజుతో చాలాసేపు మాట్లాడాడు. ఓ పట్టాన వదల్లేదు. బాలరాజంటే యెంతో యిష్టం పెంచేసుకున్నాడు. బాలరాజుకి పొలిటీషియన్స్ అంటే ప్రమాదకరమన మనుషులనే భావన వుండేది యింతకు ముందు. కానీ భాను పరిచయంతో అందరూ అలాగే వుండరనిపించింది.

'బాబూ! రోజు రోజుకీ రాజకీయ నాయకులంటే ప్రజల్లో గౌరవం బాగా తగ్గిపోతోంది. నాకు డబ్బుకు లోటులేదు. ఇంకా కావాలనే ఆశలేదు. నిష్కల్మషంగా ప్రజాసేవ చేసి నాలుగు కాలాలు వాళ్ల మనస్సుల్లో ఒక మంచి వ్యక్తిగా నిలిచిపోవాలన్నదే నా కోరిక. డాక్టర్లను చాలామందిని చూశాను. కానీ నువ్వేదో వేరు.'

'మీ అభిమానానికి ఏం చెప్పాలో తెలీడం లేదు సార్. చేసే పని బాగా చెయ్యగలగాలి. వొప్పుకున్నపని వొప్పుకున్నట్టు వొప్పుగా చెయ్యాలి. ఇది మా నాన్నగారు నూరిపోశారు. అంతేసార్' అన్నాడు బాలరాజు.

'అయామ్ సో హాపీ' - అన్నాడు భానురావు.

'రేపే మీ డిశ్చార్జి' అన్నాడు బాలరాజు.

'మన పరిచయం కొనసాగుతూనే వుంటుంది డాక్టర్ బాబూ'

అంటూ బాలరాజు చెయ్యిని ఆప్యాయంగా నొక్కారు భానురావు.

'వయసులో చిన్నవాణ్ని. బాలూ అనండి చాలు' అన్నాడు బాలరాజు.

భానురావుగారు కళ్లనిండా నవ్వుతో 'ఓ.కె.బాలూ' అన్నారు.

**రాత్రి పదకొండు దాటింది.** అక్కడో దగ్గు, యిక్కడో మూలుగు తప్ప 'క్యూర్' హాస్పిటల్‌లో అలజడి లేదు. దీపాలు వెలుగు తగ్గి నిద్రపోతున్నట్టుగా వున్నాయి. అవాళ మందాకిని, బాలరాజు కూడా నైట్ డ్యూటీలో వున్నారు. నాగదాసు యింకా హాస్పిటల్లో వున్నాడో, యింటికి వెళ్లిపోయాడో ఎవరికీ తెలియదు. రేఖ మాత్రం హాస్పిటల్లో లేదు. రిసెప్షన్లో చాముండేశ్వరి రాత్రి షిఫ్టు చేస్తోంది.

'ఇక్కడ నేను చూసుకుంటాను. మీ పని మీరు చూసుకోండి' అని మందాకిని, బాలరాజుకి హామీ యిచ్చింది.

'ఓకే' అని బాలరాజు క్రిందకి దిగాడు. రిసెప్షన్‌లో చాముండేశ్వరితో బాచి నవ్వుతూ కబుర్లాడుతున్నాడు. 'ఈడే బాచిబాబు డాక్టారూ' అంది చాము.

'తాళం తీసాను సార్. మీరెల్లి సూసి రండి' బాచి వినయంగా చెప్పాడు.

'బాసు లేరు అయినా బేగొచ్చేసేండి' చెప్పింది చాము.

బాలరాజు ఆ యిద్దరికీ థాంక్సు నవ్వొకటి విసిరి, తాళం తీసిన తెలియని గది వేపు నడిచాడు. తలుపు తీస్తే అది గదికాదు. విశాలమైన వార్డు. పదహారు పడకల దాకా వున్నాయి. పధ్నాలుగు బెడ్స్‌మీద పేషెంట్స్ వున్నారు. అందరూ డ్రిప్స్ మీదే వున్నారు. మధ్యలో నడుస్తూ అటూ యిటూ పరీక్షగా చూస్తున్నాడు బాలరాజు. పడుకున్న పేషెంట్లెవ్వరూ నిద్రపోతున్నట్టుగా లేదు. శూన్యంలోకి వెర్రిగా చూస్తూ జీవచ్ఛవాల్లా వున్నారు. బెడ్స్ పక్కన సైడ్ టేబుల్స్ మీద ఫైల్స్ వున్నాయి. కేసు నోట్సులు అయివుంటాయి. బాలరాజు ఒక్కొక్క కేసు నోట్సు తీసుకుని చదవడం ప్రారంభించాడు. అందరూ డయాబెటిక్ పేషెంట్సే. అంతా డయబోలిక్ అనే కొత్త డ్రగ్ మీద వున్నారు. ఇంతలో ఎంట్రీ డోర్ కిర్రున చప్పుడైంది. బాలరాజు వెంటనే కేసు నోట్సు మూసేసి యధాస్థానంలో పెట్టేశాడు. వెనక్కి చూస్తే యెవరూ లేరు. గాలికి తలుపు కదిలి వుంటుందనుకున్నాడు. మళ్లీ వెనక్కి వచ్చి పేషెంట్సుని చూశాడు. ఒక రెండు ముఖాల్ని గుర్తించగలిగాడు. ఆ యిద్దరూ కె.జి.హెచ్ నుంచి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చినవాళ్లే. మరో యిద్దరు కనిపించలేదు. ఏవయ్యారో? పేషెంటెవ్వరూ స్మారకంలో వున్నట్టు లేరు. వెర్రి చూపుల్తో, బిగిసిపోయిన ముఖాల్తో డమ్మీల్లా వున్నారు. బాలరాజుకి చాలావరకూ అర్ధమైంది. ఇక అక్కడ యెక్కువ సేపు వుండడం మంచిది కాదు. వీలైతే మరోసారి రావొచ్చు అనుకుని ఆ రహస్య వార్డు వదిలి మళ్లీ రిసెప్షన్ దగ్గరకు వచ్చాడు.

'థాంక్యూ చామూ, థాంక్యూ బాచీ' అన్నాడు.

‘సరే సార్. తవరు మల్లా సూడాలనుకుంటే మన సాముండికోమాట సెప్పండి. నేనెల్తా‘ అని బాచి తన కాపలా పనికి కదిలాడు.

‘సూసారా - డాట్రారూ - నానెప్పుడూ సూల్లే‘ అంది చాముండేశ్వరి.

‘థాంక్సు చామూ. చూశాను. రీసేర్చి పేషెంట్స్ వార్డులా వుంది. వీలైతే మరోసారి చూస్తాను.‘

‘తప్పకుండా డాట్రారూ. మీరొక్కమాట సెబితే బాచిగాడితో మల్లా యార్పాటు సేత్తా.‘ హామీ యిచ్చింది చాముండేశ్వరి.

‘పైన పనుంటుంది. మళ్లీ కలుద్దాం‘ అని బాలరాజు పై వార్డుకి కదిలాడు.

‘ఇక్కడంతా కొయిటు, సమస్సలేం లెవ్వు. మీరెల్లిన పనేవైంది? చూసేరా? ఏటుందక్కడ?‘

‘చాలావుంది. డయాబెటిక్ పేషెంట్స్ మీద యేదో రీసెర్చి చేస్తున్నట్టున్నాడు. ఎందుకింత రహస్యంగా చేస్తున్నాడో అర్థం కావడంలేదు. నువ్వో హెల్పు చెయ్యాలి‘ అన్నాడు బాలరాజు.

‘తప్పకుండా. ఏం చెయ్యాలో చెప్పండి. తప్పకుండా చేస్తాను‘ అంది మందాకిని.

‘నువ్వూ, చాముండేశ్వరీ కలిసి క్రింద వార్డులో పేషెంట్స్ వివరాలు సేకరించాలి. ఎంతమంది అడ్మిట్ అవుతున్నారు. ఎంతమంది డిశ్చార్జి అవుతున్నారు. డెత్స్ ఏవన్నా వున్నాయా? మీరిద్దరూ ఎలా చేస్తారో తెలీదు. కానీ మీరిద్దరూ చెయ్యగలరనే నమ్మకం నాకుంది.‘

‘మాకొదిలేండి డాట్రారూ, సాముండితో మాట్లాడతాను. మీకన్నివరాలు తొరలోనే తవ్వేసి తీసుకొత్తాను‘ అని మందాకిని హామీయిస్తూ చెప్పింది.

‘ఇవాళ క్రింద కెళ్లి చూశాక, వొక అయిడియా వచ్చింది. లక్కీగా నాగదాసు యీ టైములో యిక్కడెక్కడా వున్నట్టులేదు.‘

‘మరేనండి. ఆడికింకా సేనా యాపకాలుండుంటాయి.‘

‘అన్ని సంగతులూ మనకి తొందర్లోనే తెలుస్తాయి.‘

‘కాఫీ సైనా డాట్రారూ.‘

‘చెయ్యి. నీ అభిమానం కాఫీకంటే బాగుంటుంది.

‘ఏదోలెండి. వొంటిమీద సెయ్యేద్దావనుకునే డాకటర్ల కంటే, వొల్లూ, మనసూ వొంపేసి పజ్జేసే డాకటర్లంటే నాకు వల్లమాలిన యిట్టం‘ అంటూ మందాకిని కాఫీ కలపడానికి నడిచింది.

బాలరాజు డ్యూటీ రూములోకి వెళ్లాడు. ఆలోచిస్తున్నాడు. నాలుగురోజుల్లో నిజాలు వొక్కొక్కటీ బైటికొస్తాయి. నాగరాజుని యెలా యెదుర్కోవాలి. రేఖ దూరమైపోకుండా యెలా చూసుకోవాలి - యిలా యెన్నో ఆలోచనలు.

మందాకిని కాఫీ తెచ్చి యిచ్చింది.

'ఇవాళ వెరైటీకి రకరకాల రుచులు తెచ్చాను' అన్నాడు పాహియాన్ బాల్కనీలో టేబుల్ మీద డిషెస్ అమరుస్తూ.

'అయితే నాకియ్యాల పన్లేదండి' అని నల్లతంబి బైల్దేరాడు.

'పాహియాన్ వచ్చాడంటే మనకి పండగ భోజనమే' అన్నారు హిస్టరీ శర్మగారు.

బాచిలర్స్ డెన్ బాల్కనీ మీదికి చల్లటి సముద్రపుగాలి వీస్తోంది. పిట్టగోడ దగ్గర కనకాంబరం మొక్క పువ్వుల్తో విరవీగుతోంది.

బాలరాజు తన క్యూర్ హాస్పిటల్ డిస్కవరీ గురించి శర్మగారికీ, పాహియాన్‌కీ చెప్పాడు.

'రీసెర్చితో మెడికల్ రివల్యూషన్ యేదో సాధించాలనుకుంటున్నాడనిపిస్తోంది.'

'అంత రహస్యంగా యెందుకు చేస్తున్నాడో తెలీదు. ఇందులో యేదో మెలిక వుంది' అన్నారు హిస్టరీ మేష్టారు.

'ఆ రహస్యాన్నే ఛేదించడానికి ప్రయత్నిస్తున్నాను' - అన్నాడు బాలరాజు.

'జాగర్త బాలూ. నువ్వు చెప్పిన హిస్టరీ ప్రకారం ఆ నాగదాసు చండశాసనుడిలా అనిపిస్తున్నాడు. అలాంటి వాళ్లు యెంతకేనా తగుదురు.'

'తెలుసు. అన్ని జాగర్తలూ తీసుకుంటున్నాను. అసలు విషయం త్వరలోనే తెలుస్తుంది.'

'ఈ సంగతి రేఖకి తెలుసా?'

'లేదు. ఇంకా నేనేం చెప్పలేదు. తనకే తెలీదు. ఆ పేషెంట్స్ గురించి మరికొన్ని వివరాలు తెలిశాక మాట్లాడతాను.'

'గుడ్ అన్నీ తెలుసుకున్నాకే చెప్పడం మంచిది' అన్నారు శర్మగారు.

అంతా భోజనాలు మొదలెట్టారు.

'తానీషాను చూసి చాలా రోజులైంది' అన్నాడు బాలరాజు.

బహుశా హసీనా బేగంతో పాకిస్థాన్ హాలీడేకి వెళ్లాడేమో.'

'పోనీలే ఏదో రకంగా సెటిలయ్యాడు. తనకి నచ్చిన జీవితం దొరకడం అతగాడి అదృష్టం.' - అన్నారు శర్మగారు.

'ఎవరూ లేని ఏకాకిని నేనొక్కణ్నే అనిపిస్తోంది' - అన్నాడు పాహియాన్.

'అవునోయ్ - అదీ నిజమే. నువ్వు కొద్ది రోజులు మన బాలుతోపాటే ఆ హాస్పిటల్‌కి వెళ్ళు. ఏ నర్సు పిల్లో దొరక్కపోదు.' - అన్నారు శర్మగారు నవ్వుతూ.

'పిల్ల మాటెలా వున్నా - కాస్త నలుగుర్నీ చూస్తే నాలుగు విషయాలు తెలుస్తాయి. వస్తానంటే తీసుకు వెళ్తా. నీకెప్పుడు కుదురుతుందో చెప్పు' - అన్నాడు బాలరాజు.

'పాహిమాం, పాహిమాం' అన్నాడు పాహియాన్.

రోజులు గడుస్తున్నాయి. బాలరాజుకి యీమధ్య నాగదాసు కనబడలేదు.

ఒకరోజు అనుకోకుండా విశాఖ బీచ్ వొడ్డున కొత్తగా ప్రారంభించిన సన్ అండ్ సీ హోటల్ నించి ఫోన్ వచ్చింది - భానురావ్‌గారి దగ్గర్నుంచి. ఈ మధ్యనే మినిష్టర్ అయ్యార్ట - ఆరోగ్య శాఖకి. బాలరాజుతో ఆప్యాయంగా మాట్లాడారు. ఒకరోజు లంచ్ కి రమ్మని పిలిచారు. తను రేఖను కూడా తీసుకొస్తానని చెప్పాడు. ఎంతో సంబరపడిపోయారు. తప్పకుండా తీసుకురమ్మన్నారు.

తను రేఖకి చెప్పాడు. 'హెల్త్ మినిష్టర్ నీకు పెర్సనల్ ఫ్రెండా'? అంటూ రేఖ వుబ్బి తబ్బిబ్బయ్యింది. బాలరాజు, రేఖ సన్ అండ్ సీకి భానురావుగారితో లంచ్‌కి వెళ్లారు.

తూర్పు సముద్రం పక్కన 'సన్ అండ్ సీ' హోటల్ పశ్చిమ వాతావరణంతో ప్రగల్భంగా వుంది. రిసెప్షన్‌లో తెలుగు పిల్లలు స్తనాలు సగం కనిపించేలా రవికల్లాంటివి తొడుక్కున్నారు. ఇంగ్లీషుని రోల్ చేస్తూ తెలుగు గ్రామరుతో బుసబుసా మాట్లాడుతున్నారు. హోటల్ వెనుక సముద్రం వేపు యిసుకలో చెట్లూ, చేమలూ అందంగా మొలిచినట్టు పాతారు. అక్కడ చాలా టేబిల్స్, ఛైర్సూ వున్నాయి. భానురావుగారు చిరునవ్వుతో యెదురొచ్చి, బాలరాజునీ, రేఖనీ వొక టేబిల్ దగ్గర కూర్చోపెట్టి, తనూ కూర్చున్నారు. వస్తూంటే రిసెప్షన్ ఏరియాలో కొంత మంది వినయంగా లేచి నిలబడి నమస్కారాలు పెట్టారు. భానురావుగారు వాళ్లని పెద్దగా పట్టించుకున్నట్టులేదు. ముగ్గురూ వొక టేబిల్ దగ్గర కూర్చున్నారు. దూరంగా మరో టేబిల్ దగ్గర వొక తెల్ల జంట కూర్చుని స్నాక్స్ తింటున్నారు. ఇంకా దూరంగా యింకో టేబిల్ దగ్గర యిద్దరు చైనా వాళ్లు కూర్చుని స్నేక్స్ తింటున్నారు.

'మనం స్టార్టర్స్‌గా పకోడీలు తిందాం' అన్నారు భానురావు. అప్పటికే ఆర్డరు చేసినట్టున్నారు. పకోడీలు వచ్చాయి.

'మన భోజనం యిక్కడేనా?' అడిగాడు బాలరాజు.

'ఇక్కడే ఇదివరకు భోజనం లోపల చేసి, కాలకృత్యాలు బైట తీర్చుకునేవాళ్లం. ఇప్పుడు రివర్స్. భోజనం బైట. కాలకృత్యాలు లోపల. నాగరికత' నవ్వుతూ చెప్పారు భానురావు.

రేఖ నవ్వు కలిపింది.

'నువ్వు కూడా డాక్టరే కదూ' అని మళ్లీ అన్నారు.

'అవునండి' అని బదులు చెప్పింది రేఖ.

'అయితే మా బాలు, డాక్టరికి మొగుడన్నమాట' భానురావుగారు చమత్కరించారు.

బాలరాజు, రేఖ జంటగా నవ్వారు.

ఇంతలో మెయిన్ కోర్స్ వచ్చింది. కబుర్లు సాగుతున్నాయి.

'ఇది నా పెర్సనల్ టెలిఫోన్ నెంబరు. ఎప్పుడైనా నన్ను డైరెక్టుగా కాంటాక్ట్ చేయవచ్చు. ఏ చిన్న సాయమైనా నాతో మాట్లాడ్డానికి సందేహించవద్దు.' అంటూ భానూరావు బాలరాజుకి వొక నెంబరు రాసి యిచ్చారు. బాలరాజు నెంబరు తీసుకుని జాగర్తగా జేబులో పెట్టుకున్నాడు.

మీటింగు యీటింగు తర్వాత ముగ్గురూ లేచారు. 'పెళ్లికి పిలవడం మర్చిపోవద్దు' అని భానూరావు బైబై చెప్పారు. బాలరాజు, రేఖ వొకర్నొకరు చిరునవ్వులతో సిగ్గుపడుతూ చూసుకోడం మానేసి చాలా వారాలయింది.

'యిసయం శానా పోగయింది డాటారూ!' అంది మందాకిని క్యూర్ హాస్పిటల్ కాంటీన్లో కాఫీ టేబుల్ దగ్గర బాలరాజుతో.

'యిన్నాల్లుగా యిక్కడ పంజేత్తన్నా యీ యవ్వారం అంతా యిప్పుడే తెలిసింది. నాకు నోరడిపోనాది' అంది చాముండేశ్వరి యెదురుగా వున్న బాలరాజుతో.

'వెరీగుడ్ వర్క్. అంతా వివరంగా చెప్పండి' అన్నాడు బాలరాజు.

మందాకిని మాట్లాడింది. 'మీరు చూసిన రగస్యం వార్డులో డయాబిటిక్కోల్లని పోగేసి, అందరికీ ఆ కొత్త మందు ఏటదీ?'

'డయబాలిక్' అందించాడు బాలరాజు.

'అదే ఆ డవిబాలిక్ అందరికీ యిత్తన్నాడు నాగదాసు.

అదిచ్చినాల్లందరికీ స్మారకం పోతోంది. ఆల్లంతా ఆ మందు తీసుకున్నాక పిచ్చి ముకాలేసుకుని, కదల్లేక అలాగే పడుకుండిపోయి, కప్పుకేసి గుడ్లప్పగించి చూస్తా వుండిపోతన్నారు.' మందాకిని ఆగింది. చాముండేశ్వరి అందుకుంది - 'ఆరిలో వారానికి యిద్దరు, ముగ్గురూ పైకెల్లిపోతున్నారు. పోయినోల్లని యెనక డోర్లోంచి యెవరికీ తెలీకుండా సావులమదుంకేసి వాన్‌లో సాగనంపేత్తన్నారు. ఏవయ్యారని యెవురడిగినా మాకు తెల్దంటే మాకు తెల్దని తప్పిం చేసుకుంతన్నారు. ఈ యవ్వారం నెల్లతరబడి సాగుతోంది.'

మందాకిని మధ్యలో అందుకుంది. 'పోయినోల్లందరూ మంచోల్లు, వార్డులో వున్నోల్లు ఆల్ల తీపి గురుతులు' 'అంటే' - అడిగాడు బాలరాజు.

'తీపి గురుతులంటే మిగిలి యేల్లాడుతున్న డయాబిటిక్కోల్లు.'

'నిజమే. ఇది చాలా సీరియస్ మేటర్. నాగదాసు చేసేది రీసెర్చి కాదు. అమాయకుల ప్రాణాలతో ఆడుకుంటున్న నరమేధం' బాలరాజు వుద్రేకంగా లేచాడు.

'యేం సేద్దారిప్పుడు?' అడిగింది చాముండేశ్వరి.

'చెయ్యాల్సిందొక్కటే. ఈ అరాచకాన్ని ఆపాలి. నాగదాసుని లేపాలి.

'అంటే లేపెయ్యాలి - అరదమైంది డ్రాటారూ' అంది మందాకిని.

'మీరిద్దరూ చాలా గొప్ప సాయం చేశారు. మీరు లేకపోతే యివన్నీ యీజీగా తెలిసేవి కావు' అన్నాడు బాలరాజు.

'మీరు మంచోరు డ్రాటారూ - మీకోసం మేవిద్దరం యెనక సూపులు సూడం. నాయం, దర్మం అంటే మీలాగా మాకూ పేనమే' అంది చాముండేశ్వరి, మందాకినితో చూపు కలుపుతూ.

'ఆ మాట చాలు నాకు. నేను రంగంలోకి దిగుతాను. మీరు నా వెనక వుంటే చాలు. మనం మళ్ళీ కల్సుకుందాం' అని బాలరాజు కదిలాడు.

మందాకినీ, చాముండేశ్వరి కదిలే బాలరాజుని ప్రేమ గౌరవాలతో చూస్తూవుండిపోయారు.

బాచిలర్స్ డెన్ బాల్కనీ మీద హిస్టరీ శర్మగారు పాహియాన్, బాలరాజు మాట్లాడుకుంటున్నారు.

'వీడికిదేం రోగం' అని ముక్కుమీద వేలేసుకున్నారు అంతా విన్న హిస్టరీ శర్మగారు.

'కొత్త మందు మార్కెట్లోకి వదిలి మిలియన్సుతో కోట్ల మూటలు కట్టుకుపోదావని ఆశ ఆ నాగదాసుగాడికి' అన్నాడు పాహియాన్.

'నెక్స్ట్ స్టెప్ ఏదో ఆలోచించి వెయ్యి. ఆ నాగదాసు పాముని కూడా కాటేసే రకం' అన్నారు శర్మగారు.

'ఈ విషయం ముందుగా రేఖతో మాట్లాడనా అని ఆలోచిస్తున్నాను' అన్నాడు బాలరాజు.

'ఎంతైనా మావయ్యకదా. ఎదురు తిరిగితే?' అడిగాడు పాహియాన్.

'రేఖ అర్థం చేసుకుంటుందనే నా వుద్దేశం. ఆమె అన్యాయం సహించదు. తప్పుని యెదుర్కోడంలో తన పర భేదాల్లేవు తనకు.'

'అయితే సందేహం దేనికి? ఆమె నీకు తోడయితే పరిష్కారం మరింత సుళువు' అన్నారు శర్మగారు.

'నాగదాసుని యెలా యెదుర్కోవాలా అని -' అన్నాడు బాలరాజు.

'ఎలా యేవిటి? అలాంటి వాడితో యుద్ధం తప్పదు. ధర్మ రక్షణ కోసం రాముడు బాణాల్ని, క్రిష్ణుడు చక్రాన్ని ధరించలా? దేవుణ్ని ప్రార్ధించు. ధర్మాన్ని నమ్ము. ధర్మ రక్షణకు పోరాడేవారికి వోటమి వుండదు' అన్నారు హిస్టరీ శర్మగారు.

'అవును. మాస్టారు చెప్పింది హిస్టరీ. మన బాలరాజు యిప్పుడా హిస్టరీకి కొత్త పేజీలు తగిలిస్తాడు' అన్నాడు పాహియాన్.

'రేపే రేఖని కలుస్తాను. మరికొన్ని ప్రాణాలు అన్యాయానికి ఆహుతి కాకుండా అడ్డుకోవాలి' అని బాలరాజు నిశ్చయంగా అన్నాడు.

క్యూర్ హాస్పిటల్ డౌన్ ఫ్లోర్‌లో రహస్య వార్డు తలుపు తాళం తీసి నమస్కారం పెట్టి వెళ్లాడు బాచిబాబు.

బాలరాజు, రేఖ వార్డులోకి ప్రవేశించారు. లోపలికి అడుగెట్టగానే పేషెంట్స్‌ని చూస్తూ రేఖ వొక్కసారిగా విస్మయభరితురాలైంది.

'అయామ్ జస్ట్ షాక్‌డ్ బాలూ' అంది.

'చూడు. వీళ్లంతా డయాబెటిక్స్. కేస్ నోట్స్ చూడు. అంతా డయబాలిక్ మీదే వున్నారు. చూశావా! ఎవ్వరికీ యేమీ తెలీదు. జీవచ్ఛవాల్లా అంతా ట్రాన్స్‌లో వున్నారు' అన్నాడు బాలరాజు.

రేఖ బెడ్స్ దగ్గరికి నడుస్తూ, కేస్ నోట్స్ చూస్తూ 'మావయ్య నాతో వొక్కరోజు కూడా యీ రీసెర్చి ప్రాజెక్టు గురించి చెప్పలేదు.'

'చెప్పడానికి ఇదేం న్యాయబద్ధమైన ప్రొటోకాల్స్ అనుసరిస్తూ చేసే రీసెర్చికాదు. కొన్ని నెలలుగా యెంతమంది పోతున్నారో తెలిస్తే షాకవుతావు.'

'మన ట్రైనింగ్ ప్రాసెస్‌లో మావయ్య ప్రైవేట్ లైఫ్, ఆయన హాస్పిటల్ వ్యవహారాల్లో యెప్పుడూ తొంగి చూసేందుకు కూడా నేను ప్రయత్నించలేదు.' అంది రేఖ. 'ఏం చేద్దాం చెప్పు' అడిగాడు బాలరాజు.

'ఇదంతా బైట పెట్టాల్సిందే మావయ్యను నిలదీసి అడగాల్సిందే బాలూ - నువ్వు చేద్దామనుకున్నది చెయ్యి. నా చెయ్యి యెప్పుడూ నీ చేతిలోనే వుంటుంది' రేఖ కచ్చితంగా మాట్లాడింది.

'మన విషయంలో మీ మావయ్య దక్షుడయ్యే అవకాశంవుంది.'

'ఆయన దక్షుడైతే నువ్వు నా శివుడివి.

నేను మాత్రం దగ్ధం కాను. అవసరమైతే నీ మూడో కన్ను అరువు తీసుకుని అవసరం బట్టి తెరుస్తాను.'

'నాకు తెలుసు రేఖా. ఎప్పుడో నువ్వు నాలో సగం అయిపోయావు. చేసే ధర్మ రక్షణేదో యిద్దరం కలిసే చేద్దాం.' అన్నాడు బాలరాజు.

'అయామ్ ఆల్వేస్ విత్‌యు' అని రేఖ బాలరాజు విశాలమైన గుండెల మీద తల ఆనించింది. ఇద్దరూ వార్డు చివర్లో వున్నారు. ఇంతలో అవతలివేపు తలుపు దగ్గర యేదో అలికిడి అయింది.

బాలరాజు గోడ దగ్గరకు వెళ్లి స్విచ్ ఆన్ చేసి అన్ని లైట్లూ వేశాడు.

'ఇక్కడున్నారా? మీ కోసమే చూస్తున్నాను సరైన చోటే కలుసుకున్నాం' తలుపు దగ్గర బెడ్ పక్కన నిలబడిన నాగదాసు మాటలవి. అతన్ని చూసి బాలరాజు, రేఖ అదిరిపడలేదు. ఇద్దరూ నాగదాసుని కఠినంగా చూశారు. నాగదాసు మళ్లీ అన్నాడు. '- ఈ రీసెర్చి గురించి, యీ వార్డు పర్యవేక్షణ గురించి మీతో మాట్లాడదామనుకుంటున్నాను. ఈ రీసెర్చిలో యాక్టివ్ పార్టు తీసుకుని యిక మీరే యీ పేషెంట్స్‌ని మానిటర్ చెయ్యాలి. ఈ న్యూ డ్రగ్ అవుట్ కమ్ మనల్ని కొత్త శిఖరాలకు చేరుస్తుంది. డయాబెటిస్ మానేజ్ మెంట్ హిస్టరీలో మనల్ని ప్రాణదాతలుగా వుదహరిస్తూ టెక్స్ట్ బుక్స్ అన్నీ మనపేర్లతో పాఠ్య భాగాలయి, కొత్త డాక్టర్లకు వెలుగు చూపిస్తాయి. ఇకముందు డయాబెటిక్స్ చావుని వెక్కిరించి ఆరోగ్యంగా అందరిలా హాయిగ బ్రతుకుతారు."

'స్టాపిట్' అరిచాడు బాలరాజు - అరిచాక మళ్లీ అన్నాడు.

'నీ రీసెర్చ్‌కి యిప్పటిదాకా యెంతమంది అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారో లెక్కపెట్టావా?

'మీరు లోంచి నువ్వులోకి వచ్చేశావన్నమాట.'

'నిన్ను నువ్వు అనకుండా అనవసరమైన మర్యాదనిపిస్తోంది. పేషెంట్స్ పట్ల నువ్వు ప్రవర్తించే తీరుకి, వారితో అతిహీనంగా మాట్లాడే నీ సంస్కారానికి నిన్ను వొక డాక్టరుగా అనుకోవడమే అమర్యాద.

'పేషెంట్స్‌తో నేను యెప్పుడేనా కాస్త కటువుగా వుంటే వుండివుండొచ్చు. అది వారి మంచికే. అయినా నేను పేషెంట్స్‌తో మాట్లాడ్డం నువ్వెన్నిసార్లు ఫాలో అయ్యావు గనుక?'

'నన్ను గుర్తుపట్టలేదా?' అడిగాడు బాలరాజు. నాగదాసు మాట్లాడలేదు. కానీ ప్రశ్నార్ధకంగా చూశాడు.

**'ఇప్పుడు గుర్తు** పట్టడం కష్టమేలే,' - బాలరాజు అన్నాడు.

'చాలా యేళ్లయింది. అప్పుడు నేను కుర్రాణ్ని. ఇప్పుడు యెదిగాను. అయినా నువ్వు అందరి పేషెంట్స్‌తో నీచంగానే ప్రవర్తిస్తావు. విడిగా నేనెందుకు గుర్తుంటాను?

'పేషెంట్స్ మీద డాక్టర్‌కి కంట్రోల్ వుండాలి. లేకపోతే వాళ్లే మనకి యేం చెయ్యాలో చెప్తారు. అయినా నేను చేసేదంతా వాళ్ల ఆరోగ్యం కోసమే' అన్నాడు నాగదాసు.

'కమ్యూనికేషన్‌తో రోగి తొంభై శాతం కోలుకుంటాడని గ్రేట్ డాక్టర్ ఆస్లర్ చెప్పాడు. ఆ సూత్రం నీ రొటీన్లో లేదు. నీలాంటి రాతి గుండె వాడికి చెప్పినా అర్ధం కాదు.'

'నేను నీకు చాలా సీనియర్ని. ఎంతో అనుభవంగలవాడిని. నువ్వు నేర్చుకోవాల్సింది యెంతో వుంది.'

'నేర్చుకోవడమంటే అమాయకులైన యీ మనుషుల ప్రాణాలతో చట్ట విరుద్ధంగా రీసెర్చి ఆట ఆడుకోవడమా?'

'ఈ మందు యెంతో మందికి అందుబాటులోకి వచ్చాక నీకు తెలుస్తుంది, ఎన్నివేల మంది డయాబెటిక్స్ చావుని జయించి హాయిగా ఆరోగ్యంగా వుంటారో. నేను చేసేది చట్ట విరుద్ధమైన రీసెర్చి కాదు. ప్రాణదానం. అశేష ప్రజానీకానికి వూపిరి పోసే గ్రేట్ ఇన్వెన్షన్. మనం కలిసి పనిచేస్తే అతి త్వరలో అనుకున్నది సాధిస్తాం.'

'ఎన్నో వేలమందికి ప్రాణదానం అంటున్నావ్. మరి యిక్కడ వీళ్ల ప్రాణాల సంగతి?' బాలరాజు అడిగాడు.

'వారానికి యిద్దరు, ముగ్గురు పోతున్నారు. వీళ్లకీ బ్రతికే హక్కుంది. వీళ్లూ మనుషులే' రేఖ అంది.

'వీళ్లకి యేం జరుగుతోందో తెలియదు. తెలియకుండానే నీ చేతిలో తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు' బాలరాజు కోపంగా అన్నాడు.

'అవతల వేల ప్రాణాలు నిలబడుతున్నప్పుడు, యిద్దరు, ముగ్గురు పోతే నష్టం యేం లేదు. ఒక గొప్ప పని సాధించాలంటే యీపాటి త్యాగం వో లెక్కలోది కాదు' అన్నాడు నాగదాసు.

'నీ ఆలోచనలు, మా ఆలోచనలు కలవ్వు మావయ్యా' అంది రేఖ.

'నీ రీసెర్చి నువ్వు చెయ్యి. మేం చేసేది మేం చేస్తాం' అన్నాడు బాలరాజు.

'బాగా ఆలోచించుకోండి. తొందరపడితే పరిణామాలు యెలా వుంటాయో మీకు అయిడియా లేదు.'

'భయపెడుతున్నావా? ఇప్పుడు పరిణామాల గురించి ఆలోచించుకోవాల్సింది నువ్వు. అంచేత నువ్వు తొందరపడితే మంచిది.' నిర్ధారిస్తూ చెప్పాడు బాలరాజు.

కాసేపు ముగ్గురి మధ్యా నిశ్శబ్దం.

బాలరాజు, రేఖ దూసుకుంటూ అక్కణ్నించి వెళ్లిపోయారు. నాగదాసు వెళ్లిపోతున్న వాళ్లను వెనుకనుంచి చూస్తూ విషపునవ్వు నవ్వు నవ్వుకున్నాడు. తన నవ్వు విషపు నవ్వని నాగదాసుకి తెలియదు.

క్వాలిటీ రెస్టారెంట్‌లో అలలవైపు డెక్ మీద అంతా కూర్చున్నారు. బాలరాజు, రేఖ, చాముండేశ్వరి, మందాకిని, హిస్టరీ శర్మగారు, పాహియాన్ - పెద్ద మీటింగే.

'నాకీ యిసయం తెల్నే తెల్దు' అంది చాముండేశ్వరి.

'గొప్ప రివలేసనైపోనాది నాకు' అంది మందాకిని.

'జనాల్ని సంపేత్తన్నాడు ఆణ్ని సంపేసెయాల్సిందే' అందించాము.

పాహియాన్' ఐస్క్రీమ్ చెప్పనా మీకు చాముగారూ' అన్నాడు ఆమె యెత్తు పల్లాలకేసి చూస్తూ.

'సెప్పవోయ్ సైనా మాంత్రికుడా' అంది చిలిపిగా చాము.

'గో ఎ హెడ్ బాలూ నేనెప్పుడు నీతోటే' అంది రేఖ.

'వెంటనే యీ దారుణానికి ఫుల్‌స్టాప్ పెట్టేయాల్సిందే' అన్నారు హిస్టరీ శర్మగారు.

'కానీ వాడు దేవాంతకుడు మీరిద్దరూ జాగర్త' అని హెచ్చరిక చేశారు కూడా.

'అంతా ఆలోచించాను' అన్నాడు బాలరాజు కాఫీ తాగడం పూర్తిచేసి.

'మా డాట్రుగారు యేం జేసినా నికార్సుగానే వుంటది' మందాకిని కచ్చితంగా చెబుతున్నానన్నట్టు చెప్పింది.

ఆ సాయంత్రపు చల్లటి సముద్రం గాలుల్ని అంతా హాయిగా పంచుకున్నారు. మరో కాస్సేపు కబుర్లతో గడిపి అంతా లేచారు. పాహియాన్ చాముండేశ్వరిని దూరంగా యిసుకలోకి తీసుకువెళ్లి యిష్టంగా మాట్లాడుతున్నాడు. హిస్టరీ శర్మగారు పదో నెంబరు బస్సు వస్తోంది నే కదుల్తా అని లేచారు. 'నానూ మీతోపాటే' అంటూ మందాకిని కూడా కదిలింది. బాలరాజు, రేఖ బాచిలర్స్ డెన్ వేపు బీచ్‌లో నడిచారు. నల్లతంబి వంట చేశాడు. ఇద్దరూ బాల్కనీలో కూర్చుని భోంచేశారు.

తర్వాత బాలరాజు మంత్రి భానురావిగారిచ్చిన ప్రైవేట్ నెంబరుకి ఫోన్ చేశాడు. భానురావుగారు లైన్లోకొచ్చారు. బాలరాజు అంతా వివరించాడు.

'మిగతా సంగతి నాకొదిలెయ్ నువ్వు నిశ్చింతగా వుండు' అని భానూరావుగారు బాలరాజుకి హామీ యిచ్చారు.

మర్నాడే క్యూర్ హాస్పిటల్లో ఎంక్వయిరీ ప్రారంభమైంది. అరడజనుమంది అధికారులు, పోలీసు వున్నతాధికారులు వచ్చి హాస్పిటల్ రికార్డ్సు అన్నీ పరిశీలిస్తూ అందర్నీ రకరకాల ప్రశ్నలడుగుతూ హడావుడి చేశారు. ఇదంతా తెలిసినట్టుంది. నాగదాసు హాస్పిటల్కి రాలేదు. జరగాల్సిన ఆపరేషన్లు వాయిదాపడ్డాయి.

హెల్త్ సెక్రటరీ బాలరాజు, రేఖలతో ఫోన్లో మాట్లాడాడు. హాస్పిటల్కి రమ్మని తర్వాత పర్సనల్గా కూడా కలిశాడు. ఎంక్వయిరీకి మరింత సమాచారం తీసుకున్నాడు.

నాగదాసు యిక క్యూర్ హాస్పిటల్కి రాడనీ యిక మీదట అతనికి హాస్పిటల్తో ఏ సంబంధం వుండబోదనీ తెలియబరిచాడు. అన్నీ తేలేదాకా బాలరాజు, రేఖ క్యూర్ హాస్పిటల్ మేనేజ్మెంట్ వ్యవహారాలు, పేషెంట్స్ చికిత్సా సదుపాయాలు అన్నీ చూసుకోవాలని ప్రభుత్వం తరఫున మాట్లాడి ఖరారు చేశాడు.

ఆ మధ్యాహ్నం నాగదాసు, మందాకినికి యింటికి వచ్చి కలవమని కబురు పెట్టాడు.

మందాకిని వెళ్లి నాగదాసుని చూసింది. ఆమె వెళ్లేసరికి నాగదాసు, సినిమాలో పెద్ద విలన్ రౌడీలకు ఆర్డర్లిస్తున్నట్టు, తన పనివాళ్లకి, పనివాళ్లలా కనిపించే రౌడీలకు, రౌడీల్లా కనిపించే పనివాళ్లకు ఆదేశాలిస్తున్నాడు. మందాకిని వెళ్లగానే తన రౌడీల మీటింగు ఆపి, వాళ్లని వెళ్లమని ఆమెను పిలిచాడు. రౌడీలు పక్కగదిలోకి వెళ్లి మందాకిని ఏం చెబుతుందోనని పొంచి వింటున్నారు.

'ఏం జరుగుతోందక్కడ?' అనడిగాడు నాగదాసు.

'ఏటుంటదండి. తవకి తెలిసేవుంటది. ఎల్తు మినిస్టిగారి మంద ఆసిపిటల్ పేగుల్లెక్కడుతున్నారు. తవరింక అటొొత్తారో లేదో అనుమానమేనండి.' అంది మందాకిని అతని యెదురుగా సోఫాలో రాణీలా కూర్చుంటూ.

'ఇదంతా ఆ బాలరాజుగాడి పనే. మా రేఖని కూడా వల్లో వేసుకున్నాడు. వాడికి మూడింది' అన్నాడు నాగదాసు.

'ఏటండి మూడేది. ఆయనకి మినిస్టిగారి సపోర్టు. రాజు తల్చుకుంటే దెబ్బలకి కొదవా? మంత్రిగారు తల్చుకుంటే మర్డర్లకి లివిటా' చెప్పింది మందాకిని.

'అంతదాకా యెందుకు? నాలుగు తగిలిస్తే నోరెత్తడు'

'మీ దెబ్బలు వూరంతా యినబడతాయి. మంత్రిగారు కొడితే సడీ సప్పుడూ వుండదు. మళ్లీ లేవరు' మరోసారి వాత పెట్టినట్టు చెప్పింది మందాకిని.

నాగదాసు నోట మాటలేదు. కాస్త నిశ్శబ్దం తర్వాత 'నే యెల్తా' అని మందాకిని లేచి వీధిలో కొచ్చేసింది.

కాస్సేపటికి నాగదాసు తేరుకుని రౌడీల కోసం అరిచాడు. కానీ యెవరూ రాలేదు. చాటునుండి అంతా విన్న రౌడీలు అప్పటికే జారుకున్నారు. నాగదాసుకి తన సామ్రాజ్యం కూలిపోతునట్టుగా అనిపించి, వొక్కసారి కుర్చీలోంచి లేచి అంతలోనే కుప్పకూలిపోయాడు. అవాళ అతడికి అన్నం హితవు కాలేదు. ఆ రాత్రి నిద్ర అసలు రాలేదు. మర్నాడు పోలీసులు అరెస్టు వారెంట్‌తో నాగదాసు కోసం వచ్చారు కానీ అతడు కనబడలేదు. అతని గుమాస్తా పోలీసుల నోట్లో నోట్లు కూరి సాగనంపాడు. మళ్లా నాగదాసు పేరుగానీ, ప్రసక్తిగానీ యెక్కడా వినబడలేదు. అతడు వుండే యిల్లు రేఖదైపోయింది. దేశంలో పవరుంటే చట్టాలన్నీ చుట్టాలయిపోతాయి.

క్యూర్ హాస్పిటల్లో దొంగ రీసెర్చి వార్డు మూసేసారు. బాలరాజు, రేఖ యాజమాన్యంలో హాస్పిటల్ వున్నత ప్రమాణాలతో సేవలందిస్తోంది. మందాకిని 'క్యూర్'కి సూపరింటెండ్ అయింది. చాముండేశ్వరి యంత్రాంగానికి యిన్‌ఛార్జ్‌గా ఛార్జ్ తీసుకుంది. ఓ రోజు పాహియాన్ చాముండేశ్వరిని కలవడానికి వచ్చాడు.

'నువ్ కూడా వొచ్చెయ్. ఇక్కడ మాతోపాటు పన్జేయచ్చు.' అంది చాముండేశ్వరి.

'బలేదానివే. టేకవేని నమ్ముకున్నాను. టేకవే నన్ను నమ్ముకుంది. నీకు రోజూ మంచి ఫుడ్డు పెట్టాలిగా నేను. అంచేత నన్నిలాగే వుండనీ. నన్ను లాగేసుకుంటూ వుండిపో' అన్నాడు పాహియాన్.

'అనుమానం లేదు. మనవెప్పుడూ యిడిపోని జంటే' అంది ప్రేమగా చాముండేశ్వరి.

రోజులు గడుస్తున్నాయి. రోగాలు గతిస్తున్నాయి. రోగులు వూపిరి తీసుకుంటున్నారు.

హిస్టరీ శర్మగారు వొకరోజు బాలరాజుని పిలిచి చెప్పారు. అన్నీ సర్దుకున్నాయి ఇక నువ్వు పెళ్లి చేసుకుంటే బావుంటుంది' అని.

'నేనూ అదే అనుకుంటున్నాను. రేఖా, నేనూ మాట్లాడుకుని త్వరలోనే డేట్ ఫిక్స్ చేసుకుంటాం' అన్నాడు బాలరాజు.

విశాలమైన యింట్లో బాలరాజు, రేఖ విహంగాలు ఆకాశంలో విహరిస్తున్నట్టు తిరుగుతున్నారు. బాలరాజు బాచిలర్స్ డెన్ ఖాళీ చేసి వచ్చేసాడు. నల్లతంబి కూడా కూడానే వచ్చాడు. తానీషా కలిసి చాలా రోజులైంది. తను యిక్కడికి మారాననీ, వస్తే తానీషాకు, హసీనా బేగంకి కూడా సదుపాయాలన్నీ వున్నాయనీ, యెప్పుడు కావలిస్తే అప్పుడు రావచ్చనీ

కబురు పెట్టాడు. లంకంత యిల్లు. హిస్టరీ శర్మగారిని కూడా 'వొక్కరూ యెందుకు - మాతో వుండండి' అని ఆయనకు వొక ప్రత్యేకమైన గది యేర్పాటు చేసి పిలిచాడు. మూడంతస్తుల భవనం. గదులకేం లోటు లేదు. చుట్టూ పెద్ద గార్డెను. వెనుక వైపు మరీ విస్తృతంగా వుంది. గార్డెన్ మధ్యలో అందమైన కొలను. కొలనులో చెదురుమదురుగా కళకళలాడుతున్న అందమైన పువ్వులు. బాలరాజు, రేఖ కొలను గట్టుమీద కూచున్నారు. రేఖ యేదో ఆలోచిస్తోంది.

'మావయ్యని మిస్ అవుతున్నావా?' అడిగాడు బాలరాజు.

'ఛ.ఛ. శని విరగడైందని స్వేచ్ఛగా ఫీల్ అవుతున్నాను. మావయ్య యింత రోగ్ అని యెప్పుడూ వూహించలేదు. అయ్యో! అనుకోడానికి అంత అభిమానాన్ని తనెప్పుడూ నాపట్ల చూపించలేదు. అయినా అమాయకుల్ని చంపే క్రూరమృగంతో అనుబంధాలెందుకుంటాయ్ అయామ్ హేపీ.' అంది రేఖ కొలనులో నీళ్ల కెలుకుతూ.

'నువ్వు తెలిసావు కాబట్టి, యీ ఘోరం తెలుసుకునే అవకాశం కలిగి ఆపగలిగా' అన్నాడు బాలరాజు.

'అవును. నువ్వు తెలిసావు కాబట్టి' అంటూ రేఖ గలగలా నవ్వింది. ఆమె నవ్వుకి గాలి కదిలి కొలనులో అలలు కొంచెం కదిలాయి. పువ్వులు తలలూపాయి.

**ప్రాణం పోసుకుంటున్న** పగటి వెలుగులా 'క్యూర్' హాస్పిటల్ దీపాలు నీరసంగా వెలుగుతున్నాయి. మందాకిని మందగమనంలా నడుస్తోంది. మంచాలమీద రోగులు వెల్లకితలా పడుకుని వున్నారు. బాలరాజు అవాల్టి పోస్ట్ ఆపరేటివ్ పేషెంట్సుని చూస్తున్నాడు.

'డాక్టారూ! యిన్నారా?' అంది మందాకిని.

'ఏవిటి వినడం?' అడిగాడు బాలరాజు.

'నాగదాసు దొరికాట్ట'

'ఎక్కడ?'

'యారాడ కొండ దగ్గర తారాడుతూంటే పోలీసోల్లు అట్టుకున్నార్ట.'

'అలాగా'

'ఆన్నట్టుకుని సేనా రోజులైంది. కేసుకూడా నడిచింది.'

'ఏం కేసు.'

'ఇంకేటుంటది. ఆడి పయోగాలకి పేసెంట్లు పొయ్యారుగదా - అదేదో అసంకలిపిత హత్య కేసు. ఆణ్ని మూసేసారు. అగితే లైపివ్వనేదు. మూన్నాలుగేల్లుంటాడేమో'

'చాలు. ప్రజలకి మంచి జరిగింది.'

'ఆడి పొగరు యిరిగింది.'

'అలాంటివారి గురించి ఆలోచనలు మానేద్దాం. మనుషుల ఆరోగ్యం కోసం కష్టపడి పనిచేద్దాం'

'అద్గదీ.. తవరేం సెప్పినా నాటుకునేలా సెప్తారు,' అని మందాకిని ముందుకి నడిచింది.

అవాళ రేఖ హాస్పిటల్ నుండి త్వరగానే యింటికి వెళ్లిపోయింది. యింటిపనులు చూసుకోడానికి.

నాగదాసు సంగతి విన్నాక బాలరాజుకి తల్లీ, తండ్రీ గుర్తొచ్చారు. వయసు పెరుగుతున్నా తను పుట్టిన వూరిలో వారు క్షేమంగా ప్రశాంతంగా వున్నారు. తను యీ యేడాది రెండుసార్లు వెళ్లి చూసొచ్చాడు. అక్కడెందుకు, విశాఖ వచ్చేసి తనతోపాటు వుండమని మరీ మరీ చెప్పాడు. కానీ తమకు అక్కడ బావుందనీ యిప్పట్లో కదిలే ఆలోచన లేదనీ అన్నారు. బాలరాజుని పెళ్లి చేసుకోమని చాలాసార్లు చెప్పారు. త్వరలోనే చేసుకుంటానని బాలరాజు వారికి హామీ యిస్తూనే వున్నాడు. మంత్రిగారు భానూరావు కూడా రెండూ మూడుసార్లు అడిగారు. పనిలో నిమగ్నమైన బాలరాజుకి మాత్ర తొందరేం అనిపించటంలేదు. అప్పుడప్పుడు రేఖ మాత్రం అనేది - రిలీజు వాయిదాపడుతున్న సినిమాలాగా యెప్పుడు మరీ - అంటూ.

ఇద్దరూ హాస్పిటల్‌లో రోగులకు సదుపాయాలు చికిత్సా విధానాలు అభివృద్ధి చెయ్యడంలో యెప్పుడూ తీరికలేకుండానే వుంటున్నారు. ఇంట్లో మనిషిలాంటి హిస్టరీ మేష్టారు, బాలరాజు, రేఖ వాళ్ల భవంతిలోకి మారి నిజంగా యింట్లో మనిషైపోయారు. పాహియాన్ టేకవేలు తింటూ చాముండేశ్వరి కాస్త వొళ్లు చేసింది. తానీషా, హసీనా బేగం ఆ మధ్యనే యుకె వెళ్లారు. అక్కణ్నించి అడపాదడపా బాలరాజుని తానీషా పలకరిస్తూనే వున్నాడు. మిగతా స్నేహితులంతా తలో చోటికీ చెదిరిపోయారు. నెలలు యేళ్లవుతున్నాయి.

అవాళ ఆత్మీయులందరినీ యింటికి భోజనానికి పిలిచారు బాలరాజు, రేఖ.

'ఏవిటి విశేషం?' అని అడిగాడు పాహియాన్. 'తానీషా, హసీనా బేగం యు.కె నుంచి హాలీడేకి వచ్చారు. మనందర్నీ చూడాలని యెంతో ఆరాటంగా వున్నారు' అని చెప్పాడు బాలరాజు.

బాలరాజు, రేఖ తమ గృహానికి 'అనుగ్రహం' అని పేరు పెట్టారు. మిత్రబృందం అంతా అనుగ్రహం మేడమీద పెద్ద టేబుల్ చుట్టూ కూర్చున్నారు. నల్ల తంబి హుషారుగా నల్లభీమపాకాలు రకరకాలు వండి రెడీ చేశాడు.

'చెప్పవయ్యా తానీషా - ఏవిటి మీ లండన్ విశేషాలు?' అనడిగారు హిస్టరీ శర్మగారు.

'ఈ మధ్య వొక నాలుగురోజులు బాగా యెండకాసింది. అదే విశేషం. అంతకుమించి రోగాలు రొచ్చులు మామూలే'

'మరి వైద్య వసతులు యెలావుంటాయి?'

'అక్కడ అందరికీ వైద్యం ఫ్రీ. పేషెంటుకి ప్రయారిటీ యెక్కువ. డాక్టర్లకి ఎక్కౌంటబిలిటీ వుంటుంది. ఎవరిష్టం వచ్చినట్టు వాళ్లు వైద్యం చెయ్యడానికి వీల్లేదు.'

'బావుంది - మన దేశాన్ని తగలెట్టి వాళ్ల దేశాన్ని బాగానే చూసుకుంటున్నారన్నమాట.'

'వాళ్లు మనల్ని తగలెట్టిందేముంది లెండి. అన్నీ మనమే చేసుకుంటున్నాం.' అన్నాడు తానీషా.

'అదీ నిజమే. వాళ్లు పరాయి దేశాన్ని దోచుకుని తమ దేశాన్ని బాగుచేసుకుంటారు. మనవాళ్లు సాటివాణ్ని దోచుకుని పరాయి వాడికి వూడిగం చేస్తారు. ఈ మాట హిస్టరీలోనే ఘోషిస్తోంది.' అన్నారు శర్మగారు.

'అయినా మనోల్లకి వల్లమాలిన తెల్లమోజెక్కువండి' అంది చాముండేశ్వరి.

'అన్నట్టు నీకు చాముండేశ్వరి తెలుసా. మన హాస్పిటల్‌కి ఎడ్మినిస్ట్రేటివ్ యిన్ ఛార్జి' బాలరాజు తానీషాకి చాముండేశ్వరిని సముచితంగా పరిచయం చేశాడు.

'ఓసారెప్పుడో చూసినట్టు గురుతు. ఇక మరిచిపోయే ప్రసక్తే లేదు, నమస్తే చాముండేశ్వరిగారూ' అన్నాడు తానీషా.

'బలేటోరే, నన్ను సామూ అనండి సాలు. మీ గూర్చి మా పావియాను సానా మాట్లు సెబుతాడు. ' నవ్వుతూ అంది చాముండేశ్వరి.

మందాకిని ముందుకి వొంగి 'కసింత కూరేసుకోండి - సేనా బాగుంది' అంటూ శర్మగారికి కూర వొడ్డించింది. ఆమె వంగినప్పుడు వుబికి వూరెత్తిస్తున్న ఆమె హృదయసంపద. వయసు పెరిగిన శర్మగారికి వెళ్లిపోయిన యవ్వనాన్ని గుర్తుచేసింది. ఆయన అడిగారు ' నీ మొగుడేం చేస్తాడమ్మాయ్' అని.

'మొగుడా - మొద్దులా - నాకుంటేగా' మందాకిని ఆగి అంది. 'మీరు బావున్నారు - నన్నుగాని సేసుకుంతరేటి?"

"ఓసి నీ యిల్లు బంగారం కానూ - ముసిలిపీనుగుని నీకు నేనే దొరికానా' అన్నారు శర్మగారు.

'హౌ ఎబౌట్ - గోయింగ్ ఫర్ ఎ వాక్ - విశాఖపట్నం వీధుల్లో నడిచి చాలారోజులైంది' అన్నాడు తానీషా.

'బావుంది సజెషన్. రండి - అంతా సరదాగా అలా కె.జి.హెచ్ వేపునడుద్దాం. నేను అప్పలరాజు కిళ్లీ కొట్టు దగ్గర వుప్పు చెక్క, యాలకల పండు కిళ్లీ కట్టించుకుంటాను' అన్నారు శర్మగారు.

అంతా రోడ్డెక్కారు. వెన్నెల పుచ్చపువ్వులా వుంది. రోడ్లమీద జనం యింకా తగ్గలేదు. జగదాంబా థియేటర్లో యేదో కొత్త సినిమా, ప్రేక్షకులు హాలు ముందు గుంపులుగా వున్నారు. కె.జి.హెచ్ వోపీ గేటు దగ్గర రోడ్డుమీంచి సైకిల్ రిక్షాలు వేగంగా యెల్లమ్మ తోటవేపు జారుతున్నాయి. అందరూ కబుర్లు చెప్పుకుంటూ కలెక్ట్రాఫీసు జంక్షన్ చేరారు. శర్మగారు అప్పలరాజుకి కిళ్లీ పురమాయించారు. కొట్టుముందుగా వున్న బెంచీమీద యిద్దరు ముగ్గురు కూచున్నారు. అజంతా హోటల్ ముందున్న బస్‌స్టాప్‌లో వ్యక్తులు వాళ్లని చూసి గుర్తుపట్టినట్టుగా గుసగుసలాడుకుంటున్నారు.

'మన వొయిజాగులో యీ సేచ్చ యింకేడ దొరుకుద్ది' అంది చాముండేశ్వరి.

'లక్షలు ఖర్చుపెట్టినా లండన్‌లో కూడా దొరకదు' అన్నాడు తానీషా.

'అలా కోస్టల్ బేటరీ వేపు బీచ్‌లోకి నడుద్దావేవిటి?' అన్నాడు పాహియాన్.

'వద్దు - చూశారా - పైన చంద్రుణ్ని మబ్బులు కమ్మేస్తున్నాయి. వెన్నెల పోయి వర్షం కురిసినా కురవొచ్చు - అన్నారు శర్మగారు.

'అయితే - అంతా వెనక్కే నడుద్దాం మరి' అన్నాడు బాలరాజు.

మళ్లీ అంతా తిరుగు ముఖం పట్టారు. కె.జి.హెచ్ ఎంట్రీ గేట్ దాటారు. పేవ్‌మెంట్ పక్కనే రెండు పాత టాక్సీలు పార్క్ చేసి వున్నాయి. అంతలోనే సన సన్నగా చినుకులు పడటం ప్రారంభించాయి. వెన్నెల సన్నగిల్లి మసక చీకటి మసి చల్లినట్టు అలుముకుంటోంది.

'తడిసిపోతావేమో - టాక్సీలో వెళ్దామా' అన్నాడు తానీషా.

'బలేవాడివే. అవి శవాల టాక్సీలు. ఎక్కితే తిన్నగా చావులమదుంకి తీసుకుపోతాడు' అన్నాడు బాలరాజు.

'పోనీ రిక్షాలు పిలిస్తే' అంది రేఖ.

'ఎందుకండి రేకమ్మగారూ - అప్పుడప్పుడు యిలా కుసింత తడిత్తే పేనం హాయిగా వుంటది' అంది మందాకిని. చినుకులకీ, నేలకీ అడ్డమొస్తూ అక్కడే నిలబడి వాళ్లు మాట్లాడుకుంటున్నారు. ఇంతలో వొక టాక్సీ డ్రైవరు వాళ్ల దగ్గరకొచ్చి - 'శవాన్ని డిశ్చార్జ్ చేసేసినారా బాబూ - రండి - నాబండి రెడీ' అన్నాడు. ఆ డ్రైవర్ ముఖం బాగా నల్లగా వుంది. మాసిన గడ్డం అతడి ముఖాన్ని మూసేసింది.

ఎవరా వెనుకనుంచి మాట్లాడుతున్నారని బాలరాజు యిటు తిరిగి చూశాడు. డ్రైవర్ ముఖం యెక్కడో చూసినట్టుంది. బాలరాజుని చూడగానే ఆ డ్రైవర్ వెంటనే తలదించుకుని వెనక్కి తగ్గాడు. అతడే నాగదాసు అని గుర్తుపట్టడానికి బాలరాజుకి యెంతోసేపు పట్టలేదు.

శవాన్ని తీసికెళ్లడానికి బండిలో పెట్రోలుందా?' అనడిగాడు పాహియాన్.

'లేదండి. బేరం కుదిరాక అడ్వాన్స్ తీసుకుని అల్లదిగో యెల్లమ్మతోట బంకులో కొట్టించుకుంటానండి - అని సమాధానమిచ్చాడు పక్కనున్న మరో టాక్సీ డ్రైవరు.

'మేం శవం కోసం రాలేదులే' అన్నారు శర్మగారు.

'నడవండి' అన్నాడు తానీషా.

మరికాస్త వెనక్కి తగ్గి, వొక్కసారి తలెత్తి చూశారు . శవాల టాక్సీ తోలే డ్రైవర్ నాగదాసు.

బాలరాజు, రేఖ అరక్షణం అతడిని చూసి వెనక్కి తిరిగారు. వాళ్ల చూపులో వాళ్ల భావాలు వాళ్లకే తెలుసు. ఆ చూపు తన గుండెలోకి దిగి మండుతూ వుండిపోవడం నాగదాసుకే తెలుసు.

చినుకులు తగ్గాయి. మసక చీకటి మసి తొలిగిపోయింది. వెన్నెల విశాఖపట్నం అంతా పాల సముద్రంలా విస్తరించింది.